సోమవారం
08-12-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 77
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి : 94405 73343

ఏర్పాట్లు అదరహో

గ్లోబల్ సమ్మిట్‌కు 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు రాక
పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి లక్ష్యం
నేడు సదస్సును ప్రారంభించనున్న గవర్నర్

విశాలాంధ్ర–హైదరాబాద్: తెలంగాణలో ఉన్న అపార అవకాశాలను వివరించి పెట్టుబడులను ఆకర్షించటం, యువతకు ఉపాధి కల్పించటమే లక్ష్యంగా రెండు రోజుల పాటు నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు సర్వం సిద్ధమైంది. ఇందుకోసం భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత అద్భుతంగా ఏర్పాట్లను ప్రభుత్వం పూర్తి చేసింది. సోమ, మంగళవారం జరిగే ఈ సదస్సులో 44కు పైగా దేశాల నుంచి 154 మంది అంతర్జాతీయ ప్రతినిధులు హాజరవుతున్నారు. విశ్వవ్యాప్తంగా పేరెన్నికగల కంపెనీల ప్రతినిధుల బృందాలు ఈ సమ్మిట్‌కు హాజరవుతున్నారు. ఒక్క అమెరికా నుంచే 46 మంది వివిధ కంపెనీల ప్రతినిధులు తరలివస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 1.30 గంటలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ లాంఛనంగా సమ్మిట్ ను ప్రారంభిస్తారు. సుమారు రెండు వేల మంది దేశ, విదేశీ అతిథులు ప్రారంభవేడుకకు హాజరవుతున్నారు. వివిధ అంశాలపై నోబెల్ బహుమతి గ్రహీత అభిజిత్ బెనర్జీ, ట్రంప్ మీడియా–టెక్నాలజీ గ్రూప్ సీఈఓ ఎరిక్ స్వైడర్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సీఈవో జెరెమీ జుర్గెన్స్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, బయోకాన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్–షా తదితరులు ప్రసంగించనున్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. తెలంగాణలో ప్రజాపాలన, పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వంవైపు నుంచి అందించే సహకారం, విజన్ 2047 డాక్యుమెంట్ లక్ష్యాలు, భారత్ ఫ్యూచర్ సిటీపై ముఖ్యమంత్రి ఆహుతులకు వివరిస్తారు. రెండు రోజుల్లో 27 అంశాలపై సెషన్లు జరుగుతాయి. అంతర్జాతీయ, దేశీయ అతిథులు, పెట్టుబడిదారులకు తెలంగాణతో పాటు హైదరాబాద్ ప్రత్యేకతలు తెలిసేలా ప్రచార సామాగ్రిని సిద్ధంచేశారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీలో వేదిక వరకు వివిధ రూపాల్లో వీటి ప్రదర్శన ఉంటుంది. హైదరాబాద్ వ్యాప్తంగా అత్యాధునిక టెక్నాలజీతో ప్రత్యేకంగా ప్రచార ఏర్పాట్లు చేశారు. లైటింగ్ ప్రొజెక్షన్, ప్రొజెక్షన్

- మిగతా 2 లో

ఆరో రోజూ అవస్థలే!

- 650 సర్వీసులు నిలిపేసిన ఇండిగో
- ఇబ్బందుల్లో వేల మంది ప్రయాణికులు
- 95 శాతానికి పైగా సర్వీసులు పునరుద్ధరించామన్న సంస్థ

న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా ఇండిగో కార్యకలాపాలు ఆదివారం వరుసగా ఆరో రోజు కూడా తీవ్రంగా అంతరాయం కలిగిస్తూనే ఉన్నాయి. ముంబై, ఢిల్లీ విమానాశ్రయాలలో 220 కి పైగా విమాన సర్వీసులను ఇండిగో రద్దు చేసిందని పీటీఐ తెలిపింది. ఢిల్లీ, ముంబై, గువహటి, హైదరాబాద్ వంటి కీలక విమానాశ్రయాలలో వేలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారని పేర్కొంది. చాలా మంది ప్రయాణికులు చివరి నిమిషంలో రద్దు సందేశాలు అందుకోవడం, విమానయాన సంస్థ నుంచి సరైన కమ్యూనికేషన్ లేకపోవడం, దేశ వ్యాప్తంగా విమాన షెడ్యూల్‌లు ప్రభావితమైనందున ఎక్కువసేపు క్యూలలో వేచి ఉండాల్సి రావడం గురించి ప్రస్తావించారు. తెలంగాణలోని హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం 115 విమానాలు రద్దయ్యాయి. ఇందులో 54 రాకపోకలు, 61 నిష్క్రమణలు ఉన్నాయని అధికారులు పీటీఐకి తెలిపారు. అలాగే ముంబై విమానాశ్రయంలో 112 విమానాలు రద్దయ్యాయి. ఢిల్లీ విమానాశ్రయంలో కనీసం 59 నిష్క్రమణలు, 50 రాకపోకలకు సంబంధించి మొత్తం 109 విమాన సర్వీసులు రద్దయ్యాయి. కోల్‌కతాలో కనీసం 76 విమానాలు రద్దు కాగా, ఇందులో 53 నిష్క్రమణలు, 23 రాకపోకలు ఉన్నాయని పేర్కొంది. అలాగే అహ్మదాబాద్ 20, పూణే 25, అగర్తలా 6, తిరుచ్చి 11 ఇండిగో విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఇదిలాఉండగా, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ ప్రకారం, ఇండిగో ఆదివారం 2,300 రోజువారీ దేశీయ, అంతర్జాతీయ విమానాలను నడుపుతోంది శనివారం ఆరు మెట్రో విమానాశ్రయాల నుంచి దాని ఆన్–టైమ్ పనితీరు 20.7 శాతానికి మెరుగుపడింది.

10వ తేదీ నాటికి అంతా సర్దుకుంటుంది : ఇండిగో

దేశ వ్యాప్తంగా ఆరు రోజుల పాటు గందరగోళం నెలకొన్న తర్వాత ఇండిగో

- మిగతా 2 లో

ట్రంప్ ఎవెన్యూ... గూగుల్ స్ట్రీట్!

ఫ్యూచర్ సిటీ ప్రధాన రోడ్డుకు రతన్ టాటా నామకరణం
రహదారులకు అంతర్జాతీయ కంపెనీల పేర్లు
సీఎం రేవంత్ వినూత్న ప్రతిపాదన

విశాలాంధ్ర – హైదరాబాద్ : తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినూత్న ప్రతిపాదన చేశారు. ఇప్పటికే అంతర్జాతీయ ఖ్యాతి గడించిన హైదరాబాద్‌కు గ్లోబల్ మ్యాప్‌లో మరింత చోటు కల్పించేలా సంకల్పించారు. అందుకు అనుగుణంగా ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులు, కంపెనీల పేర్లను హైదరాబాద్ లో ప్రధాన రహదారులకు పెట్టాలని నిర్ణయించారు. నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్ వద్ద రావిర్యాలను నుంచి ప్రారంభమై ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీని అనుసంధానం చేసే 100 మీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు పద్మభూషణ్ రతన్ టాటా పేరు పెట్టాలని నిర్ణయించింది. రావిర్యాల ఇంటర్‌చేంజ్‌కు ఇప్పటికే "టాటా ఇంటర్‌చేంజ్" అని పేరు పెట్టారు. అలాగే ప్రపంచంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ ముందు నుంచే వెళ్లే ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరుతో "డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ" అని నామకరణం చేయాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ నిర్ణయంపై కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖకు, అమెరికా రాయబార కార్యాలయానికి ప్రభుత్వం లేఖ రాయనుంది. ఢిల్లీలో ఇటీవల జరిగిన యూఎస్–ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరమ్ వార్షిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన ప్రకారం, హైదరాబాద్‌లోని ముఖ్య రహదారులకు ప్రముఖ అంతర్జాతీయ కంపెనీల పేర్లు పెట్టాలన్న దృష్టిలో భాగంగా మరిన్ని ప్రతిపాదనలు చేశారు. గ్లోబల్ టెక్ దిగ్గజం గూగుల్ సేవలను గుర్తిస్తూ ఒక ముఖ్య రహదారిని "గూగుల్ స్ట్రీట్" అని ప్రకటించేందుకు ప్రణాళికసిద్ధం చేశారు. మైక్రోసాఫ్ట్ రోడ్, విప్రో జంక్షన్ పేర్లను కూడా పరిశీలిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రభావితవ్యక్తులు, ప్రముఖ కంపెనీల పేర్లను రహదారులకు పెట్టడం ద్వారా వారికి సముచిత గౌరవం ఇవ్వటంతో పాటు, హైదరాబాద్ కు అంతర్జాతీయ గుర్తింపు వస్తుందని సీఎం భావిస్తున్నారు. అలాగే ఆ రోడ్లపై ప్రయాణించివారికి కూడా స్ఫూర్తివంతంగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి ఈ ప్రతిపాదన చేశారు.

సమన్వయం లేదు... సంప్రదింపులు జరగవు

ఇదే 'ఇండియా' లోపం: డి.రాజా



న్యూఢిల్లీ: ఇండియా ఐక్య సంఘటనలోని పార్టీల మధ్య సంప్రదింపులు, సమన్వయం లోపించినట్లు సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ప్రతిపక్ష కూటమికి ఇదే పెద్ద సమస్యగా మారిందన్నారు. దేశాన్ని కాపాడటం, బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ఏకమైన పార్టీలు అందుకు కట్టుబడితేనే అనుకున్న ఉద్దేశం నెరవేరగలదని డి.రాజా హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లోనైనా మెరుగైన ప్రదర్శన కోసం సమన్వయం, సంప్రదింపులు పెంచుకోవాలని సూచించారు. 'ఇండియా భాగస్వాములు సమావేశాలు పెట్టరు... సమన్వయం చేసుకోరు' అని డి.రాజా వ్యాఖ్యానించారు. ఇండియా ఐక్య సంఘటన చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉన్నారన్నారు. 'ఇండియా' భాగస్వామ్య పార్టీలు ఆత్మవిమర్శ చేసుకోవాలని సీపీఐ తరపున సూచిస్తున్నట్లు తెలిపారు. హర్యానా, మహారాష్ట్ర, బీహార్ ఎన్నికల నుంచి పాఠాలు నేర్చుకోవాలని డి.రాజా సూచించారు. 'ఇండియా'లోని లోపాలను బీహార్ ఎన్నికలు బయటపెట్టాయన్నారు. 'సరైన సీట్ల సర్దుబాటు జరగలేదు. ఉమ్మడి ప్రచారాలు

మిగతా 2 లో

నైట్ క్లబ్‌లో మంటలు

25 మంది దుర్మరణం | గోవాలో దుర్ఘటన

పనాజీ: ఉత్తర గోవాలోని అర్పోరా గ్రామంలో బిర్చ్ బై రోమియో లేన్ అనే నైట్ క్లబ్‌లో శనివారం అర్ధరాత్రి దాటాక ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. సిలిండర్ పేలడంతో మంటలు చెలరేగాయి. దీంతో 25 మంది మృతి చెందారు. సుమారు 50 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, నలుగురు పర్యాటకులు ఉన్నారని పోలీసులు తెలిపారు. మిగతా వారంతా క్లబ్ సిబ్బందిగా గుర్తించారు. కాగా, ప్రమాదం జరిగినప్పుడు నైట్‌క్లబ్‌లో సుమారు 100 మంది వరకూ ఉన్నారని, సిలిండర్ పేలడం వల్ల ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. మంటలు చెలరేగగానే కొందరు గ్రౌండ్ ఫ్లోర్ వైపు పరుగులు తీశారని, ప్రవేశద్వారం ఇరుకుగా ఉండటంతో మరికొందరు వంటగదిలోనే చిక్కుకుపోయారని పోలీసులు చెప్పారు.

డ్యాన్స్ చేస్తుండగానే...

ఘోర అగ్నిప్రమాద ఘటనపై ప్రత్యక్ష సాక్షులు కీలక వివరాలను వెల్లడించారు. వారి కథనం ప్రకారం, అర్పోరా గ్రామంలోని 'బర్చ్ బై రోమియో లేన్' నైట్ క్లబ్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు ఒక అంతస్తు ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో రిసెప్షన్, వంటగది ఉన్నాయి. మొదటి

- మిగతా 2 లో

ఇది పాలనా వైఫల్యం: రాహుల్

2లో

లారీ ఓనర్స్ సమ్మె బాట

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి : పదమూడేళ్లు దాటిన వాహనాలకు టెస్టింగ్, ఫిట్నెస్ ఫీజులను పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఏపీ లారీ యజమానుల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఫిట్నెస్ ఫీజులను పెంచుతూ కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌ను నిలిపివేయాలని లేని పక్షంలో లేదంటే మంగళవారం అర్ధరాత్రి (ఈనెల 9) నుంచి రైల్వే షెడ్లు, షిప్ యార్డుల్లో గూడ్స్ రవాణా నిలిపివేయాలని నిర్ణయించారు. ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు

- మిగతా 2 లో

10 మంది మావోయిస్టుల లొంగుబాటు

విశాలాంధ్ర–(చింతూరు): మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, పోలీస్ అధికారుల ముందు ఆదివారం పదిమంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో బాలఘాట్ జిల్లా కేబీ డివిజన్ నాయకుడిగా వ్యవహరిస్తున్న కబీర్, సహచరులైన ఎంఎంసీ జోనల్ సెక్రటరీ సురేంద్ర, జోనల్ సెక్రెటరీ రాకేష్ హోడి అలియాస్ మనీష్, సమర్, లల్బు అలియాస్ సురేంద్ర, షీలా, నవీన్, జరీనా, శిల్ప, సునీత ఉన్నారు. వారి వద్దనున్న 2 ఏకే 47 రైఫిల్స్, 2 ఇన్సాస్, యస్‌యల్‌ఆర్–1, సింగల్ షాట్ గన్లు 2 పోలీసులకు

మిగతా 2 లో

సొంత వర్గం నుంచే విమర్శలు: గవాయ్

ముంబై: రిజర్వేషన్లపై మాజీ సీజేఐ బీఆర్ గవాయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ తీర్పుతో సొంత వర్గం నుంచే విమర్శలు వచ్చాయన్నారు. ముంబై విశ్వవిద్యాలయంలో జరిగిన 'అఫర్మేటివ్ యాక్షన్ అండ్ ఈక్వల్ ఆపర్చునిటీ' అంశంపై గవాయ్ మాట్లాడుతూ... షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) రిజర్వేషన్లలో క్రీమీ లేయర్ సూత్రాన్ని అమలు చేయాలని తాను ఇచ్చిన తీర్పుపై సొంత కులం నుంచే విమర్శలను ఎదురవుతున్నట్లు వెల్లడించారు. ఇతర వెనుకబడిన వర్గాల (ఓబీసీ) కోసం అమలు చేస్తున్నట్లే ఎస్సీఎస్టీల్లో కూడా కూడా ఆర్థికంగా పురోగతి సాధించిన వారిని రిజర్వేషన్ పరిధి నుంచి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

రాజ్యాంగ దినోత్సవం మనం ఘనంగా చేసింది ఇందుకే అన్నమాట!

ఓట్ల చోరీపై నిలదీతకు

'ఇండియా' సిద్ధం

రేపు లోక్‌సభలో చర్చ ప్రారంభించనున్న రాహుల్

న్యూఢిల్లీ: అధికార–విపక్షాల మధ్య వాడివేడి చర్చలకు పార్లమెంటు మరోమారు సిద్ధమైంది. సోమవారం లోక్‌సభలో వందే మాతరంపై చర్చ ప్రారంభం కానుంది. అలాగే ఎన్నికల సంస్కరణలు, ఎస్ఐఆర్‌పై చర్చ మంగళవారం జరగబోతోంది. దీంతో రెండు సందర్భాల్లోనూ అధికార పక్షాన్ని ఇరకాటంలో పెట్టేందుకు ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. చర్చను వేడెక్కించేందుకు అన్ని అస్త్రాలను సిద్ధం చేసుకున్నాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో ఎన్నికల సంస్కరణలపై ప్రతిపక్షాల చర్చ జరగనున్నది. ఓట్ల చోరీ, ఈసీ వివక్ష అంశాలతో పార్లమెంటు దద్దరిల్లించాలని ప్రతిపక్ష సభ్యులు భావిస్తున్నారు. లోక్‌సభలో ఎస్ఐఆర్‌పై, ఎన్నికల సంస్కరణలపై

- మిగతా 2 లో

ఫుట్‌బాల్ మ్యాచ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రపంచ ప్రఖ్యాత క్రీడాకారుడు లియోనల్ మెస్సి రాక
13న రేవంత్‌రెడ్డి టీంతో ఫ్రెండ్లీ మ్యాచ్: భట్టి

విశాలాంధ్ర – హైదరాబాద్ : ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు లియోనల్ మెస్సి మ్యాచ్ అంటేనే ఫుట్‌బాల్ అభిమానులు ఉప్పొంగిపోతారు... ఈ నెల 13న హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫుట్‌బాల్ మ్యాచ్ చూసేందుకు దేశం నలుమూలల నుంచి ఫుట్‌బాల్ ప్రేమికులు తరలివస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల్లో పర్యటిస్తున్నారని చెప్పారు. ఫుట్‌బాల్ క్రీడాకారుడు

- మిగతా 2 లో

సామాజిక ఉన్నతికి జర్నలిజం పాటుపడాలి

'నేను -బహువచనం'... 'అధినాయక జయహే' పుస్తకావిష్కరణలో శ్రీనివాస్‌రెడ్డి

విశాలాంధ్ర– హైదరాబాద్ : కష్టాలు ఉంటేనే నిలదొక్కుకొని నిచ్చెన మెట్లు ఎక్కగలుగుతామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బషీర్ దేశోద్ధారక భవన్ వయోధిక పాత్రికేయ సంఘం ఉపాధ్యక్షుడు ములుగు రాజేశ్వర్‌రావు రచించిన 'నేను–బహువచనం', (ఆత్మకథ), 'అధినాయక జయహే' (కవితాసంకలనం) పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీనివాస్ రెడ్డి, ప్రత్యేక అతిథిగా (ఉమ్మడి ఏపీ) రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ కందా హాజరయ్యారు. రాజేశ్వర్ రావు రచించిన పుస్తకాలను మోహన్ కందా ఆవిష్కరించారు. వయోధిక పాత్రికేయ సంఘం అధ్యక్షులు దాసు కేశవరావు అధ్యతక్షన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ

- మిగతా 2 లో

లారీ ఓనర్స్ సమ్మె బాట

(మొదటిపేజీ తరువాయి)

అధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యాచరణ ప్రకటించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు గోపాల్ నాయుడు, కోశాధికారి నాదెళ్ల కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 13 ఏళ్లు దాటిన వాహనాల ఫిట్నెస్ ఫీజు కేంద్రం భారీగా పెంచిందన్నారు.

పాతవాహనాలపై అదనపు టెస్టింగ్, ఫిట్నెస్ ఛార్జీల పెంపు సరికాదని అన్నారు. దీనివల్ల సరకు రవాణా యజమానులపై పెనుభారం పడుతుందన్నారు. ఆ నోటిఫికేషన్ అమలును నిలిపివేసే అధికారం రాష్ట్రానికి ఉందని పేర్కొన్నారు. ఫీజులు తగ్గించేలా సీఎం చంద్రబాబు వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. లేదంటే 10వేల గూడ్స్ లారీలు నిలిపివేస్తామని ప్రకటించారు. గూడ్స్ వాహనాలకు వీఎల్టీడీలు అవసరం లేదని అన్నారు. తమపై భారం పడకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

10 మంది మావోయిస్టుల లొంగుబాటు

(మొదటిపేజీ తరువాయి)

అప్పగించారు. లొంగి పోయిన వారందరికీ పునరావాస చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ పేర్కొన్నారు. జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులు నిర్భయంగా సామాన్య జీవితం గడపవచ్చునని పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా 2026 మార్చి 31నాటికి దేశంలో మావోయిస్టులు ఉండబోరని ప్రకటించారని తెలిపారు. ఈ లొంగుబాటు కార్యక్రమం బాలాఘాట్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో బాలఘాట్ ఎస్పీ ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇండిగో గందరగోళంపై
డీజీసీఏ, విమానయాన సంస్థలకు సమన్లు?

న్యూఢిల్లీ : ఇండిగో విమానాల భారీ రద్దు కారణంగా వేలాది మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయిన తర్వాత పార్లమెంటరీ ప్యానెల్ ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ ఉన్నతాధికారులు, డీజీసీఏకు సమన్లు జారీ చేసే అవకాశం ఉందని ఈ విషయం తెలిసిన అధికారులు తెలిపారు. జేడీ(యూ) నాయకుడు సంజయ్ ఝా అధ్యక్షతన ఉన్న రవాణా, పర్యాటక, సంస్కృతిపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, విమానయాన సంస్థల నాయకులతో పాటు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారుల నుంచి వివరణలు కోరే అవకాశం ఉంది. పార్లమెంటు శీతాకాల సమావేశాల కోసం దేశ రాజధానికి వెళ్లిన ఎంపీలను కూడా ప్రభావితం చేసిన ఇండిగో విమానాల రద్దు అంతరాయం గురించి ఎంపీలు 'ఎంపీలు తీవ్రంగా గమనించారని' ప్యానెల్ సభ్యుడు ఒకరు చెప్పారు. ఇండిగో గందరగోళం సమయంలో విమాన చార్జీలు పెరగడంపై ఫిర్యాదులు కూడా వెల్లువెత్తాయి. ఇదిలాఉండగా కమిటీలో భాగం కాని సీపీఎం రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ ఇండిగో విమానాలు పెద్ద ఎత్తున రద్దు కావడంపై పార్లమెంటరీ సంయుక్త కమిటీ లేదా న్యాయ విచారణకు డిమాండ్ చేశారు. కార్యకలాపాలను సాధారణీకరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, అంతరాయాలు ఆరో రోజుకు చేరుకోవడంతో ఇండిగో ఆదివారం ఢిల్లీ, ముంబై విమానాశ్రయాలలో 220 కి పైగా విమాన సర్వీసులను రద్దు చేసింది. విమానయాన నియంత్రణ సంస్థ (డీజీసీఏ) శనివారం ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్, సీఓఓ, అకౌంటబుల్ మేనేజర్ పోర్క్వెరాస్‌లకు వివరణ కోరుతూ నోటీసులు పంపింది.

ఆరో రోజూ అవస్థలే!

(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం తన విమానయాన వ్యవస్థలో ఎక్కువ భాగాన్ని పునరుద్ధరించినట్లు తెలిపింది. 1,500 కంటే ఎక్కువ విమానాలకు కార్యకలాపాలను పెంచడం ద్వారా 138 గమ్యస్థానాలలో 135 తిరిగి అనుసంధానం చేసినట్లు పేర్కొంది. విమాన సర్వీసుల భారీ రద్దు కారణంగా వేలాది మంది ప్రయాణికులకు తీవ్ర అంతరాయం తర్వాత దెబ్బతిన్న రోస్టర్‌లు, వ్యవస్థలను పునర్నిర్మించడానికి ప్రణాళికాబద్ధమైన 'రీబూట్' లో భాగమని ఇండిగో తెలిపింది. శనివారం దాదాపు 700 విమానాలు ఉండగా ఆదివారం సాయంత్రం నాటికి 1,500 కు పెరిగాయని పేర్కొంది. ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఇండిగో తన మాతృ సంస్థ అయిన ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్ బోర్డు సంక్షోభ నిర్వహణ బృందాన్ని ఏర్పాటు చేసిందని, ఇది పరిస్థితిని పర్యవేక్షించడానికి క్రమం తప్పకుండా సమావే శమవుతుందని తెలిపింది. కంపెనీ డైరెక్టర్ల బోర్డు తన ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించడానికి, టికెట్ చార్జీ వాపసు చెల్లించేందుకు సాధ్యమైన ప్రతి దానిని చేస్తున్నట్లు తెలిపింది. తన ప్రయాణికులకు క్షమాపణలు చెప్పింది. ప్రయాణీకులు, నియంత్రణ సంస్థలలో విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నందున ఇండిగో అత్యవసర షెడ్యూల్‌ను నిర్వహించడంతో పాటు అదనపు వనరులను మోహరిస్తోంది. తమ విమానయాన సంస్థ ఇంకా 'చాలా దూరం వెళ్లాలి' అని, కానీ నమ్మకాన్ని పునర్నిర్మించడానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపింది. విమాన సర్వీసుల అంతరాయాల సమయంలో తమకు మద్దతు ఇచ్చినందుకు సిబ్బంది, కస్టమర్లు, భాగస్వాములు, ప్రభుత్వ సంస్థలకు ధన్యవాదాలు తెలిపింది.

కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి చేసింది శూన్యం

తెలంగాణపై మాట్లాడే హక్కు లేదు: మహేశ్ కుమార్

విశాలాంధ్ర-నిజామాబాద్ : కేంద్ర మంత్రిగా ఉంటూ రాష్ట్రానికి చెందిన కిషన్ రెడ్డికి తెలంగాణ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జిల్లా పర్యటనను పురస్కరిం చుకుని ఆదివారం మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద బీజేపీ నిర్వహిస్తున్న మహాధర్నాపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ... కేంద్ర మంత్రిగా ఉంటూ రాష్ట్రాభివృద్ధి పనులు చేపట్టని అసమర్థ మంత్రిగా కిషన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారన్నారు. ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని బీజేపీ నేతలు ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా చేస్తున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ... అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రజలతో శభాష్ కొట్టించుకుంటుందని, ఇది చూసి ఓర్వలేక బీజేపీ నేతలు మహా ధర్నా పేరిట తెలంగాణ ప్రజలను మోసం చేసే కుట్ర పన్నుతున్నారని మహేశ్‌కుమార్ ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కనీసం డిపాజిట్ దక్కించుకోలేని కిషన్‌రెడ్డి ఒక్కసారి ఆలోచించాలన్నారు. హైదరాబాద్‌లో గ్లోబల్ సమ్మిట్ గర్వంగా జరుపుకుంటున్నామని, ప్రజల మెప్పుపొంది వారిముందు గర్వంగా నిల్చున్నామని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వాకంవల్ల రాష్ట్రం రూ.ఎనిమిది లక్షల కోట్ల అప్పుతో రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీకి అప్పగించారన్నారు. ఒకవైపు వడ్డీలు కడుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, రాబోయే మూడేళ్లలో హామీలన్నీ తప్పకుండా నెరవేరుస్తామన్నారు.

సొంత వర్గం నుంచే విమర్శలు

(మొదటిపేజీ తరువాయి)

తప్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఓబీసీలకు వార్షిక ఆదాయం రూ.8 లక్షలకు పైబడి ఉంటే రిజర్వేషన్ అర్హత కోల్పోయే విధంగా చట్టం ఉందని గుర్తు చేశారు. అలాంటి విధానమే ఎస్సీ ఎస్టీలకు కూడా వర్తించాలని గవాయ్ పేర్కొన్నారు. అయితే, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల వంటి రాజ్యాంగపరమైన పదవులకు రిజర్వేషన్ వర్తించదన్న సంగతి కూడా విమర్శకులు గుర్తించలేదని గవాయ్ తెలిపారు. తాను దళిత వర్గానికి చెందిన వ్యక్తిగా ఎదిగి న్యాయమూర్తినైనా.. కాబట్టి, దేశంలోని ఎస్సీఎస్టీల్లో ఆర్థికంగా ఎదిగిన వారిని రిజర్వేషన్ నుంచి తప్పించడం ద్వారా ఇంకా సమాజంలో కింది స్థాయిలో ఉన్న వారికి ఈ రిజర్వేషన్ల ఫలితాలు అందుతాయనే ఆలోచనతోనే ఈ తీర్పు ఇచ్చినట్లు తెలియజేశారు. అలాగే, సామాజికంగా వెనుకబడినవారికి ముందుకు రావడానికి 'సైకిల్' ఇచ్చినట్లుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన విషయాన్ని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ గుర్తు చేశారు. శూన్య బిందువులో ఉన్నవారిని పదో కిలోమీటర్ దూరంలో ఉన్నవారి వద్దకు చేరేలా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం.. కానీ ఎప్పటికీ సైకిల్‌పై ప్రయాణిస్తూ కొత్తగా వచ్చే వారికి అవకాశం దూరం చేయాలనేది అంబేద్కర్ ద ృష్టికోణం కాదని ఆయన స్పష్టం చేశారు. ఇక, 2024లో గవాయ్ నాయకత్వంలోని సుప్రీంకోర్టు బెంచ్ ఎస్సీఎస్టీ వర్గాల్లో కూడా క్రీమీలేయర్ అమలు చేయాలని సూచించి ంది. 1992లో ఇంద్రా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు క్రీమీలేయర్ సూత్రాన్ని కేవలం ఓబీసీలకు మాత్రమే వర్తిస్తుందని వెల్లడిం చింది. ఎస్సీఎస్టీలకు ఎందుకు వర్తించకూ డదని బీఆర్ గవాయ్ ప్రశ్నించారు.

ఓట్ల చోరీపై నిలదీతకు 'ఇండియా' సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

చర్చలో కాంగ్రెస్ నాయకులు కేసీ వేణుగోపాల్, మనీశ్ తివారీ, వర్షా గైక్వాడ్, మహమ్మద్ జావేద్, ఉజ్జల్ రమన్ సింగ్, ఇషా ఖాన్ చౌదరి, మల్లు రవి, ఇమ్రాన్ మసూద్, గోవల్ పదావి, జ్యోతిమణి చర్చలో పాల్గొంటారు. మొత్తం చర్చ కోసం పది గంటల సమయాన్ని కేటాయించారు. చర్చకు కేంద్ర న్యాయ మంత్రి అర్జున్ మేఘవాల్ బుధవారం సమాధానం ఇస్తారు. రాహుల్ గాంధీ ఇటీవల ఎన్నికల ప్రచారాల సభల్లోనూ ఓట్ల చోరీ, ఈసీ జవాబుదారీతనం గురించే ప్రధానంగా మాట్లాడారు. ఓటర్ల జాబితాల్లో అవకతవకలు, ఎన్నికలను ప్రభావితం చేయడం, ఈసీఐ వివక్ష చూపడం గురించి ప్రతిపక్షాలన్నీ విస్తృతంగా ప్రచారం చేశాయి. దాదాపు సంవత్సర కాలంగా జరిగిన అన్ని విలేకరుల సమావేశాల్లోనూ ఓట్ల చోరీ, ఓటర్ల జాబితాలో అక్రమాలు, మహారాష్ట్ర, హర్యానా, కర్నాటకలో ఎన్నికలు ప్రభావితం కావడం, వాస్తవాలకు భిన్నంగా ఫలితాలు రావడం, ఇందుకు సంస్థాగత ప్రయత్నాలు జరగడం గురించే రాహుల్ గాంధీ మాట్లాడారు. ఓటర్ల జాబితాల ప్రక్షాళన పేరిట పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించారని, ఒకే పేరులో రెండు ఓట్లు ఉన్నాయని ఆరోపించారు. ఎన్నికల సంస్కరణలపై పార్లమెంటులో చర్చ సందర్భంగా ఓటర్ల జాబితా పున:పరిశీలనలో భాగంగా బూత్ స్థాయి అధికారుల (బీఎల్‌ఓ)పై పనిభారం పెరగడాన్ని ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తనున్నారు. కొందరు బీఎల్‌ఓలు ఆత్మహత్య చేసుకోవడం, మరికొందరు వేర్వేరు కారణాలతో చనిపోవడం రాజకీయంగా చర్చకు దారితీసింది. ఫీల్డ్ అధికారుల్లోనూ ఆందోళనను పెంచింది. అధిక పనిభారం, ఆచరణ సాధ్యం కాని లక్ష్యాలు పెట్టడం గురించి చాలా మంది బీఎల్‌ఓలు తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈనెల ఒకటో తేదీన పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఎన్నికల సంస్కరణలు, ఎస్‌ఐఆర్‌తో పాటు ఎన్నికల సిబ్బందికి రక్షణపై చర్చ కోసం డిమాండ్ చేస్తూ పార్లమెంటు లోపల, బయట వరుసగా రెండు రోజుల పాటు ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన నిర్వహించారు. కాగా, జాతీయ గీతం వందే మాతరం 150వ వార్షికోత్సవంపై లోక్‌సభలో సోమవారం చర్చను ప్రధాని మోదీ ప్రారంభిస్తారు. ప్రతిపక్షాల తరపున లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ నేత గౌరవ్ గొగోయ్ చర్చ చేపడతారు. చర్చలో ప్రియాంక గాంధీ వాద్రా, దీపేంద్ర హుడా, డాక్టర్ బిమల్ అకోయిజమ్, పరినీతి షిండే, ప్రశాంత్ పదోలే, చమలా రెడ్డి, జోత్స్న మహంత్ పాల్గొంటారు. మొత్తం చర్చ కోసం పది గంటల సమయం ఇవ్వగా, ఇందులో బీజేపీకి మూడు గంటలు కేటాయించారు. అదే విధంగా మంగళవారం రాజ్యసభలో వందే మారతంపై చర్చను హోంమంత్రి చేపడతారు. ఈ చర్చ కూడా వాడివేడిగా సాగబోతోంది.

విద్యార్థిని గొలుసుతో బంధించిన ఉపాధ్యాయులు

భువనేశ్వర్: ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లా బెగూనియా ప్రభుత్వ యూజీ ఎగువ ప్రాథమిక పాఠశాలకు చెందిన నాలుగో తరగతి విద్యార్థిని వసతి గృహంలో మంచానికి గొలుసుతో బంధించారు. ఇందుకు సంబంధించి వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీంతో కలెక్టర్ సూర్యవంశీ మయూర్ బికాస్ దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సబ్‌కలెక్టర్ మధుస్మిత సామంత్రాయ్, జిల్లా సంక్షేమ అధికారి, సమితి విద్యాధికారి సత్యనారాయణ్ భూయాన్‌ల బృందం విచారణ జరిపింది. ఈ ఘటనకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘునాథ్ బుగుడాయి, ఉపాధ్యాయుడు జతిన్ పరిడాలను బాధ్యులుగా చేస్తూ వారిని సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థిని ఎందుకు బంధించారన్న విషయమై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

సమన్వయం లేదు... సంప్రదింపులు జరగవు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. సమన్వయం చేసుకోలేదు. ఇవన్నీ ప్రతికూలంగా పరిణమించాయి. వీటిపై ఆత్మవిమర్శ అవసరం. అందుకోసమే జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మాటలను పరిగణనలోకి తీసుకోవాలి' అని డి.రాజా అన్నారు. ఒమర్ అబ్దుల్లా ఇండియా ఐక్య సంఘటన ముఖ్య నాయకుల్లో ఒకరని, ఆయన సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని డి.రాజా సూచించారు. 'భారతదేశాన్ని పరిరక్షించడం, బీజేపీని ఓడించడమే ఇండియా ఐక్య సంఘటన ముఖ్య ఉద్దేశం. ఇదే లక్ష్యంతో లౌకిక పార్టీలు ఏకమయ్యాయి. అయితే ఆ దిశగా కార్యాచరణ లోపించింది. దీంతో 'ఇండియా' బలహీనపడింది' అని డి.రాజా వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించేలా లౌకిక పార్టీలు బలం పెంచుకోవాలని, ఇందుకోసం ఇండియా ఐక్య సంఘటనలో సమన్వయం, సంప్రదింపులు పెరగాలని డి.రాజా సూచించారు.

ఫుట్‌బాల్ మ్యాచ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

లియోనల్ మెస్సికి ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ ఉంది. సీఎం రేవంత్ రెడ్డి టీంతో పోటీపడే ఫ్రెండ్లీ మ్యాచ్ నేపథ్యంలో పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రైజింగ్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు మెస్సి సైతం ఆసక్తి చూపారని పేర్కొన్నారు. భద్రత, సౌకర్యం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని నిర్దేశించిన సమయం కంటే ముందే అభిమానులు స్టేడియంలోకి చేరుకోవాలని కోరారు. క్రీడాభిమానులకు అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఫుట్‌బాల్ మ్యాచ్ ఏర్పాట్లపై రాచకొండ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్లు ప్రత్యేక దృష్టితో భద్రత ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్‌కు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వ్యక్తులు, సంస్థల అధిపతులు, సీఈవోలు హైదరాబాద్‌కు వస్తున్నారని వివరించారు. స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను పోలీస్, అధికారులు డిప్యూటీ సీఎంకు వివరించారు. క్రీడాభిమానులు వచ్చి, వెళ్లే మార్గాలు, ముఖ్యమంత్రి, మంత్రులు, వీఐపీలు వచ్చి వెళ్లే మార్గాలను ఆదివారం డిప్యూటీ సీఎం ప్రత్యేకంగా పరిశీలించారు. అభిమానుల కోసం మెట్రో, ఆర్టీసీ వంటి రవాణా సంస్థలు ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడిషనల్ డీజీ విజయ్ కుమార్, రాచకొండ సీపీ సుధీర్ బాబు, రోహన్ రెడ్డి, శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీల స్వీయ సమీక్షకు 'జెన్‌జీ' అవకాశం: ప్రచండ

ధనుషా (నేపాల్): గణతంత్ర వ్యవస్థ ఏర్పాటు తర్వాత కూడా పౌరుల జీవితాల్లో ప్రాథమిక మార్పులు రాకపోవడంతోనే జెన్ జీ ఆందోళనలు జరిగాయని నేపాలీ కమ్యూనిస్టు పార్టీ సమన్వయకర్త, మాజీ ప్రధాని పుష్ప కమల్ దహల్ ప్రచండ అన్నారు. నేపాలీ కమ్యూనిస్టు పార్టీ అధ్వర్యంలో మాధేస్ ప్రావిన్స్‌లో ఐక్యతా సభనుద్దేశించి ఆయన మాట్లాడారు. చరిత్రగల పార్టీలకు ఆత్మపరిశీలన/సమీక్షకు జెన్ జీ ఆందోళనలు అవకాశమిచ్చాయని చెప్పారు. జెన్ జీ ఆందోళనల తర్వాత పరిణామాల దృష్ట్యా కొత్త విధానంతో దేశాభివృద్ధి కోసం పనిచేసే ఉద్దేశంతో వామపక్ష పార్టీలు ఒక్కటయ్యాయన్నారు. ప్రజలంతా ఐక్యంగా ఉంటేనే తిరోగమన-ప్రతిస్పందన దళాలను ఓడించగలమన్నారు. ఈ పోరాటానికి నేపాలీ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహిస్తుందని ప్రచండ నొక్కిచెప్పారు. అనంతరం నేపాలీ కమ్యూనిస్టు పార్టీ ఉమ్మడి సమన్వయకర్త, మాజీ ప్రధాని మాధవ్ కుమార్ నేపాల్ మాట్లాడుతూ వామపక్ష రాజకీయ పార్టీలన్నీ ఏకీకృత పార్టీగా ఆవిర్భవించిన తర్వాత దేశంలో సానుకూల దృక్పథం కనిపిస్తున్నట్లు తెలిపారు. కలిసికట్టుగా ముందుకెళితేనే అనుకున్న లక్ష్యాలు, విజయాలు సాధించగలమని ప్రజలకు సందేశమిచ్చారు.

ఆపరేషన్ ముగిస్తేనే ఆయుధాల అప్పగింత : హమాస్ ప్రకటన

జెరూసలేం: ఇజ్రాయిల్ సైన్యం గజాలో ఆపరేషన్ ముగించి, పూర్తిగా ఉపసంహరించుకొని శాంతి నెలకొల్పితే పలస్తీనా యంత్రాంగానికి తమ ఆయుధాలను అప్పగిస్తామని హమాస్ ప్రకటించింది. ఆపరేషన్, దురాక్రమణతో తమ ఆయుధాలు ముడిపడి ఉన్నట్లు హమాస్ గజా చీఫ్ ఖలీల్ అల్ హయ్యా వెల్లడించారు. దురాక్రమ ణ-మారణహోమాన్ని పూర్తిగా ఆపేస్తే ఆ ఆయుధాలు అప్పగిం చేస్తామని ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తమకు స్వతంత్ర-సార్వభౌమ పలస్తీనా దేశం కావాలని స్పష్టంచేశారు. గజాలో కాల్పుల విరమణ అమలునకు హామీ ఇచ్చే విధంగా సరిహద్దుల వద్ద పర్యవేక్షణ కోసం వేర్పాటు దళం (సపరేషన్ ఫోర్స్) రూపేణ ఐరాస దళాల మోహరింపునకు అభ్యంతరం లేదని కూడా హయ్యా వెల్లడించారు. ఈ మాటతో తమ నిరాయుధీకరణే లక్ష్యంగా గజా స్ట్రిప్‌లో మోహరించే అంతర్జాతీయ దళాన్ని తిరస్కరిస్తున్నట్లు ఆయన సంకేతమిచ్చారు. ఏ విధమైన ట్రస్టీషిప్‌ను అంగీకరించేది లేదని హమాస్ నేత ఖాలిద్ మార్షల్ స్పష్టంచేశారు. పలస్తీనా ప్రజలు గజాను సొంతంగా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. తమ డిమాం డ్లకు గజా మోకరిల్లే పరిస్థితులు సృష్టించాలని ఇజ్రాయిల్ అనుకోవడ మే అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. నిరాయుధీకరణకు హమాస్ మొగ్గు చూపడంతో తాము ప్రతిపాదించిన శాంతి ప్రణాళిక రెండవ దశను అమలు చేసే దిశగా అమెరికా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

సామాజిక ఉన్నతికి జర్నలిజం పాటుపడాలి

(మొదటిపేజీ తరువాయి)

జర్నలిజంపై ఆత్మకథలు రాస్తున్నారని, చదువుతున్నారని అన్నారు. వినయ్ కుమార్, రాజేశ్వర్ రావు తనకు 40 ఏళ్లుగా తెలుసని, వారు కష్టాలు ఎదుర్కొని నిలదొక్కుకున్నారని తెలిపారు. ప్రస్తుత జర్నలిజంలో కొంత పరిస్థితి మెరుగైందని, గతంలో కంటే భిన్నంగా ఉందని అన్నారు. రాజేశ్వర్ రావు రాసిన ఆత్మకథ నవల మాదిరిగానే ఉందన్నారు. పుస్తకంలో 74వ పేజీ తనకు బాగా నచ్చిందని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉన్నత కుటుంబం నుంచే వచ్చిన రాజేశ్వర్ రావు కష్టాల పాలయ్యారన్నారు. రాజేశ్వర్ రావు ఆత్మకథ చదివితే నూతన తరం తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. జర్నలిజం సామాజిక దృక్పథం, జర్నలిజం సామాజిక ఉన్నతికి పాటు పడాల్సి ఉంటుందన్నారు. పత్రిక రంగాన్ని ఫోర్త్ ఎస్టేట్ రాజ్యాంగంలో పొందుపర్చాలని అనేక మంది పట్టు బట్టారని, కానీ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మాత్రం అందుకు వ్యతిరేకించారని గుర్తు చేశారు. ప్రజల తరపున పనిచేయడానికి పత్రిక రంగం ఉండాలని పట్టుబట్టారన్నారు. ముందుగానే ఊహించి పత్రిక రంగాన్ని రాజ్యాంగంలో బంధించకుండా అడ్డుకున్నారని చెప్పారు. తెలంగాణ మీడియా అకాడమీ తరపున 12 మంది ప్రముఖ జర్నలిస్టుల పుస్తకాలు ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. పత్రికలకు సంబంధించిన సుమారు ఐదు లక్షల పేజీలను చూసేందుకు అకాడమీ ఏర్పాట్లు చేస్తుందని చెప్పారు. మోహన్ కందా మాట్లాడుతూ సమాజంలో మీడియాది కీలక పాత్ర అని, అలాంటి మీడియా పరిపక్వత, వివేకం, గౌరవం, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే మరింత విలువ పెరుగుతుందని అన్నారు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత మరింత ప్రమాదకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తకంలో 'ఉన్నది ఉన్నట్టుగా, లేనిది లేనట్టుగా' పొందుపర్చినట్టు వివరించారని తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ వినయ్ కుమార్ మాట్లాడుతూ రాజేశ్వర్ రావు ఆత్మకథ పుస్తకం చదివితే ఆకలిరాజ్యం, సాగరసంగమం సినిమాలు చూసినట్టుగా ఉందన్నారు. రాజేశ్వర్ రావు రాసిన పుస్తకం చదివితే యువ జర్నలిస్టులు నెర్చుకోవచ్చని అన్నారు. కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ రాజేశ్వర్ రావు రాసిన పుస్తకం అందరు చదువుకోవాల్సిన పుస్తకమని సూచించారు. పుస్తక పరిచయాన్ని వయోధిక పాత్రికేయ సంఘం ఉపాధ్యక్షుడు టి.ఉదయవర్లు చేయగా, సీనియర్ జర్నలిస్టు జి.వల్లీశ్వర్, ఎమ్మెస్కో సంపాదకులు డి.చంద్రశేఖర్ రెడ్డి, సంఘం కార్యదర్శి కె.లక్ష్మణ రావు పాల్గొన్నారు.

ఏర్పాట్లు అదరహో

(మొదటిపేజీ తరువాయి)

మ్యాపింగ్, ఎయిర్ పోర్టు అప్రోచ్ రోడ్ లో ఎల్‌ఈడీ స్క్రీన్స్ తో విభిన్న ప్రదర్శనలు ఉంటాయి. సబ్జెక్టులపై చర్చల తర్వాత ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి సంగీత కచేరి అతిథులను అలరించనుంది. తెలంగాణ ప్రత్యేక నృత్య రూపాలైన కొమ్ము కోయ, బంజారా, కోలాటం, గుస్సాడీ, ఒగ్గు డొల్లు, పేరిణి నాట్యం, బోనాల ప్రదర్శనతో సాంస్కృతిక ప్రదర్శన ఉంటుంది. నాగార్జున సాగర్ దగ్గర ఉన్న ప్రపంచంలోనే అతిపెద్ద వారసత్వ బౌద్ధ థీమ్ పార్కు అయిన బుద్ధవనం పర్యటనకు దౌత్య బృందం వెళ్లేలా టూరిజం శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అందరికీ పసందైన హైదరాబాదీ బిర్యానీతో పాటు, తెలంగాణ ప్రసిద్ధ వంటలతో భోజనాలను అందించేందుకు వంటశాలలు సిద్ధమయ్యాయి. అతిథులకు తెలంగాణ పర్యటన ఎప్పటికీ గుర్తుండిపోయేలా గ్లోబల్ సమ్మిట్ డెలిగేట్లకు ప్రత్యేక సావనీర్లకు కూడిన బహుమతిని అందించనున్నారు. గ్లోబల్ సమ్మిట్ లోగో పాటు, పోచంపల్లి ఇక్కత్ శాలువా, చేర్యాల కళాకృతులు, హైదరాబాదీ అత్తర్, ముత్యాలతో కూడిన నగలను ఈ సావనీర్ లో పొందుపరుస్తారు. తెలంగాణకే ప్రత్యేకమైన ఇప్ప పువ్వు లడ్డు, సకినాలు, చెక్కలు, బాదం కీ జాలి, నువ్వుల ఉండలు, మక్క పేలాలతో కూడిన మరో ప్రత్యేక బాస్కెట్ ను కూడా అతిథులకు అందించనున్నారు.

ప్రపంచ నగరాల స్థాయికి ఫ్యూచర్ సిటీ: పొంగులేటి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సోమ, మంగళవారాల్లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌తో తెలంగాణ రాష్ట్రం దిశ దిశ మారుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మీర్ ఖాన్‌పేట్‌లో జరుగుతున్న సమ్మిట్ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రపంచ స్థాయి నగరాల స్థాయికి ఫ్యూచర్ సిటీ చేరుతుందని అన్నారు. ఇప్పటికే దేశ విదేశాలకు చెందిన 150 మంది అత్యంత ప్రముఖులు పాల్గొనబోతున్నారని చెప్పారు. ఈ సమ్మేళనం కోసం విశేష రీతిలో ఏర్పాట్లు జరిగాయని సంతృప్తి వ్యక్తం చేశారు.

హైదరాబాద్ వైపు ప్రపంచ దేశాలు: పొన్నం

డిజిటల్ టెన్నెల్, సెషన్ హాల్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. కనువిందు చేస్తున్న మొదటి తరం ఆర్టీసీ బస్సు అయిన అల్బీన్ నుంచి ఎలక్ట్రిక్ బస్సు వరకు ఆర్టీసీ అభివృద్ధి అని ప్రదర్శనగా ఉంచిన బస్సులను మంత్రి ఆసక్తిగా తిలకించారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా హైదరాబాద్ బ్రాండ్ ప్రపంచ దేశాలు హైదరాబాద్ వైపు చూస్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

నైట్ క్లబ్‌లో మంటలు

(మొదటిపేజీ తరువాయి)

అంతస్తులో డ్యాన్స్ ఫ్లోర్, సందర్శకుల కుర్చీలు, బార్ ఉన్నాయి. వీకెండ్ కావడంతో శనివారం అర్ధరాత్రి పెద్దసంఖ్యలో సందర్శకులు ఈ క్లబ్‌కు వచ్చారు. గ్యాస్ సిలిండర్ పేలడానికి ముందు, డ్యాన్స్ ఫ్లోర్‌పై దాదాపు 100 మంది డ్యాన్స్ చేస్తుండటాన్ని కళ్లారా చూశానని హైదరాబాదీ టూరిస్ట్ ఫాతిమా షేక్ చెప్పారు. సిలిండర్ పేలగానే భవనం మొత్తం మంటలు వ్యాపించడంతో, సందర్శకులం అందరం భయాందోళనకు గురై గ్రౌండ్ ఫ్లోర్ వైపుగా పరుగులు తీశామన్నారు. మంటల ధాటికి డ్యాన్స్ ఫ్లోర్ బూడిద అయిందని ఆమె తెలిపారు. కొందరు సందర్శకులు పరుగులు తీస్తూ గ్రౌండ్ ఫ్లోర్‌లోని వంటగదిలోకి ప్రవేశించారని, అందులో ఉన్న సిబ్బందితో పాటు వాళ్లంతా అక్కడే ఇరుక్కుపోయారని ఫాతిమా చెప్పారు. ఎలాగోలా వారిలో చాలామంది వంటగది నుంచి నైట్ క్లబ్ బయటికి సేఫ్‌గా వెళ్లగలిగారని ఆమె పేర్కొన్నారు. ఈ క్లబ్‌లోనే తాటి ఆకులతో నిర్మించిన ఒక తాత్కాలిక నిర్మాణం క్షణాల్లో బూడిద కావడాన్ని తాను చూశానన్నారు.

ఘటనా స్థలాన్ని ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ పరిశీలించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాద ఘటనపై వివరణాత్మక దర్యాప్తు నిర్వహిస్తామన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. క్లబ్‌కు అనుమతిచ్చిన అధికారులపై సైతం చర్యలు తీసుకుంటామని తెలిపారు. మృతుల్లో ముగ్గురు సజీవదహనమవగా, 20 మంది ఊపిరాడక చనిపోయారని చెప్పారు. క్లబ్‌లో భద్రతా నిబంధనలు పాటించలేదని ప్రాథమికంగా తెలుస్తున్నదని వెల్లడించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకొని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎమ్మెల్యే లోబో పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న అన్ని నైట్ క్లబ్‌లపై తనిఖీలు నిర్వహిస్తామన్నారు. అనుమతులు లేని క్లబ్ లైసెన్స్‌లు రద్దుచేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. కాగా, ప్రమాదం జరిగిన నైట్‌క్లబ్ రాజధాని పనాజీకి 25 కి.మీ దూరంలో ఉంది. గతేడాది దీన్ని ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

జనరల్ మేనేజర్ అరెస్ట్

అగ్ని ప్రమాద ఘటనకు సంబంధించి నైట్ క్లబ్ జనరల్ మేనేజర్‌ని అరెస్ట్ చేసినట్లు సీఎం ప్రమోద్ సావంత్ ఒక ప్రకటనలో తెలిపారు. క్లబ్ యజమాని బిర్చ్‌బై రోమియో లేన్‌పై కూడా అరెస్ట్ వారెంట్ జారీ అయిందని పేర్కొన్నారు. అతడిపై కేసు నమోదైందని చెప్పారు.

రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

గోవాలోని ఓ నైట్‌క్లబ్‌లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బిర్చ్ నైట్ క్లబ్‌లో జరిగిన ప్రమాదం చాలా బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. అగ్నిప్రమాద ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్రపతి ముర్ము అన్నారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటనపై గోవా సీఎం ప్రమోద్ సావంత్‌తో మాట్లాడినట్లు మోదీ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రూ. రెండు లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు ఎక్స్ గ్రేషియా ప్రకటించారు.

ఇది పాలనా వైఫల్యం: రాహుల్

న్యూఢిల్లీ: గోవాలోని నైట్ క్లబ్‌లో జరిగిన విషాదకర అగ్ని ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తు, కఠినమైన జవాబుదారీతనం ఉండాలని కాంగ్రెస్ ఆదివారం డిమాండ్ చేసింది. కాగా, ఈ దుర్ఘటనను భద్రత, పాలనా వైఫల్యమని ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ప్రమాదంలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. 'ఈ నివారించదగిన విషాద సంఘటన కోలుకోలేని నష్టం. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని నేను ప్రార్థిస్తున్నాను' అని పేర్కొన్నారు. 'ఇటువంటి విషాదాలు సమగ్ర దర్యాప్తు, కఠినమైన జవాబుదారీతనం, అన్ని అగ్నిమాపక భద్రతా నిబంధనలు అమలు చేయబడతాయని నిర్ధారించుకోవడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని, తద్వారా ఇటువంటి విధ్వంసకర సంఘటనలు ఎప్పుడూ పునరావృతం కాకుండా చూసుకోవాలి' అని ఖడ్గే 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ... 'ఎక్స్' లో చేసిన పోస్ట్‌లో.... అర్పోరాలో జరిగిన విషాద అగ్ని ప్రమాద ఘటన తనను తీవ్రంగా బాధపెట్టిందని పేర్కొన్నారు. 'మృతుల కుటుంబాలకు నా హృదయపూర్వక సంతాపం, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. ఇది కేవలం ప్రమాదం కాదు. ఇది భద్రత, పాలనకు సంబంధించిన నేరపూరిత వైఫల్యం. సమగ్రమైన, పారదర్శక దర్యాప్తు జవాబుదారీతనాన్ని నిర్ధారించాలి. ఇటువంటి విషాదాలు మళ్లీ జరగకుండా చూసుకోవాలి' అని తెలిపారు.

తెలంగాణ గురించి మాట్లాడే అర్హత కిషన్ రెడ్డికి లేదు : మహేష్‌కుమార్‌గౌడ్

గ్రానూయా-2025-12-07-16-52-01

విశాలాంధ్ర-నిజామాబాద్ : కేంద్ర మంత్రిగా ఉంటూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన బీజేపీ మాజీ అధ్యక్షుడు కిషన్ రెడ్డికి తెలంగాణ రాష్ట్రం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఆదివారం జిల్లా పర్యటన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. బీజేపీ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్న మహా ధర్నాపై మహేష్ కుమార్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రిగా ఉండి రాష్ట్రానికి ఏ ఒక్క అభివృద్ధి పనులు చేపట్టని అసమర్థత మంత్రిగా కిషన్‌రెడ్డి ఉన్నారని, ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని బీజేపీ నేతలు ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం విషయంలో ప్రజలతో శభాష్ కొట్టించుకుంటుందని, ఇది చూసి ఓర్వలేక బీజేపీ నేతలు మహా ధర్నా పేరిట తెలంగాణ ప్రజలను మోసం చేసే కుట్ర పన్నుతున్నారని ఆయన విమర్శించారు. ఇందుకు ఉదాహరణనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలని ఆయన వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కనీసం డిపాజిట్ దక్కించుకోలేని కిషన్‌రెడ్డి ఆలోచించాలన్నారు.హైదరాబాద్‌లో గ్లోబల్ సమ్మిట్ గర్వంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రజల మెప్పుపొంది ప్రజల ముందు గర్వంగా నిల్చున్నామని మహేష్ కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వాకంవల్ల రాష్ట్రం 8లక్షల కోట్ల అప్పుతో రాష్టాన్ని కాంగ్రెస్ పార్టీకి ఇచ్చారన్నారు. ఒకవైపు వడ్డీలు కడుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, వచ్చే మూడేళ్లలో ఇచ్చిన హామీలు అన్ని తప్పకుండా నెరవేరుస్తామన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి : గుడిపాటి

విశాలాంధ్ర-తుంగతుర్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో తుంగతుర్తి మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని జిల్లా అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య పిలుపు నిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని వెలుగు పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి సోలిపురం. అశ్విని కన్నా రెడ్డి తో కలిసి ఇంటింటి ప్రచారంలో, పాల్గొని మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తే గ్రామాలు అన్నీ విధాలుగా అభివృద్ధి చెందుతాయన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు.పేదలకు రేషన్ కార్డులు ఇండ్లు ఇవ్వలేదని మహిళలకు నాసిరకం చీరలు ఇచ్చి వారి మనోభావాలను దెబ్బతీశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు నాణ్యమైన చీరలు అందజేస్తుందన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కోట్ల రూపాయలతో గ్రామాల్లో రోడ్లన్నీ అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నది, గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుంటే వెనకబడిన ఈ ప్రాంత గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ, సురేష్ రెడ్డి, నవీన్ చారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి ర్యాండమైజేషన్ పూర్తి

విశాలాంధ్ర-నల్గొండ బ్యూరో : నల్గొండ జిల్లాలో రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్న మిర్యాలగూడ డివిజన్‌కు సంబంధించి పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని ఆదివారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు, ఐఏఎస్ అధికారి కొర్ర లక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సమక్షంలో నిర్వహించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల పరిశీలకురాలు పూర్తిగా క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి తదితర అధికారులు పాల్గొన్నారు. రెండవ విడత ఎన్నికలు మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని అడవిదేవులపల్లి, అనుముల, దామరచర్ల, మాడుగులపల్లి, మిర్యాలగూడ, నిడమనూరు, పెద్దవూర, తిరుమలగిరి సాగర్, త్రిపురారం, వేములపల్లి మండలాలలో మొత్తం 2,418 పోలింగ్ కేంద్రాలలో జరగనున్నాయి. ఈ ఎన్నికల నిర్వహణ కోసం పీవోలు, ఓపీవోలు (రెండవ, మూడవ ఓపీవోలు సహా) కలిపి మొత్తం 2,898 మంది పీవోలు, 3,334 మంది ఓపీవోలు (20 శాతం రిజర్వుతో సహా) అవసరం ఉండగా, ఈ మేరకు సిబ్బందిని ఎంపిక చేస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. మొత్తం 2,418 పోలింగ్ బృందాలు ఎన్నికల విధుల్లో పాల్గొననున్నాయి. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, ఈ-జిల్లా మేనేజర్ దుర్గారావు, నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్ ప్రతినిధి ప్రేమ్ హాజరయ్యారు.

ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలి: కలెక్టర్

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో : మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల విధులకు కేటాయించబడిన ఉద్యోగులు ఈ నెల 6 నుంచి 9 వరకు సంబంధిత మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాలకు హాజరై తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రకటనలో కోరారు.గ్రామపంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొననున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందని తెలిపారు. ఈ నెల 11న తొలి విడత పోలింగ్ విధులకు హాజరయ్యే ఉద్యోగులు ముందుగానే ఫెసిలిటేషన్ కేంద్రాలలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలని సూచించారు.ఆత్మకూరు (ఎస్), జాజిరెడ్డిగూడెం, నాగారం, నూతనకల్, మద్దిరాల, సూర్యాపేట, తిరుమలగిరి, తుంగతుర్తి మండలాలలో తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నట్లు పేర్కొన్నారు. ఈ మండలాల్లో ఎన్నికల విధులకు నియమించబడిన ఉద్యోగులందరూ ఈ నెల 6 నుంచి 9 మధ్య కాలంలో సంబంధిత మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాలలో తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పునరుద్ఘాటించారు.

స్థానిక పోరులో.. | నువ్వా.. నేనా..

విశాలాంధ్ర - చర్ల : పంచాయితీ పదవుల కోసం ఎంతో కాలంగా వేచి చూస్తున్న గ్రామాల్లోని రాజకీయ నాయకులు, కార్యకర్తలు ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పదవులు దక్కించుకునేందుకు తమ సర్వాన్ని వడ్డీ పోరాడుతున్నారు. ముఖ్యంగా అధికార పక్షం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఈ ఎన్నికలు సవాల్‌గా మారాయి. సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లో తీసుకెళ్లి తద్వారా విజయం సాధించాలని ప్రతిష్టానం గ్రామాల్లోని కార్యకర్తలు నాయకులకు దిశా నిర్దేశం చేసింది. కానీ స్థానిక పోరులో రాజకీయ ప్రమేయం కంటే కూడా స్థానిక సమస్యలు గ్రామ అభివృద్ధిపైన దృష్టి ఉంటుంది. దీంతో రాజకీయాలకతీతంగా సామాజిక, ఆర్థిక బలాన్ని బట్టి ఈ ఎన్నికలు జరుగుతాయి. దీంతో అధికార పక్షానికి, ప్రతిపక్ష అభ్యర్థులు గట్టి పోటీ ఇస్తున్నారు. మండల వ్యాప్తంగా 26 గ్రామ పంచాయతీలలో హోరా హోరీగా ప్రచారం కొనసాగుతోంది. ప్రచారం కంటే కూడా వ్యక్తిగతంగా ఇంటింటికి వెళ్లి అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించే పనిలో ఎక్కువ దృష్టి పెట్టారు. నువ్వా నేనా అంటూ పోటీపడ్డట్టుగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఒకవైపు, బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు మరో వైపు అలాగే స్థానికంగా కొంత బలం ఉన్న బీజేపీ, బీఎస్పీ అభ్యర్థులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచారానికి ఇంకా రెండు రోజులు మాత్రమే సమయం ఉండడంతో అభ్యర్థుల హంగామాతో గ్రామాలు హోరెత్తుతున్నాయి. పక్క ఏజెన్సీ గ్రామీణ ప్రాంతాలు కావడంతో మండలంలో పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్లు పనిచేసే ప్రదేశాలకు వెళ్లి తమను గెలిపించాలని ప్రాధాయపడు తున్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని చెప్పుకుంటూ ఆ పార్టీ నాయకులు, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులను వివరిస్తూ కాంగ్రెస్ నాయకులు తోట పోటీగా ప్రజలు ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియా మాధ్యమాలను విస్తృతంగా ఉపయోగించుకుంటున్నారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నది బిజెపి కేంద్ర ప్రభుత్వమే అంటూ ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎప్పుడులేని విధంగా చాప కింద నీరుల బీజేపీ మండలంలో క్యాడర్ పెంచుకుంది. ఎవరని ప్రచారాలు చేసుకున్న అంతిమంగా ఓటర్ల మనోభావాలు ఎలా ఉన్నాయో ఈ నెల 11న 26 గ్రామ పంచాయతీల భవిష్యత్తు తేలనుంది.

ఓర్వలేకే తుమ్మలపై అవాకులు చవాకులు...

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తుమ్మల నాగేశ్వరరావుపై అవాకులు చెవాకులు హాస్యాస్పదమని, అభివృద్ధికి మారు పేరు తుమ్మల నాగేశ్వరరావు అని, అదే విధంగా ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డిరెడ్డి , మంత్రి వర్గం మొత్తం తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఆ అభివృద్ధిని చూసి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఓర్వలేక మతిభ్రమించి మాట్లాడుతున్నారని, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ సీనియర్ కాంగ్రెస్ నాయకులు దుర్గాప్రసాద్ ,గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రాయల నాగేశ్వరరావు ,నగర మేయర్ పి నీరజ , నగర కాంగ్రెస్ అధ్యక్షులు నాగళ్ళ దీపక్ చౌదరి అన్నారు. అభివృద్ధికి మారు పేరు తుమ్మల నాగేశ్వరరావు అటువంటి వారిపై నీవు మాట్లాడే మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని మరల పంచాయతీ ఎన్నికలలో ప్రజలు మరొక్క సారి మీకు సరైన గుణపాఠం చెప్తారని,కాంగ్రెస్ పార్టీని మోసం చేసిన మొట్ట మొదటి వ్యక్తివి నీవేనని మాజీ మంత్రి అజయ్ కుమార్ ఉద్దేశించి అన్నారు. ఇక లా అండ్ ఆర్డర్ గురించి,ప్రలోభాల గురించి నీవు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లున్నదని,ఇందిరమ్మ రాజ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు నీకు లేదని, గత రెండు సంవత్సరాలలో జరిగిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు మంచుకొండ ఎత్తిపోతల పథకం,ఇంటిగ్రేటెడ్ స్కూల్,మెడికల్ కాలేజీ, కేబుల్ బ్రిడ్జి అనేక అభివృద్ధి పనులు జరిగాయని, తుమ్మల తనయుడు తండ్రి బాటలో నడవటం లో తప్పేలేదని,గతంలో అభివృద్ధి,ప్రస్తుత అభివృద్ధిపై దమ్ముంటే చర్చకు రావాలని పత్రికా ముఖంగా సవాల్ చేస్తున్నామని అన్నారు. నీలాగ కొడుకు పేరుపై కాంట్రాక్టులు, ఎన్ని తప్పుడుచేసారో ప్రజలకు తెలుసని, నీ పి ఏ లాగా పోలీస్ స్టేషన్ లలో పంచాయితీ మేము చేయట్లదని,తుమ్మల నాగేశ్వరరావు నీలాగ వేరే పార్టీలో చేరలేదని,తెలుసుకో అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు కార్పొరేటర్లు గజ్జల లక్ష్మీ వెంకన్న, షేక్ మీరాబి నాగుల్ మీరా,పైడిపల్లి రోహిణి సత్యనారాయణ ,ముళ్ళపూడి సీతారాములు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఒర్రె స్వరూప సదయ్యను గెలిపించండి

విశాలాంధ్ర, మంథని: రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బలపరచిన కల్వచర్ల గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఒర్రె స్వరూప సదయ్య ఉంగరం గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ప్రచారంలో దూసుకుపోతున్నారు.కల్వచర్ల గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, పారదర్శక పాలనను లక్ష్యంగా పెట్టుకున్న రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సహకారంతో ఆదర్శ గ్రామంగా చేయడం జరుగుతుంది అని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడిన ఒర్రె సరూప, సదయ్య కల్వచర్ల గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడపడం నా ధ్యేయం. తాగునీటి సమస్యలు పరిష్కారం, రహదారుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, కాలువల శుద్ధి, పేద కుటుంబాలకు సహాయం వంటి అంశాలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటాను అని తెలిపారు మరియు గ్రామ యువత అభివృద్ధి, మహిళా సాధికారత, రైతుల సంక్షేమం, విద్యా--ఆరోగ్య రంగాల్లో నాణ్యత పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధి దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని గ్రామానికి మరింతగా తీసుకురాగలిగేది కేవలం సేవా తపన కలిగిన నాయకత్వమేనని, ఈ నేపథ్యంతోనే ఒర్రె సరూప సదయ్యని అభ్యర్థిగా బలపరిచినట్లు పార్టీ స్థానిక నాయకులు తెలిపారు. ప్రచార కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, మహిళా సంఘాలు, రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీపీఐ అభ్యర్థిగా కోరం కోటమ్మ

విశాలాంధ్ర కారేపల్లి : సింగరేణి మండల పరిధిలోని బాజుమల్లాయి గూడెం గ్రామపంచాయతీ ఎన్నికలలో సీపీఐ పార్టీ నుండి గతంలో ఇదే గ్రామపంచాయతీ సర్పంచ్‌గా గెలుపొంది పనిచేసిన కోరం కోటమ్మ బరిలో నిలిచారు. గతంలో కోటమ్మ ఇదే గ్రామపంచాయతీలో సిపిఐ పార్టీ నుండి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించి నిస్వార్థంగా గ్రామాభివృద్ధికి పాటుపడ్డారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికలలో సైతం సిపిఐ పార్టీ నుండి 8 వార్డులలో కూడా వార్డు సభ్యులు పోటీలో ఉన్నారు. ఒకటవ వార్డు నుండి గోనే స్వర్ణ మంజరి, రెండో వార్డు నుంచి బొమ్మగాని మహేష్, మూడో వార్డు నుండి పోతురాజు ఉపేంద్ర,నాలుగో వార్డు నుండి పాయం సురేష్, ఐదో వార్డు నుండి జార కోటమ్మ,ఆరో వార్డు నుండి కోరం రాధ,ఏడో వార్డు నుండి ఈశాల వెంకటేశ్వర్లు,8వ వార్డు నుండి ఉంగరాల ధనమ్మ సిపిఐ పార్టీ నుండి పోటీలో ఉన్నారు.కాగా సిపిఎం పార్టీ అభ్యర్థి బచ్చల స్వర్ణలత, కాంగ్రెస్ పార్టీ నుండి బానోతు శాంతి,బిఆర్ఎస్ పార్టీ నుండి తాటి సర్సమ్మ బరిలో ఉన్నారు. ఏది ఏమైనా ఈ గ్రామపంచాయతీలో ఎంతో అనుభవం గడించి గతంలో పనిచేసిన అనుభవాలతో సిపిఐ పార్టీ అభ్యర్థి కోరం కోటమ్మ విజయ పధాన నిలిచే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులంటున్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

విశాలాంధ్ర- కొండమల్లేపల్లి : పట్టణ కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం రాత్రి అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. 18 కళాశాలతో ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అల్పాహార కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో దేవాలయ పురోహితులు పాల గణపతి శర్మ, దేరం జయప్రకాష్ శర్మ, ఘంటసాల శివప్రసాద్ శర్మ, గురుస్వామి చిట్టెడి ప్రభాకర్ రెడ్డి, ఎర్రమాద గోవర్ధన్ రెడ్డి, ఉట్కూరి వేమన్ రెడ్డి, సముద్రాల వెంకన్న, కట్ట వెంకట్ రెడ్డి, బూడిద శ్రీనివాస్ కుంభం యాదగిరి, తోటపల్లి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ అభ్యర్థి విస్తృత ప్రచారం

విశాలాంధ్ర బోనకల్ : మధిర మండల పరిధిలోని మల్లారం గ్రామ సీపీఐ సర్పంచ్ అభ్యర్థిని మందడపు రాణి విజయాన్ని కాంక్షిస్తూ.. కాంగ్రెస్, సీపీఐ నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు హేమంతరావు, డిప్యూటీ సీఎం సతీమణి నందిని విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్, సీపీఐ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

కాలువలలో గల్లంతైయిన లారీ డ్రైవర్...

విశాలాంధ్ర మద్దులపల్లి మున్సిపాలిటీ : ఖమ్మం మద్దులపల్లి మున్సిపాలిటీ పరిధిలోని దళ్ళారుపల్లి స్టేజి సమీపంలో ఖమ్మం హైదరాబాద్ హైవే వద్ద సాగర్ కెనాల్‌లో ఒక లారీ డ్రైవర్ ఆదివారం స్నానానికి దిగి గల్లంతయ్యాడు. మహారాష్ట్రకు చెందిన లారీ డ్రైవర్ హైమద్ అతనితో పాటు డ్రైవర్ కంటనర్ ఇద్దరు కాలువలో స్నానం చేస్తుండగా డ్రైవర్ కాలువలు జారిపడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. దీంతో అక్కడివాళ్లు 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వడంతో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు పోలీసులు అక్కడికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టిన కొరకు ఆదివారం సాయంత్రం వరకు గల్లంతయిన డ్రైవర్ లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

ప్రైవేటు పాఠశాలల డివిజన్ అధ్యక్షుడిగా పసుపులేటి

విశాలాంధ్ర- సత్తుపల్లి: ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల సంఘం సమావేశం స్వామి వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్సీ భవనంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఆ సంఘం సత్తుపల్లి డివిజన్ అధ్యక్షుడిగా పసుపులేటి నాగేశ్వరరావు(విశ్వశాంతి విద్యాలయం)ను మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పాలకొల్లు శ్రీనివాసరావు (శాంతినికేతన్ స్కూల్), గొబ్బూరి నాగరాజు (శ్రీ సత్య సాయి విద్యానికేతన్) కార్యదర్శిగా ఈశ్వర్ (లక్ష్య స్కూల్), కోశాధికారిగా చీకటి శ్రీనివాసరావు (గీతాంజలి స్కూల్), సంయుక్త కార్యదర్శులుగా ఎదుళ్ల మురళీకృష్ణ (చైతన్య స్కూల్), జుజ్జురి చెన్నారావు (సరస్వతి స్కూల్), గౌరవ అధ్యక్షుడిగా లక్కినేని ప్రసాద్ (ప్రతిభ స్కూల్), గౌరవ సలహాదారులుగా మందపాటి ప్రభాకర్ రెడ్డి (కెపిఆర్ గౌతమ్ మోడల్‌స్కూల్), కృష్ణారావు (సెంచరీ స్కూల్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి నాయుడు వెంకటేశ్వరరావు, రాష్ట్ర బాధ్యులు ఇస్మాయిల్, సత్తుపల్లి ,వేంసూరు, పెనుబల్లి, కల్లూరు మండలాలకు చెందిన ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

గీత కార్మికుడి మృతి

విశాలాంధ్ర-మరిపెడ: ఈత చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని అబ్బాయిపాలెంలో ఆదివారం జరిగింది. ఎస్సై కోటేశ్వర రావు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన గౌడ సంఘం అధ్యక్షులు పోగుల సత్యం (60) కల్లు గీత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం కల్లు గీసే క్రమంలో ఈత చెట్టుపైనుండి జారిపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సత్యం మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పోలింగ్‌కు ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్



విశాలాంధ్ర, కొమరం భీం : 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11వ తేదీన మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరగనున్న ఎన్నికలకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి మొదటి విడత పోలింగ్ నిర్వహించే లింగాపూర్, సిర్పూర్-యు, జైనూర్, కెరమెరి, వాంకిడి మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, జోనల్ అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

శ్యామలత ఉపేందర్‌ను గెలిపించాలి : సీపీఐ

విశాలాంధ్ర తొర్రూరు: జిల్లాలోని తొర్రూరు మండలం కంటాయపాలెంలో ఇండిపెండెంట్గా పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి ఆవుల శ్యామలత ఉపేందర్‌ను సీపీఐ పార్టీ నిర్ణయించిందని ఆమెను ఆమెను గెలిపించాలని సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు తమ్మెర విశ్వేశ్వరరావు, ఓమ బిక్షపతిలు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదవ వార్డ్ మెంబర్ గా పోటీ చేస్తున్న కామ్రేడ్ ఆవుల చేరాలు అభ్యర్థిని భారీ మెజార్టీతోని గెలిపించాలని, అదేవిధంగా ఇండిపెండెంట్ అభ్యర్థి సర్పంచిగాపోటీ చేస్తున్న ఆవుల శ్యామలత ఉపేందర్ ను భారీ మెజార్టీతో గెలిపించి, కంటే పాలెం గ్రామ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి మందపురి శ్యాము ,పార్టీ మండల నాయకులు పేరబోయిన కిరణ్, ఐలయ్య, సయి రెడ్డి ,నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి... అభివృద్ధి చేస్తా...

విశాలాంధ్ర తొర్రూర్: ఆశీర్వదించండి... అభివృద్ధి చేసి చూపిస్తానని అమ్మాపురం బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి ముద్దం సునీత వీరారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని అమ్మాపురం గ్రామంలో వార్డు సభ్యులతో కలిసి గడపగడపకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అంతకు ముందు గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కొబ్బరికాయ కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి సునీత వీరారెడ్డి మాట్లాడుతూ సర్పంచ్‌గా నన్ను గెలిపిస్తే అమ్మాపురం గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్ది, గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ప్రజల హృదయాలలో నిలబడడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు తమర విశ్వేశ్వరరావు, బీఅర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, బీజేపీ నాయకులు, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో పతకాల జోరు

విశాలాంధ్ర గూడూరు: ఖమ్మంలో జరిగిన సుమన్ సూటోకన్ నేషనల్ కరాటే ఛాంపియన్షిప్ ఆధ్వర్యంలో జరిగిన టోర్నమెంట్లో గూడూరు మండలం మచ్చర్ల శివారు బేతంచెర్ల గిరిజన ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాల్గొని ఐదు బంగార పథకాలు, రెండు కాంస్య పథకాలు, రెండు రజిత పథకాలు సాధించడం జరిగింది. ఆదివారం ఈ పథకాలను టోర్నమెంట్ ముఖ్యఅతిథి సినీ హీరో, కరాటే లెజెండ్, డాక్టర్ సుమన్ బ్లాక్ బెల్ట్ 8 డాన్ విద్యార్థులను అభినందించి, బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుంగ్ ఫు కరాటే మాస్టర్ పెనుక ప్రభాకర్, టోర్నమెంట్ ఆర్గనైజర్ జల్లెల శ్రీనివాసరావు, మాస్టర్ సంజీవ, ప్రధానోపాధ్యాయులు ముయ్యబోయిన వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా న్యాయవాదుల వన మహోత్సవం

విశాలాంధ్ర ఖమ్మం లీగల్ : ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు ఖమ్మం పట్టణం, చెరుకూరి మామిడి తోటలో ఘనంగా న్యాయవాదుల వనమహోత్సవం ను నిర్వహించారు. ఈ వనమహోత్సవం లో ముఖ్య అతిధిగా జిల్లా ప్రదాన న్యాయమూర్తి జి. రాజాగోపాల్ పాల్గొని, ప్రసంగించారు. వన సమారాధన బారతీయుల సంస్కృతి అని, న్యాయవాదులు కుటుంబంతో వచ్చి ఆనందంగా గడపడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. న్యాయవాదులు ఎంతో ఉల్లాస భరితంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కె. ఉమాదేవి, వి.అపర్ణ, డి. రాంప్రసాద్, ఎం. అర్చనాకుమారి, కె. దీపా, బి. రజని, వై. బిందుప్రియా, వి. మాధవి, శివరంజని, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు, కార్యదర్శి గద్దల దిలీప్ కుమార్ కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కలెక్టర్ విస్తృత తనిఖీలు

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. మెదక్ మండలం మంబోజిపల్లి చెక్‌పోస్ట్ వద్ద స్క్వాడ్, ఎఫ్.ఎస్.టీ బృందాలు చేపడుతున్న తనిఖీల గురించి తెలుసుకున్నారు. ఎన్నికలలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే అవకాశం ఉన్నందున గట్టి నిఘా కొనసాగిస్తూ, పకడ్బందీగా సోదాలు జరపాలని సూచించారు. ఇప్పటివరకు సోదాలలో పట్టుబడిన లిక్కర్ నిల్వల గురించి వివరాలను అడిగి తెలుసుకుని, రిజిస్టర్లు పరిశీలించారు. హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, ఎంపీడీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్, ఎన్నికల సామాగ్రిని కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సమర్థవంతంగా నిర్వహించడానికి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

సీఐటీయూ రాష్ట్ర మహాసభలు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: మెదక్ జిల్లా కేంద్రంలో సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఏఎంసీ యార్డు నుంచి చిల్డ్రన్స్ పార్క్ వరకు ర్యాలీ అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఉమ్మడి రాష్ట్ర సిఐటియు పూర్వ ప్రధాన కార్యదర్శి బీవీ రాఘవులు, సిఐటియు అఖిల భారత అధ్యక్షురాలు హేమలత, జాతీయ కోశాధికారి సాయిబాబా, రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, భాస్కర్‌తో పాటు జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం, రాష్ట్ర ప్రతినిధులు, ఆయా కార్మిక సంఘం ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ మహాసభలు మూడు రోజులపాటు జరగనున్నాయి.

సాహితి

ఆదివాసీ ఆత్మగానమైన కవిత్వం

డాక్టర్ కొత్వాలు అమరేంద్ర, 9177732414

మనిషి పుట్టుకకు, అతడి బుడిబుడి నడకకు తొలి నివాసం అడవి... పువ్వు లాంటి అడవితో అతడి అనుబంధం అందులోని తావిలాంటిది. అయినా అతడు తన స్వార్థపు చిచ్చుతో అడవిని దహించివేస్తున్నాడు.అడవి మాత్రం తన చెట్ల బాహువుల్తో అతనిని సంరక్షిస్తూనేవుంది. వెన్నెల లాంటి తన అత్మీయతాపచ్ఛదనాన్ని చంద్రుడిలా అతడికి అందిస్తూనే వుంది. అది మనిషికి వీరత్వాన్ని నేర్పుతుంది. పోరుబాటలో పయనింపజేసి ఎన్నో ఉద్యమాలకు ఊపిరిపోస్తుంది. ఆదివాసీల సమైక్యజీవనానికి పాదులు వేస్తుంది. అడవి లోకానికి అందిస్తున్న సంపదనంతా అత్యాశతో మనిషి కొల్లగొట్టడానికే యత్నిస్తున్నాడు. అలాంటి అడవి పట్ల ఆదివాసీలు అంతులేని అనురాగాన్ని పెంచుకుంటారు. ఆ మట్టి పట్ల మమకారాన్ని పెంచుకుంటారు. నాగరికులుమాత్రం తమ వికృత చేష్టల మంటలతో అడవిని నాశనం చేస్తుంటే అనాగరికులుగా ముద్రపడ్డ ఆ అడవిబిడ్డలు నిస్సహాయతతో తల్లడిల్లిపోతుంటారు. తమ అస్తిత్వాన్నే కోల్పోయి నంతగా ఆవేదన చెందుతుంటారు. ఇప్పుడు ప్రపంచీకరణ పెనుభూతం అత్యాశల తవ్వకాలతో ఖనిజాల కోసం ఆ అడవిలోని కొండల్నీ, గుట్టల్నీ, మహావృక్షాల్నీ కూల్చేస్తూ ఆ అడవిబిడ్డల్ని కన్నీటి కడలిలోకి తోసేస్తోంది. వారి జీవితాల్ని అతలాకతలం చేసేస్తోంది. జడలు విచ్చుకున్న వ్యాపార సంస్కృతి ఆదివాసీ సాంస్కృతిక విధ్వంసానికి దారి తీస్తోంది. అభివృద్ధి పేరుతో, టెక్నాలజీ మోజుతో జరుగుతున్న నాగరికుల అటవీవిధ్వంసంతో బిక్కుబిక్కుమంటూ కాలం గడిపే ఆదివాసీ తరతరాల కళాసృజన వెలవెలబోతోంది. అందుకే ఇప్పుడు కవిత్వమూ ఆదివాసీ దుఃఖమైపోయింది. ఆ దుఃఖసముద్రం లోంచి చైతన్యపు కెరటాలూ ఎగిసిపడుతున్నాయి. 'పాట బతుకై బతుకు పాటైనవాళ్లు/ఆట బతుకై బతుకు ఆటైన వాళ్లు/వేట బతుకై బతుకు వేటైన వాళ్లు/ఆటపాటవేట బతుకు బాటైన వాళ్లు'(నేను అడవిని మాట్లాడుతున్నాను) అంటూ ఆదివాసీ జీవన సంఘర్షణలోని అనేక పార్శ్వాల్ని స్పృశించిన సుద్దాల అశోక్ తేజ కలం అతడి దుఃఖాన్ని అడవి దుఃఖంలో సంలీనం చేస్తుంది. 'ఆకుపచ్చని సముద్రం వంటి/వన్నెతరగని వనంలో జీవనసమరగీతాలు వాళ్లు/విత్తనాలు వెదజల్లి/అపరిమితమైన ధాన్యరాశులకు ప్రాణం పోసే సృష్టికర్తలు వాళ్లు... సమష్టి జీవనవిధానానికి సజీవసాక్ష్యం వాళ్లు/మనచుట్టూ అల్లుకుపోయిన/ఇప్పపూల పరిమళాలు వాళ్లు' అంటూ ఒక ఆకుపచ్చని అడవిలోని ఆదివాసీ జీవనపరిమళాన్ని స్పృశిస్తూ వారి జీవనసమరాల్ని కవిత్వీకరిస్తుంది గోపగాని రవీందర్ కలం.

'ఒక ఆకుపచ్చని పొద్దు కళ్లముందే గుంకిపోతుంటే
వాళ్లైనా ఏం జేస్తారు జెప్పు?
వెలుగును మింగేసిన చీకటికాలాన్ని శపించటం తప్ప
ఈనేల మీద తెల్లచీకటి కమ్ముకోకముందే
ఈ పచ్చని ఒడిలో పారాడిందివాళ్లు/ఈ కొండలే తమ గుండెలనీ
యీ వాగులే చనుబాలధారలనీ
యీ మన్యంలోని వన్యమృగాలే తమ తోబుట్టువులనీ
అనాదిగా నమ్ముకున్నవాళ్లు.../యీ అడవినే నమ్ముకున్నవాళ్లు
అటవీచట్టాలు పెద్దతలలపై రంగుల ఈకలయ్యాక/ఎవరెవరో వచ్చి
పచ్చని బతుకుల్లో అగ్గిబోసిపోతున్నారు/ఉక్కురెక్కల గెద్దలేవో
గూడేలకి గూడేల్ని...కొండల్ని తన్నుకుపోతున్నాక
బతుకుపుట్టపగిలిన కొండచీమలై వాళ్లు
చెట్టుకొకరూ పుట్టకొకరూ చెల్లాచెదురైపోతున్నాక
వాళ్లైనా ఏం జేస్తారు జెప్పూ!
అంతటి పెనుగాలికి/అనివార్యంగా తలవొంచటం తప్ప!
దుఃఖపు కట్టలై దహించుకుపోవటం తప్ప
ఇయ్యాల వాళ్ల పోడు చేయకుండా రాజ్యం తవ్వేవి
కందకాలు కాదు గిరిజనసమాధులే
యింత జరుగుతున్నా పుట్టీపెరిగీ
ఎత్తిరిల్లిన కోనకు ఎరుసైపోతున్నా
తరతరాలుగా షెడ్యూల్ ఏరియాలో చేరని
పోడు భూముల్లో పెట్టుబడి జెండాలు
పుట్టుకొస్తున్నా/నిమ్మకునీరెత్తినట్టున్న ఐదవ షెడ్యూల్

పల్లెత్తు మాటాడదు గాక.. మాటాడదు
వాళ్ల వరకట్టిన కొండపోడుకి పట్టాలివ్వదు...
బతుకునిండా చీకటిని తోస్తుంటాయి
తెల్లకాగితంమీద తెగిపడ్డ బొటనవేళ్లు
కొండబతుకుల్ని తగలెట్టే/నిప్పులకుంపట్లవుతాయి/నకిలీ దస్తావేజులు
పగబట్టిన పెనుబాములై బుసకొడతాయి/ప్రాంసరీ నోట్లు
వాయిదాలతో కొండకీ, కోర్టు కచేరీకీ తిరగలేక
తరాల ఆవాసాన్ని ఒదులుకోలేక
యిక్కడి బతుకు బుల్డోజర్ల కింద
బూడిద గుమ్మడికాయలై నలిగిపోతాయి
నాటికీ నేటికీ అడవెప్పుడూ రాజ్యానికి తలవొంచని ప్రశ్నే..
ఇంద్రవెల్లి కొండల్లోంచో.. లోవముఠా లోయల్లోంచో
కొండగాలికి నెగడై రాజుకుంటున్న కల్లోలకెరటమే
(అడవి మాట్లాడుతోంది)

అంటూ కళ్లముందే గుంకిపోతూ ఆకుపచ్చని పొద్దులే కరువై నాగరికుల కర్కోటక చేష్టల మధ్య సతమతమయ్యే ఆదివాసీ జీవన సంఘర్షణను కవిత్వీకరిస్తాడు సిరికి స్వామినాయుడు. ఆకుపచ్చని ఆత్మీయతనూ, వాగుల మాతృత్వపు ధారల్నీ, వన్యమృగ నేస్తాల అమృత హస్తాల స్పర్శల్నీ కోల్పోయే అడవిబిడ్డల ఆవేదన ఇక్కడ అక్షరాలయ్యాయి. అటవీచట్టాల్ని చుట్టాలుగా చేసుకునే నాగరికపు గెద్దల హూంకారం తమ బతుకుల గూడేల్నీ, తమ గుండెల కొండల్నీ నేలమట్టం చేస్తుంటే, తమ మనుగడను చెల్లాచెదురు చేసేస్తుంటే ఏమీ చేయలేని ఆదివాసీల నిస్సహాయతా, నిర్లిప్తతా ఇక్కడ కవిత్వమైంది. అది మనిషి సృష్టించిన పెనుగాలి వంటి విపత్తులో చిక్కుకొని విలవిల్లాడే ఆదివాసీల జీవితాల్ని ప్రతిబింబించింది. తమ కాయ కష్టంతో సాగుచేసుకునే పోడుభూముల్ని ఆక్రమించేసిన పెట్టుబడుల దురహంకారాన్నీ తూర్పారబడుతుంది. తమకు అండగా వుందనుకున్న ఐదవ షెడ్యూలు నోరు నొక్కేసి వాళ్ల బొటనవేళ్ల ద్వారానే వాళ్ల బతుకు తెల్లకాగితాల మీద తెల్లబోయేలా చేసే అకృత్యాల్నీ, పెద్దల పన్నాగాల బుల్డోజర్ల కింద నలిగిపోయే వాళ్ల జీవితాల ఆక్రందనల్నీ కవిత్వం రికార్డు చేసింది. తరతరాలుగా తమ ఆవాసాలతో అడవిబిడ్డలు పెనవేసుకున్న అనుబంధాల స్వరాలను వినిపించే అడవి వేదనను ఆవిష్కరిస్తుంది. ప్రపంచీకరణ గాలానికి చిక్కుకుని విలవిల్లాడే అమాయకపు అడవిబిడ్డల వీరత్వాన్నీ, శూరత్వాన్నీ లోకానికి చాటిచెబు తుంది. ఆ కొండల్లో. ఆ లోయల్లో పరితపించే హృదయాల్లో వీస్తున్న ఉద్యమాల కొండగాలికి రాజుకుంటున్న కల్లోల కెరటాలు చైతన్యపు కెరటాలు కావాలని కవిత్వం మనసారా ఆకాంక్షిస్తోంది.

'నాగరికతను అభివృద్ధి చేసిన మాకు/అనాగరికత్వాన్ని అంటగడతాంద్రు
నిప్పును కనుగొని వండితినడం నేర్పిన మేము
అందని అరకొర సౌకర్యాల/ఆకలి నిప్పులో మాడిన నల్లని శవాలం
దోడవేటలో గురితప్పని మా బాణాలు/నేర్పని విద్యకు గురుదక్షిణగా
ఏకలవ్యుడి తెగిన బొటనవేళ్లం/ఏ పండు ఏకాలంలో దొరుకునో
ఏ దుంప ఎన్ని పోషకవిలువలున్నదో
ఏదోయేరు ఏరోగాన్ని నయం జేత్తదో..
ఎరుకజేసింది నాజాతి
శాస్త్రీయ పరిజ్ఞానాన్ని నేర్పిన మాకు/శాస్త్రాలకూ
దూరం చేసినా
గిరికోనే మా ప్రపంచంగా జీవించేటోల్లం
అభివృద్ధి పేరిట ధ్వంసమవుతున్న అడవిని చూసి
అవిసిన గుండెల్ని గూడేల్ని దాటుకుంట
బడిపాట పట్టాల్సిన మా బాల్యాలు
బతుకువేటలో మెతుకేరుకునే భిక్షగాళ్లుగా
నా జాతి జాతంతా
అక్షరాల్నేవెతుకుతూ...'(ఆదివాసి)

....

'ఆదివాసీలున్న ఈ గూడెమే/అందరినీ కలుపుకున్న కలగూరగంప
బతుకుదెరువుకు వట్టిచేతుల్తో వొచ్చిన
తురక సాయిబ్కి పెద్దక్కై ప్రేమగా బువ్వపెట్టింది....
ఆ గూడెమింకా విలువల వలువలు కట్టుకుని
ఇంకా నిటారుగా నిలబడింది
జీవితాలు బగ్గుమనీ బుగ్గయితాయని తెలిసినా
నాటుసారా అమ్మొచ్చిన పేరాలోన్ని సుతా
నమ్మి పావురంగానే ఆదరించింది'(నా వూరు)

....

'భాషాసంస్కృతులు నిలువెల్లా ధ్వంసమయి
లిపిలేని దుఃఖాన్ని మౌనంగా రోదిస్తూ/ముంపులకు మూలికలకు
ఛిద్రమైన పక్షులై/కొట్టుకుపోతున్న బతుకు
ఏ ఫ్యాక్టరీ నిర్మాణం కిందైనా/నా జాతిని పునాదోలె పూచ్చిపెట్టింద్రు
తవ్వి చూడుండ్రి... నా జాతి అస్తిపంజరాలు బోరున విలపిస్తాయ్
నా తల్లి పచ్చని అందాలను/ప్రాజెక్టుల కింద పూడ్చిపెట్టి
మానని మానసికగాయాల గోడలు పేర్చి
అటుఇటుగాకుంట మా బతుకుల నాగం జేసింద్రు
జాతిజాతంతా 'దోపిడయి' మిగిలిన ఎముకల గూళ్లు
మా ఆదివాసీ గూడేలు'(ధ్వంసం)

అంటూ నిరంతరం బతుకువేటలో అలసిపోయే ఆదివాసీల పక్షాన నిలిచి వారి విభిన్న జీవన పార్శ్వాల్ని అక్షరీకరిస్తుంది ఆదివాసీ కవయిత్రి కుంజ కళ్యాణి.

అభివృద్ధికి నోచుకోక దుర్భర దారిద్ర్యంలో మగ్గిపోతున్న ఆదివాసీ పూర్వవైభవాన్ని గుర్తుచేస్తోంది ఇక్కడ కవిత్వం. ఒకప్పుడు ఆకలి తీర్చడమెలాగో నేర్పిన ఆదివాసీ ఇప్పటి ఆకలినీ, ఒకప్పుడు గురితప్పని బాణాలైనా నేడు చేయని నేరానికి ఏకవ్యుడి తెగిన బొటనవేళ్లై పోవడాన్నీ, అడవి రహస్యాలను అమూలాగ్రం సముపార్జించుకున్న అడవి బిడ్డల విజ్ఞానం నేడు శాస్త్రాలకు దూరమైపోవడాన్నీ, మెతుకుల వెతుకులాటలో సతమతమయ్యే ఆదివాసీ బాల్యం అక్షరాల వెతుకులాటలోనూ అలసిపోవడాన్నీ అది ప్రశ్నిస్తోంది. ఆపదలో వున్నవారిని ఆదుకుంటూ అందరినీ కలుపుకుపోయే ఆదివాసీ గూడేల ఆత్మీయతల్ని ఎకరువుపెట్టి ఆ ఆత్మీయతల్లోని ఆర్ద్రతల్ని మనసారా స్పర్శిస్తోంది. తరతరాల ఆదివాసీ నిలువెత్తు సంస్కృతిని నిలువునా కూల్చివేసే ప్రభుత్వాలు తొడుక్కున్న ప్రజాస్వామ్యపు పైపైహంగుల్ని పరిహసిస్తుంది. నిరంతర సంఘర్షణల మధ్య ఆదివాసీ జీవనప్రస్థానం ఇప్పుడు పోరుబాట అయిపోయింది. ఆ పోరుబాటకు తన అక్షరాల ఆయుధాలతో కవిత్వం పదును పెడుతోంది. ఇప్పుడు అడవి అంటే ఆకుపచ్చని చెట్లు చెప్పుకునే గుసగుసల సవ్వడి కాదు.. అడవి అంటే మనిషి అహంకారం సృష్టించే కల్లోలంతో చెలరేగే అలజడి... వేదనల జడి... 'ఇది ఆకస్మికమేమీ కాదు కాస్మిక పరిణామాలు ఇలాగే/ఇంతే కథనాలుగా అవతరిస్తాయి/శుతశౌనకాది మహామునులు/ఏ నైమిశారణ్య తరుచ్ఛాయా/ఏ భాగంలోనూ కనిపించదు'(అడవి కొరివి) అంటూ గ్లోబల్ కాస్మిక కిరణాల చొరబాటు అడవిని ఎంత కల్లోలపరుస్తున్నదీ, నవనాగరీక సంస్కృతి అడవికి ఎంతగా కొరివి పెడుతోందో,అక్కడున్న ప్రశాంతతంతా ఎలా మాయమైపోతుందో కవిత్వీకరిస్తాడు వర్తమాన కవి సీతారాం. అందుకే అడవి అసలు జాడ మళ్లీ చోటుచేసుకోవాలని, ఆ జాడ నీడ అడవి బిడ్డలకు సేదతీర్చాలని, వారి ఆశల పూదోటలకు పాదులు వేయాలని తపిస్తోంది కవిత్వం.

కదలిరండీ కలసిరండీ!

రండీ! రండి రండి రారండీ!
రండీ! రండి రండి రారండీ!
ఊరు వాడలూ పల్లె పల్లెలూ
కదలిరండీ కలసిరండీ! ॥రండీ! రండి॥
ఎర్రజెండా నూరేళ్ల పండగ
కమ్యూనిస్టుపార్టీ నూరేళ్ళ పండగ
కష్టజీవులా నూరేళ్ల పండగ
మన పేదసాదల నూరేళ్ల పండగ ॥రండీ! రండి॥
దేశం కోసం ప్రాణాలిచ్చే
దేశ భక్తులు కమ్యూనిస్టులు
శ్రామిక హక్కుల బరిలో ఒరిగే
సమర యోధులు కమ్యూనిస్టులు ॥రండీ! రండి॥
రాజ్యాంగాన్నే చెరపట్టేసిన
వ్యవస్థలన్నిటిని ధ్వంసం చేసిన
మానవ హక్కుల హుళక్కి చేసిన
పాలకవర్గం పనిపట్టగ అందరు ఒకటై ॥రండీ! రండి॥
గిరిజన దళిత బహుజనులరా!
హిందూ ముస్లిం క్రైస్తవ సిక్కు
సమస్త మతాల సోదరులారా!
తరతరాల దోపిడినీ పాతర వేద్దాం ॥రండీ! రండి॥
విద్యార్థి యువజన మహిళల్లారా
పల్లె వృత్తుల శ్రామికులారా
కార్మిక కర్షక కష్టజీవులారా
ఏకంకండీ! ఏకంకండీ! ॥రండీ! రండి॥
కష్టాలందరికొకటేనండీ
కారకులందరు ఒకటేనండీ
మనలో మనకూ భేదాలెందుకు?
ఏకకంఠమై ఉక్కుపిడికిలై ॥రండీ! రండి॥
దూరం భారం లెక్కలు వద్దూ
అనుమానాలూ అసలే వద్దూ
"సమస్త సంపద సమస్త ప్రజలకూ సమానమే"
ఈ నినాదమే మన సమర శంఖారావం ॥రండీ! రండి॥
కమ్యూనిస్టులతో కలిసి నడుద్దాం
దేశ రక్షణకు చేయి కలుపుదాం
సమసమాజమే అంతిమ లక్ష్యం
మానవులంతా ఒకటని చాటుతు ॥రండీ! రండి॥
ఎర్రజెండా నూరేళ్ల పండగ
కమ్యూనిస్టుపార్టీ నూరేళ్ల పండగ
కష్టజీవులా నూరేళ్ల పండగ
మన పేదసాదల నూరేళ్ల పండగ ॥రండీ! రండి॥

(భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ శతాబ్ది ఉత్సవాల సందర్భం)

కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ

గోలి మధు కలానికి పదును, స్పీడు, ఎరుపు ఎక్కువ!

గ్రంథ సమీక్ష

ఎవరు ఏ సమస్య చెప్పినా వెంటనే స్పందించి, ఇట్టే అద్భుతమైన కవిత్వం రాయగల దిట్ట ప్రముఖ అభ్యుదయ కవి గోలి మధు. ఆయన కవిత్వంలో స్పష్టత ఉంటుంది. ఆయన కలానికి పదును, స్పీడు, ఎరుపు ఎక్కువ. తెలుగు భాషలోని పదాలతో ఆడుకుంటారు. సరళమైన భాషలో చక్కటి అర్థంవచ్చే విధంగా కవిత్వం రాస్తారు. మూడు దశాబ్దాలుగా ఆధునిక భావాలతో, సామాజిక స్పృహతో అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని ప్రజా చైతన్యం కోసం ఎదురీదుతున్నారు. మధు గతంలో భారతీయ ధర్మ విశ్లేషణ(2003), నవశకం (2006), రైతు సమరభేరి (2020,2021), గమనం(2021), సంఘర్షణ (2023)అనే అయిదు కవితా సంపుటాలు అందించారు. పుస్తకాలకు కాలం చెల్లిందను కుంటున్న రోజుల్లో 2020లో వచ్చిన ఆయన 'రైతు సమరభేరి' కవితా సంపుటి 2021లో రెండవ ముద్రణ కూడా జరిగింది. అంటే, ఆయన కవిత్వంలో ఎంత పట్టు, పవర్ ఉందో అర్థమవుతోంది. మధు ఆరవ కవితా సంపుటి 'ఎదురీత'ని మంగళగిరి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ఇటీవలే మంగళగిరిలో ఈ సంకలనం ముద్రణ దాత ఆంధ్ర నాటక కళా సమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు ఆవిష్కరించారు.

'ఎదురీత' పుస్తకం వెల : రూ.150/-
కవి గోలి మధు సెల్: 9989186883
ప్రతులకు : 9848199098- రేకా కృష్ణార్జునరావు

ఈ కవితా సంపుటిలోని 55 కవితలలో విభిన్న పార్శ్వాలను స్పర్శించారు. చదవడం మొదలుపెడితే, చివరి వరకు పుస్తకం మూయలేరు. పాఠకులను అంతగా కట్టిపడేసేలా ఈ కవితలు ఉన్నాయి. మధుకు జీవితం పట్ల, కవిత్వం పట్ల స్పష్టత ఉండటంతో ఆయన రాసే కవిత్వం పాఠకుల మనసుకు సూటిగా తగులుతుంది. ప్రజల పక్షం, బాధితుల పక్షం నిలిచిన కవి. మధు ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా, ప్రభుత్వాలపైనే తిరుగుబాటు కవిత్వం రాయగల ధైర్యవంతుడు, ధీశాలి. మధు కవిత్వం ఎంత మక్కువతో రాస్తారో, ఉద్యోగం కూడా అంతే నిజాయితీ, నిబద్ధత, అంకితభావంతో చేస్తారు. తన భావాలు చక్కటి భాషతో సూటిగా చెప్పగల సత్తా ఉన్న కవి. ఈ సంపుటి మొదటి పేజీలో భారత రాజ్యాంగ ప్రవేశికకు స్థానం కల్పించారంటే, భారతీయ పౌరుడుగా మధు ఎంత బాధ్యతగా ఉంటారో తెలుస్తోంది. గుడి కప్పులు ధగ ధగ మెరుస్తుంటే - బడి కప్పులు పెచ్చులూడి పడుతున్నాయి... గుళ్ల మీద చూపించిన శ్రద్ధ మనం బడులమీద చూపించడంలేదన్న బాధ వ్యక్తం చేశారు మధు.

తమ పెంపుడు కుక్క 'మిలో' మరణించినప్పుడు మధు రాసిన 8 పేజీల కవిత పాఠకుల కంట తడిపెట్టిస్తోంది. పెంపుడు కుక్కలతో ఆ ఇంటి వారి అనుబంధం, వాటి చేష్టలు, అల్లరి, అరుపులు, చూపులు, ప్రేమ, వాటి ప్రవర్తనా తీరు...,వాటిపై ఇంట్లో వారు చూపించే ప్రేమ, అవి మరణించినప్పుడు వారు పడే బాధ... చాలా అద్భుతంగా రాశారు. దానిని అందరూ చదివి తీరవలసిందే. ముఖ్యంగా జంతు ప్రేమికులకు, కుక్కలను పెంచుకునేవారి మనసుకు హత్తుకునే విధంగా ఉంటుంది. అలాగే, కల్తీ కల్తీ కల్తీ - ఇందుగలదందులేదన్న కల్తీ... అని మనిషి జీవితంలో అడుగడుగునా జరిగే కల్తీల గురించి 'సమాధి' అనే కవిత అద్భుతంగా రాశారు. సజావుగా సాగే జీవితం తలక్రిందులైతే, కాలానికి ఎదురీది, తనని, తన చెల్లిని పెంచిన తీరు ద్వారా అమ్మ గోలి పార్వతీ దేవే తన ఎదురీతకు స్ఫూర్తి అని చెప్పడంలోనే మధు సంస్కారం తెలుస్తోంది. మంగళగిరి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలిగా ప్రజాసేవలో ప్రపంచ రికార్డు నెలకొల్పిన దివంగత నన్నపనేని లక్ష్మికి ఈ పుస్తకం అంకితం ఇవ్వడం ద్వారా ఆయన మహిళలకు ఇచ్చే గౌరవం అర్థమవుతోంది. మరో కవితలో ప్రశ్నించడం మరిచామని ప్రశ్నార్థకమయ్యావా ప్రజాస్వామ్యమా!.. అని అంటారు. గొంతు మెదపక ప్రశ్నించక, ప్రతిధ్వనించక కలహించక కూర్చుంటే - నువ్వు మాయం నేను మాయం!!... అని హెచ్చరిస్తారు. ఒకటికి మరొకటి జత చేరనిదే ఒకటి లేనేలేదు - పరుగు పందెంలో ఒకటో స్థానానికి రెండు కాళ్లు..., మనిషి మనిషికీ మతం మత్తు-సందు సందుకీ కులం కిక్కు..., పీడితుల నడుమ ఐక్యత సాధించనంతవరకూ పీడకునిదే గెలుపు.... ఇలా సాగుతుంది మధు కవిత్వం.

శిరందాసు నాగార్జున, 9440222914

నానీలపై అవగాహన

రచయిత ఎస్.ఆర్.పృథ్వి రచించిన లఘు కవిత్వంలో నానో ప్రస్థానం అనే ఈ పుస్తకంలో నానో ప్రస్థానంతో నానో కవితా రూపం ఎలా ఉంటుంది అనే అంశం మీద కొంతమంది కవులు రాసిన నానోలను ఉదహరించారు రచయిత.

లఘు కవితారూపాలలో కొత్త కవితారూపం 'నానో'. మినీ కవితలు, రుబాయిలు హైకులు, నానీలు, దీర్ఘ కవితలు వంటి అనేక కవితలు రెండు మూడు దశాబ్దాలుగా ప్రాచుర్యం పొందాయి. నానో కవితలో నాలుగు పాదాలు ఉంటాయి. ఒక పదం, ఒక పాదంగా పరిగణిస్తారు. మొత్తం కవిత నాలుగు పాదాలు కలిపితే 15 అక్షరాలకు మించరాదు. ఇది కవిత స్వరూపం. ఒక పదంతో మరొక పదానికి భావపరమైన అనుబంధం ఉండాలి. "హలం మనిషికి కలం వ్యవస్థకి. ఈగ హనుమాన్ రాసిన నానోలో ఆకర్షణ/మున్నాళ్లు /ప్రేమ/ఉన్ననాళ్లు అంటా సాగుతుంది.

ఎస్.ఆర్.పృథ్వి తన నానీలలో యంత్రం/దాడి/మగ్గం బీటలు అంటారు.అనంతోజు కృష్ణమోహన్ తన నానీలో 'కల్తీ/పానం/పోయింది/ప్రాణం. అలాగే భూమా శ్రీనివాస్ తన నానీలు 'ద్వేషం/పునాది /విధ్వంసం/నిర్మాణం అంటూ సాగుతుంది. ఇలా నానీలపై ఒక అవగాహన కోసం తీసుకొచ్చిన చిన్న పుస్తకమే లఘు కవిత్వంలో "నానో" ప్రస్థానం.

విష్ణుభొట్ల రామకృష్ణ, సెల్: 9440618122

లఘు కవిత్వంలో నానో ప్రస్థానం
రచయిత: పృథ్వి సుబ్రహ్మణ్యేశ్వరరావు
వెల: రూ 50/-
కాపీలకు: పి.ఉషారాణి,
సెల్: 9989223245.

మ్యూట్ చేసిన మనసు

ఆహ్వానం అందకపోయినా
మ్యూట్ చేసిన మనసుపై
చారగిలబడిన ఆలోచనలు
ఫ్రేమ్‌లో బంధింపబడ్డ ఫోటోల్లా విచ్చుకున్నాయి
సమయాన్ని మోహించిన చీకటి చలితో సవారీ చేసి
అక్వేరియాన్ని చేరిన చేప పిల్లలా ఈదులాడుతోంది
ఫుట్‌పాత్‌పై చలికి ముడుచుకున్న
అనామిక కుక్క అరుపుకి
భయంభయంగా కళ్ళను గోళీల్లా తిప్పి చూస్తోంది
చలికి వేగలేని బాటసారులు
మంటలేసుకొని వెచ్చదనపు గజల్స్ ఆలపిస్తున్నారు
రైలు పెట్టిన కూతకి చలిని చంకనేసుకొని
బోగీల్లో బిర బిర ప్రయాణికులు వాలారు
కేఫ్‌లోని కాఫీ పొగలు కక్కుతూ
చలిని నిద్ర పుచ్చే ప్రయత్నంలో ఉంది

రాధ తాళ్లూరి

జాతీయస్థాయి చిన్న కథల పోటీ విజేతలకు

14న సోమేపల్లి సాహితీ పురస్కారాల ప్రదానం

జాతీయస్థాయి చిన్న కథల పోటీలలో విజేతలైన వారికి 16వ సోమేపల్లి సాహితీ పురస్కారాల ప్రదానోత్సవ సభ ఈ నెల 14వ తేదీన 'రమ్యభారతి' ఆధ్వర్యంలో గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో గల అన్నమయ్య గ్రంథాలయ మీటింగ్ హాల్‌లో జరగనున్నది.

ప్రముఖ సాహితీవేత్త వేములు హజరత్తయ్యగుప్త అధ్యక్షతన జరిగే ఈ సభలో ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ శ్రీ ఆర్.డి.విల్సన్ ముఖ్య అతిథిగా, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు శ్రీమతి చిల్లర భవానీదేవి, ప్రముఖ రచయిత శ్రీ శ్రీకంఠ స్ఫూర్తి, శ్రీ వేంటేశ్వరస్వామి దేవస్థానం అధ్యక్షులు శ్రీ చిటిపోతు మస్తానయ్య ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారు.

పురస్కార విజేతలు:

ప్రథమస్థాయి పురస్కార విజేత: శింగరాజు శ్రీనివాసరావు (ఒంగోలు) , ద్వితీయ : జి.రంగబాబు (అనకాపల్లి), తృతీయస్థాయి పురస్కార విజేత: జి.యస్.కె.కరీముల్లా (నరసరావు పేట), ప్రత్యేక బహుమతులు ముగ్గురికి ... 1) ఇంద్రగంటి నరసింహమూర్తి (కాకినాడ), 2) సింహప్రసాద్ (హైదరాబాద్) , 3) ఎం.వేంకటేశ్వరరావు (హైదరాబాద్).

లోక్‌సభలో నేడు 'వందేమాతరం'పై చర్చ

న్యూఢిల్లీ: వందేమాతరం 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో భాగంగా సోమవారం లోక్‌సభలో జాతీయ గేయం వందేమాతరంపై ప్రత్యేక చర్చ జరగనుంది. మధ్యాహ్నం 12 గంటలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చర్చ ప్రారంభించనున్నారు. ఈ అంశంపై సభను ఉద్దేశించి ఆయన సుదీర్ఘ ప్రసంగం చేయనున్నారు. ఈ ప్రత్యేక చర్చను ముగించే ప్రసంగాన్ని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేస్తారు. వందేమాతరంపై లోక్‌సభలో చర్చ కోసం మొత్తం 10 గంటల సమయం కేటాయించారు. ఇందులో 3 గంటల సమయం అధికార ఎన్‌డీఏ కూటమికి కేటాయించారు. లోక్‌సభలో ప్రత్యేక చర్చ సందర్భంగా వందేమాతరంతో ముడిపడిన కీలక చారిత్రక విశేషాలు ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. వందేమాతరంపై లోక్‌సభలో జరిగే ప్రత్యేక చర్చలో కాంగ్రెస్ తరఫున 8 మంది ఎంపీలు ప్రసంగించనున్నారు. ఈ జాబితాలో గౌరవ్ గొగోయ్ (విపక్ష ఉపనేత), ప్రియాంకాగాంధీ, దీపేందర్ హుడా, బిమల్ అకోయిజం, ప్రణీతి షిండే, ప్రశాంత్ పదోల్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, జ్యోత్స్న మహంత్ ఉన్నారు.

రాజ్యసభలోనూ...

వందేమాతరంపై మంగళవారం రాజ్యసభలోనూ ప్రత్యేక చర్చ జరగనుంది. ఈ చర్చను కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. ఆయన తర్వాత కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి, రాజ్యసభలో అధికార పక్ష నేత జేపీ నడ్డా ప్రసంగిస్తారు. వందేమాతరం 150 వసంతాలను పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆ జాతీయ గేయం స్మారకోత్సవాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ నవంబరు 7న ఢిల్లీలో ప్రారంభించారు. బంకిమ్ చంద్ర ఛటర్జీ రచించిన వందేమాతర గేయం తొలిసారిగా 1875 సంవత్సరం నవంబరు 7న 'బంగ దర్శన్' అనే సాహిత్య పత్రికలో ప్రచురితమైంది. అనంతరం ఆ గేయాన్ని తన నవల 'ఆనంద్ మఠ్'లో బంకిమ్ చంద్ర ఛటర్జీ చేర్చారు. ఈ నవల 1882లో ప్రచురితమైంది. వందేమాతరం గేయాన్ని సంగీతపరంగా స్వరపర్చిన వ్యక్తి జాదూనాథ్ భట్టాచార్య. 1896లో కోల్‌కతాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశం వేదికగా తొలిసారిగా వందేమాతర గేయాన్ని రవీంద్రనాథ్ ఠాగూర్ ఆలపించారు. దీంతో ఆ గేయానికి ప్రజల్లో గుర్తింపు వచ్చింది. తదుపరి భారత స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం కీలక భాగంగా మారింది. దేశ ప్రజల్లో దేశభక్తిని రగిల్చే మహత్తర అస్త్రంగా అవతరించింది.

మంగళ, బుధవారాల్లో చర్చించే కీలక అంశాలు

మంగళ, బుధవారాల్లో లోక్‌సభలో వివిధ కీలక అంశాలపై చర్చ జరగనుంది. ఈ జాబితాలో ఎన్నికల సంస్కరణలు, ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియ వంటి అంశాలున్నాయి. ఎన్నికల సంస్కరణలపై బుధ, గురువారాల్లో రాజ్యసభలో చర్చ జరగనుంది. బీహార్‌లో సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిర్వహించిన ఎస్‌ఐఆర్‌పై ప్రతిపక్ష ఇండియా కూటమిలోని పార్టీలు ప్రధానంగా మాట్లాడే అవకాశాలు ఉన్నాయి. ఆ ప్రక్రియలో తాము గుర్తించిన లోపాలను లోక్‌సభలో ప్రస్తావించే అవకాశం ఉంది.

బిల్లులపై ఓటింగ్‌లో ఎంపీలకు స్వేచ్ఛ ఉండాలి : కాంగ్రెస్

"బిల్లులు, తీర్మానాలపై పార్లమెంటులో ఓటింగ్ జరిగే సమయంలో స్వేచ్ఛగా, ఇష్టానుసారంగా ఓట్లు వేసుకునే అవకాశం ఎంపీలకు ఉండాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఈ పార్లమెంటు సమావేశాల్లో తాను ప్రతిపాదించిన ప్రైవేటు మెంబర్ బిల్లులో ఇదే అంశం ఉంది. ప్రస్తుతం పార్టీలు ఎంపీలకు విప్ జారీ చేసి, తమకే ఓట్లు వేయించుకుంటున్నాయి. ఒకవేళ ఎవరైనా ఎంపీ మరోపార్టీకి ఓటు వేస్తే పార్టీ ఫిరాయింపునకు పాల్పడినట్లు పరిగణిస్తున్నారు. ఇలా జరగకుండా, ఎంపీలపై చర్యలు తీసుకోకుండా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలో సవరణలు చేయాలని కాంగ్రెస్ లోక్‌సభ ఎంపీ మనీశ్ తివారీ పేర్కొన్నారు.

టీఎంసీ, బీజేపీని అధికారంలోకి రానివ్వం

కొత్త పార్టీ స్థాపన...ఒవైసీతో పొత్తు

సస్పెండ్ అయిన టీఎంసీ ఎమ్మెల్యే హుమాయున్ కబీర్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో బాబ్రీ మసీదు కు శంకుస్థాపన చేసిన, తృణమూల్ కాంగ్రెస్ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్యే హుమాయున్ కబీర్ వార్తల్లో వ్యక్తిగా నిలిచారు. బాబ్రీ మసీదును కూల్చేసిన డిసెంబర్ 6న ఆయన బెల్దంగాలో మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే, ఈ వివాదంపై తృణమూల్ కాంగ్రెస్ ఈయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. దీని తర్వాత, కబీర్ మాట్లాడుతూ... మమతా బెనర్జీ వచ్చే ఏడాది అధికారంలోకి రాకుండా చేస్తానని హెచ్చరించారు. "తృణమూల్ ముస్లిం ఓటు బ్యాంకు ముగిసిపోతుంది" అని మమతాకు హెచ్చరికలు జారీ చేశారు. "పిక్చర్ అభి బాకీ హై" అని వ్యాఖ్యానించారు. బాబ్రీ మసీదుకు పునాదిరాయి వేసిన ఒక రోజు తర్వాత ఆయన నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. డిసెంబర్ 22న తాను సొంత పార్టీని ఏర్పాటు చేస్తానని చెప్పారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీకి చెందిన ఏఐఎంఐఎం పార్టీలో పొత్తు పెట్టుకుంటానని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బెంగాల్‌లోని 294 స్థానాలకు గానూ 135 స్థానాల్లో అభ్యర్థుల్ని పోటీలోకి దింపుతానని చెప్పారు. ఈ చర్య రాష్ట్ర రాజకీయాల్లో గేమ్ ఛేంజర్ అవుతుందన్నారు. బెంగాల్లో బీజేపీని అధికారంలోకి రానివ్వనని కబీర్ చెప్పారు. భారతదేశంలో ముస్లింలకు చాలా నిధులు ఉన్నాయని, వారు బాబ్రీ నిర్మాణానికి సహాయం చేస్తారని చెప్పారు. లౌకిక సిద్ధాంతాన్ని తాను నమ్ముతానని, టీఎంసీ తనను పార్టీ నుంచి సస్పెండ్ చేసిందని, బీజేపీ మసీదు నిర్మాణాన్ని ఉద్రిక్తతలు పెంచేందుకు వాడుకుందన్నారు. అయితే, హుమాయన్ కబీర్ మసీదు నిర్మాణం అంతా మమతా బెనర్జీ ఎన్నికల స్టంట్ అని బీజేపీ ఆరోపించింది. బాబ్రీ మసీదును బెంగాల్ లో ఎప్పటికీ అంగీకరించబోమని కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ అన్నారు.

చిరుద్యోగినికి రూ.13కోట్ల జీఎస్టీ బకాయి నోటీసులు

చెన్నై: నెలకు రూ.8 వేల జీతానికి పనిచేసే ఓ మహిళకు రూ.13 కోట్ల జీఎస్టీ బకాయిలు చెల్లించాలంటూ నోటీసులు రావడం తమిళనాడులో కలకలం రేపింది. చిరుద్యోగినైన తనకు జీఎస్టీ నోటీసులు రావడం.. అదికూడా ఏకంగా 13 కోట్లు కట్టాలని అందులో పేర్కొనడంతో సదరు మహిళ నివ్వెరపోయింది. జీతం డబ్బులు విత్ డ్రా చేసుకోవడానికి వెళ్లినపుడు ఈ విషయం బయటపడింది. తమిళనాడులోని వెల్లూర్ జిల్లాలో చోటుచేసుకుందీ ఘటన. వివరాల్లోకి వెళితే.. వెల్లూర్ జిల్లాలోని గుడియతమ్ ఏరియాలోని నగల్ ప్రాంతానికి చెందిన మహాలింగం కార్ డ్రైవర్.. ఆయన భార్య యశోద ప్రైవేట్ షూ కంపెనీలో పనిచేస్తోంది. షూ కంపెనీ నుంచి నెలకు రూ.8 వేలు జీతంగా అందుకుంటోంది. ఇటీవల జీతం డబ్బులు విత్ డ్రా చేసుకోవడానికి బ్యాంకుకు వెళ్లగా.. ఆమె ఖాతా ఫ్రీజ్ అయినట్లు అధికారులు తెలిపారు. ఏం జరిగిందని ఆరా తీయగా.. యశోద జీఎస్టీ బకాయిపడిందని తేలింది. నెల జీతానికి పనిచేసే తాను జీఎస్టీ ఎందుకు చెల్లించాలని ప్రశ్నించగా అధికారులు సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. యశోద పేరుమీద రూ.13 కోట్ల జీఎస్టీ బకాయి ఉందని మాత్రమే రికార్డుల్లో ఉందని వివరించారు. చెన్నైలోని జీఎస్టీ ఆఫీస్ కు వెళ్లాలని సూచించారు. అయితే, అక్కడికి వెళ్లినా తమ సమస్యకు పరిష్కారం లభించలేదని, బ్యాంకు ఖాతా పునరుద్ధరించలేదని యశోద వాపోయారు. నెల జీతం తీసుకునే పరిస్థితి లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నట్లు తెలిపారు. కాగా, యశోద సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నట్లు జీఎస్టీ అధికారులు తెలిపారు.

'వందేభారత్ స్లీపర్' సిద్ధం

ఈ నెలాఖరుకు పట్నా- ఢిల్లీ మధ్య పరుగులు

న్యూఢిల్లీ: వందే భారత్ రైళ్లు రవాణా వ్యవస్థను కొత్త పుంతలు తొక్కిస్తున్నాయి. అధిక వేగంతో దూసుకెళ్తూ ప్రయాణికుల సమయాన్ని ఆదా చేస్తున్నాయి. ఇప్పటికే వివిధ మార్గాల్లో వందే భారత్ చైర్ కార్ రైళ్లు పరుగులు తీస్తున్నాయి. అయితే రైలు ప్రయాణికులకు మరింత సౌకర్యం కల్పించేందుకు భారతీయ రైల్వే సిద్ధమైంది. వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. డిసెంబరు చివరినాటికి భారతదేశపు మొట్టమొదటి వందే భారత్ స్లీపర్ రైలు పట్నా-ఢిల్లీ మధ్య పరుగులు తీయనున్నది. ఈ చారిత్రాత్మక ప్రారంభానికి రైల్వేలు చివరి దశ సన్నాహాలు చేస్తున్నాయి. ప్రయాణికులు ఆ రోజు కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బెంగళూరులోని బీఈఎంఎల్ (భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్) ఫ్యాక్టరీలో నిర్మిస్తున్న వందే భారత్ స్లీపర్ రెండు రేక్‌లలో ఒకటి ఇప్పటికే పూర్తయింది. మొదటి రేక్ డిసెంబర్ 12న ఉత్తర రైల్వేకు బయలుదేరుతుంది, ఆ తర్వాత ఢిల్లీ-పట్నా మార్గంలో ట్రయల్ రన్ జరుగుతుంది. ఈ హైటెక్ రైలులో మొత్తం 16 కోచ్‌లు ఉంటాయి, వీటిలో 827 బెర్త్‌లు ఉంటాయి, థర్డ్ ఏసీలో 611, సెకండ్ ఏసీలో 188, ఫస్ట్ ఏసీలో 24 బెర్త్‌లు ఉంటాయి.

మెరుగైన ఇంటీరియర్స్, ప్రత్యేక ఫీచర్స్

వందే భారత్ స్లీపర్ రైలును ఆధునిక సౌకర్యాలతో రూపొందించారు. ఇందులో ఆటోమేటిక్ డోర్లు, బయో టాయిలెట్లు, %జజుు% కెమెరాలు, వ్యక్తిగత రీడింగ్ లైట్లు, ప్రీమియం నాణ్యమైన సౌకర్యవంతమైన ఇంటీరియర్‌లు ఉంటాయి. ఈ రైలు గంటకు గరిష్టంగా 160 కిలోమీటర్ల వేగంతో నడిచేలా రూపొందించారు. ఇది కవచ్ వ్యవస్థ, క్రాష్ రెసిస్టెంట్ స్ట్రక్చర్ వంటి అధునాతన భద్రతా టెక్నాలజీతో అమర్చబడి ఉంటుంది. అవసరమైతే, కోచ్‌ల సంఖ్యను 24కి పెంచవచ్చు. వందే భారత్ స్లీపర్ రైలును న్యూఢిల్లీ-రాజేంద్రనగర్ తేజస్ రాజధాని ఎక్స్‌ప్రెస్ తరహాలో నడపాలని ప్లాన్ చేస్తున్నారు. ఇది వారానికి ఆరు రోజులు నడిచే అవకాశం ఉంది.

ఈ రైలు సాయంత్రం పట్నాలోని రాజేంద్ర నగర్ టెర్మినల్ నుండి బయలుదేరి మరుసటి రోజు ఉదయం ఢిల్లీకి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణ షెడ్యూల్ తేజస్ రాజధాని మాదిరిగానే ఉంటుంది. ఈ నెలాఖరు నాటికి వందే భారత్ స్లీపర్ రైలు రెగ్యులర్ కార్యకలాపాలను ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయని దానాపూర్ డివిజన్ ధృవీకరించింది.

క్లబ్ పరిసరాలే 'నైట్‌క్లబ్' అగ్ని ప్రమాదానికి కారణం?

పనాజీ: గోవాలోని 'బర్చ్ బై రోమియో లేన్' నైట్ క్లబ్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో 25 మంది సజీవ దహనం అయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం భారీగా జరగడానికి కారణం క్లబ్ పరిసరాలేనని అధికారుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. క్లబ్ లోకి వెళ్లే మార్గం ఇరుకుగా ఉండడంతో పాటు అలంకరణ కోసం క్లబ్ ముందు ఏర్పాటు చేసిన తాటాకుల వల్ల మంటలు వేగంగా విస్తరించాయని చెబుతున్నారు. క్లబ్ నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలుస్తోంది. గతంలో క్లబ్ ను పరిశీలించిన అధికారులు.. పరిసరాలను గమనించి ఆ ఏరియాలో క్లబ్ నిర్వహణకు అనుకూలం కాదని, వెంటనే క్లబ్ ను మూసేయాలని నోటీసులు కూడా జారీ చేశారని సమాచారం. అయితే, ఈ నోటీసులను లెక్కచేయకుండా క్లబ్ ను నడపడం వల్ల తాజాగా జరిగిన ప్రమాదంలో ప్రాణనష్టం ఎక్కువైందని అధికారులు చెబుతున్నారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే సహాయక సిబ్బంది అక్కడికి చేరుకున్నప్పటికీ ఇరుకైన మార్గాల కారణంగా మంటలు ఆర్పడంలో ఆలస్యం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

అర్ధరాత్రి తర్వాత భారీ శబ్దం...

ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. శనివారం క్లబ్ కోలాహలంగా ఉంది. అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 1 గంట ప్రాంతంలో డ్యాన్స్ ఫ్లోర్ పై వంద మందికి పైగా డ్యాన్స్ చేస్తుండగా ఒక్కసారిగా భారీ శబ్దం వినిపించింది. ఆపై మంటలు ఎగిసిపడడంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. జనం భయాందోళనతో పరుగులు తీశారు. ఇంతలోనే మంటలు క్లబ్ అంతటా వ్యాపించాయి. పొగ కారణంగా బయటకు వెళ్లే మార్గం కనిపించక చాలామంది మరణించారు. అగ్నిప్రమాదం నేపథ్యంలో క్లబ్ నిర్వాహకులపై చర్యలు చేపట్టినట్లు గోవా సీఎం ప్రమోద్ సావంత్ తెలిపారు. ఇప్పటికే మేనేజర్‌ను అరెస్టు చేయగా.. క్లబ్ యజమానులపై అరెస్టు వారెంట్ జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

చిరుత దాడిలో ఐదేళ్ల బాలుడి మృతి

చెన్నై: తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లాలో మరో విషాద ఘటన చోటుచేసుకుంది. వాల్పారైలోని తేయాకు తోటలో చిరుతపులి దాడిలో ఐదేళ్ల బాలుడు మృతి చెందాడు. గత ఎనిమిది నెలల్లో ఈ ప్రాంతంలో చిరుత దాడిలో చిన్నారులు మరణించడం ఇది మూడోసారి కావడంతో స్థానికంగా తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, అటవీ శాఖ అధికారుల వివరాల ప్రకారం.. వాల్పారైలోని అయ్యర్పాడి తేయాకు ఎస్టేట్‌లో పనిచేస్తున్న అస్సాం వలస కార్మికుడి కుమారుడైన సైఫుల్ (5) శనివారం తన ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో సమీపంలోని తేయాకు పొదల నుంచి ఆకస్మాత్తుగా దూసుకొచ్చిన చిరుతపులి బాలుడిని పట్టుకుని తోటలోకి లాక్కెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న తోట కార్మికులు, అటవీ శాఖ సిబ్బంది వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. కాసేపటి తర్వాత తోట లోపలి భాగంలో సైఫుల్ మృతదేహాన్ని గుర్తించారు. చిరుత దాడి చేసిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపించాయి.

8 నెలల్లో మూడు ఘటనలు

ఈ ఏడాది ఆగస్టు 11న ఇదే ప్రాంతంలోని కావరకల్లు వద్ద నూర్జిల్ హక్ (8) అనే బాలుడు, జూన్ 22న పచ్చమలై వద్ద రోషిణి (4) అనే బాలిక చిరుత దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. వరుస ఘటనలతో తేయాకు తోటల్లో నివసించే వలస కార్మికుల కుటుంబాలు తీవ్ర భయంతో జీవిస్తున్నాయి. ఎస్టేట్ నివాసాలకు సరైన ఫెన్సింగ్ లేకపోవడం, విద్యుత్ దీపాలు సరిగా లేకపోవడంతోనే చిన్నారులు సులభంగా చిరుతల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలతో అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ ముమ్మరం చేయడంతో పాటు, అదనపు కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేశారు. సాయంత్రం పూట పిల్లలను బయటకు పంపవద్దని, చిరుత సంచారం కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. వన్యప్రాణుల దాడుల నుంచి రక్షణ కల్పించడానికి శాశ్వత ప్రణాళికను అమలు చేయాలని స్థానికుల నుంచి డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

మోదీ సర్కారు ఆలస్యంగా మేల్కొంది

కాంగ్రెస్ నేత చిదంబరం విమర్శలు

న్యూఢిల్లీ: ఇండిగో విమాన సేవలకు గత కొద్ది రోజులుగా తీవ్ర అంతరాయం కలిగిన నేపథ్యంలో, మోదీ సర్కార్ విమాన చార్జీలపై పరిమితులు విధించింది. దీనిపై కాంగ్రెస్ నేత పి.చిదంబరం ఆదివారం తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. మోదీ సర్కార్ ఆలస్యంగా మేల్కొందని అన్నారు. విమానయాన రంగం కేవలం రెండు సంస్థల గుత్తాధిపత్యంలో కొనసాగినంత కాలం ఈ ధరల నియంత్రణ అమలులో ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టారు.

"విమానయాన మంత్రిత్వ శాఖ ఎట్టకేలకు మేల్కొని ఎకానమీ క్లాస్ ఫ్లైట్ టికెట్ల చార్జీలపై పరిమితులు విధించింది. అందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. అయితే దేశీయ విమానయాన రంగంలో కేవలం రెండు ప్రధాన సంస్థలు మాత్రమే గుత్తాధిపత్యం కొనసాగుతున్న కాలం, ఎకానమీ క్లాస్ చార్జీలపై పరిమితులు తప్పనిసరిగా అమలులో ఉండాలి. ఎందుకంటే బలమైన పోటీ లేనప్పుడు, అత్యధిక ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడానికి ఉన్న ఏకైక మార్గం ధరల నియంత్రణే "

ప్రభుత్వం విఫలం

గత కొద్ది రోజులుగా ఇండిగో విమాన సర్వీసులు స్తంభించిపోవడం అనేది ఆ సంస్థ యాజమాన్యం, విమానయాన మంత్రిత్వ శాఖ, డీజీసీఏతో సహా మోదీ ప్రభుత్వపు వైఫల్యాన్ని ఎత్తి చూపుతోందని చిదంబరం వ్యాఖ్యానించారు. 'కొత్త పైలట్ డ్యూటీ టైమ్ రూల్స్ జనవరి 2024లో నోటిఫై అయ్యాయి. కానీ విమానయాన సంస్థలు ఆ నిబంధనలకు అనుగుణంగా తమ కార్యకలాపాలను మార్చుకునేలా ప్రభుత్వం మార్గనిర్దేశం చేయడంలో పూర్తిగా విఫలమైంది. దీనికి విమానయాన మంత్రిత్వ శాఖ, డీజీసీఏ పూర్తిగా బాధ్యత వహించాలి' అని చిదంబరం ఆరోపించారు. "సంక్షోభం మొదలై తీవ్రరూపం దాల్చినప్పుడు, ప్రభుత్వం దిశా నిర్దేశం చేయలేకపోయింది. పూర్తిగా నిస్సహాయంగా ఉండిపోయింది. చివరికి చేతులెత్తేసింది" అని చిదంబరం విమర్శించారు.

'ఇండిగో' సంక్షోభ కారకులను వదిలిపెట్టం: కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ: ఇండిగో కార్యకలాపాల్లో తీవ్ర అంతరాయంతో దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ పరిణామాలతో ప్రయాణికులు ఎంతో మానసిక క్షోభకు గురయ్యారని పౌరవిమానయానశాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహెూల్ అన్నారు. వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెప్పారు. ఈ పరిస్థితులకు బాధ్యులు ఎవరో గుర్తించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. "ఇండిగో కొన్ని బాధ్యతలను నిర్వర్తించలేకపోయింది. ప్రయాణికులందరూ తీవ్ర మానసిక క్షోభను అనుభవించారు. అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ వ్యవహారంపై డీజీసీఏ ఇప్పటికే విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. అదేవిధంగా ఓ కంట్రోల్ రూమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇండిగోకు నోటీసులూ జారీ చేసింది. టికెట్ అమ్మకాల విషయంలో అన్ని విమానయాన సంస్థలపై పరిమితులు విధించాం. నలుగురు సభ్యుల కమిటీ తన నివేదికను సమర్పించిన అనంతరం తగు చర్యలు తీసుకుంటాం" అని మురళీధర్ మొహెూల్ తెలిపారు.

పనివేళల తర్వాత కాల్స్, మెయిల్స్ బంద్

లోక్‌సభలో ప్రైవేటు బిల్లు

న్యూఢిల్లీ: ఉద్యోగుల పనిభారాన్ని తగ్గించి, వారికి మెరుగైన జీవితాన్ని అందించే లక్ష్యంతో లోక్‌సభలో ఒక ఆసక్తికరమైన ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు. పనివేళలు ముగిసిన తర్వాత, సెలవు రోజుల్లో వచ్చే ఆఫీస్ ఫోన్ కాల్స్, ఈ-మెయిల్స్‌కు స్పందించకుండా ఉండే హక్కును ఉద్యోగులకు చట్టబద్ధంగా కల్పించాలనేది ఈ బిల్లు ప్రతిపాదన. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్‌చంద్ర పవార్) ఎంపీ సుప్రియా సూలే లోక్‌సభలో 'రైట్ టు డిస్‌కనెక్ట్ బిల్లు, 2025'ను ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం ఉద్యోగుల హక్కులను పరిరక్షించేందుకు ప్రత్యేకంగా ఒక 'ఉద్యోగుల సంక్షేమ అథారిటీ'ని ఏర్పాటు చేయాలని సూచించారు. డిజిటల్ యుగంలో పెరిగిపోతున్న పని ఒత్తిడిని తగ్గించి, ఉద్యోగులకు మెరుగైన పని-జీవిత సమతుల్యతను కల్పించడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని సుప్రియా సూలే తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. ఇదే తరహాలో కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కూడా ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి మరో ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు. భారతదేశంలో 51 శాతం మంది ఉద్యోగులు వారానికి 49 గంటలకు పైగా పనిచేస్తున్నారని, 78 శాతం మంది తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పని గంటలను పరిమితం చేయడం, మానసిక ఆరోగ్యానికి మద్దతు వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని సృష్టించాలని ఆయన తన బిల్లు ద్వారా కోరారు. అయితే, ఈ బిల్లులు ప్రైవేట్ మెంబర్ బిల్లులు కావడం గమనార్హం. మంత్రులు కాకుండా ఇతర ఎంపీలు ప్రవేశపెట్టే బిల్లులను ప్రైవేట్ మెంబర్ బిల్లులు అంటారు. సాధారణంగా పార్లమెంటులో ఇలాంటి బిల్లులు చట్టరూపం దాల్చడం చాలా అరుదు. ప్రభుత్వం ఇచ్చే సమాధానం తర్వాత చాలావరకు వీటిని ఉపసంహరించుకుంటారు.

మూడేళ్లుగా కరెంటు బిల్లు కట్టని తేజ్ ప్రతాప్ యాదవ్

పట్నా: ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌కు చెందిన ఓ ఇంటికి సంబంధించి కరెంటు బిల్లు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉంది. బకాయిల మొత్తం రూ.3.6 లక్షలు దాటినట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ప్రస్తుతం తేజ్‌ప్రతాప్ ప్రభుత్వ నివాసంలో ఉంటున్నారు. అయితే పట్నాలో ఆయనకు చెందిన ఓ ప్రైవేటు ఇంటికి చివరిసారిగా 2022 జులైలో కరెంటు బిల్లు చెల్లించారు. మూడేళ్లుగా బకాయిలు పేరుకుపోయాయి. జరిమానాలతో కలిపి కరెంటు బిల్లు రూ.3.61 లక్షలకు చేరింది. తేజ్‌ప్రతాప్ పేరు మీద మరో కరెంట్ కనెక్షన్ ఉన్నట్లు విద్యుత్తు శాఖ వెల్లడిస్తోంది. దీనికి సంబంధించిన బకాయిలు కూడా జరిమానాలతో కలిపి రూ.3,24,974 చెల్లించాల్సి ఉందని విద్యుత్ అధికారులు తెలిపారు. బకాయిలు పేరుకుపోకుండా బీహార్ ప్రభుత్వం ప్రీపెయిడ్ మీటర్లను ఏర్పాటు చేసింది. అయినప్పటికీ తేజ్ ప్రతాప్ తన నివాసానికి పోస్ట్‌పెయిడ్ మీటర్‌నే కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం రూ.25 వేల కంటే ఎక్కువ బిల్లు ఉంటే ఏ పోస్టుపెయిడ్ కనెక్షన్‌ను అయినా డీయాక్టివ్ చేయాలి. అయితే తేజ్‌ప్రతాప్ ఇంటి విద్యుత్ బిల్లు బకాయిలు రూ.3 లక్షలు దాటినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు ఈ వ్యవహారం రాష్ట్రంలో రాజకీయ దుమారం రేపుతోంది.

ఢిల్లీలో గాలి నాణ్యత స్వల్పంగా మెరుగు

న్యూఢిల్లీ: తీవ్రమైన గాలి కాలుష్యంతో ఇబ్బందులు ఎదుర్కొం టున్న ఢిల్లీ వాసులకు కొంత ఉపశమనం లభించింది. ఆదివారం గాలి నాణ్యత స్వల్పంగా మెరుగుపడినట్లు నివేదికలో వెల్లడైంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ప్రస్తుతం 305పాయింట్ల వద్ద ఉందని పేర్కొంది. శనివారంతో పోలిస్తే...గాలి నాణ్యత కొంతమేర మెరుగుపడినట్లు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తెలిపింది. ఢిల్లీలో వాయు కాలుష్యం విపరీతంగా పెరగడంతో అక్కడ ప్రజల దైనందిన జీవితం దెబ్బతినడంతో పాటు వారికి తీవ్రమైన అనారోగ్య సమస్యలు వస్తున్నాయని వివిధ సర్వేలు నివేదించాయి. ఈ నేపథ్యంలో వాయు కాలుష్యం నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు సైతం కేంద్రాన్ని ఆదేశించింది. 39 మానిటరింగ్ స్టేషన్లలో 26 స్టేషన్లు వెరీపూర్ క్యాటగిరీలో ఉండగా 13 స్టేషన్లు పూర్ క్యాటగిరీలో ఉన్నట్లు పొల్యూషన్ బోర్డు పేర్కొంది. వాహనాల వల్ల అధికంగా 14.8 శాతం కాలుష్యం సంభవిస్తుండగా పరిశ్రమలు 7.3శాతం, గృహాలు 3.6శాతం, నిర్మాణ రంగం రెండు శాతం కాలుష్యానికి కారణమవుతున్నాయని నివేదికలు తెలిపాయి. ఢిల్లీ పరిసరాల్లోని ఝజ్జర్ జిల్లా 13.9 శాతం, రోహ్‌తక్ 5.2 శాతం వాయు కాలుష్యానికి కారకాలుగా నిలుస్తున్నాయని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పేర్కొంది

20 ఏళ్లుగా చీకటి గదే లోకంగా...

చావు భయంతో కూతురిని ఇంటిలో బంధించిన తండ్రి

రాయ్‌పూర్: తన ఈడు పిల్లలు ఆనందంగా ఆడుకుంటూ ఉంటే... ఆ చిన్నారి మాత్రం చీకటి గదిలోనే 20 ఏళ్లు మగ్గిపోయింది. ఆరేళ్ల వయస్సులో సొంత ఇంట్లోనే బందీ అయిన లిసా ఇరవై ఏళ్ల తర్వాత ఇటీవల జన జీవనంలోకి వచ్చింది. అయితే ఇన్నేళ్లుగా చీకటిలో మగ్గిపోవడంతో ఆమె వెలుగును చూసే శక్తిని కోల్పోయింది. ఈ విషాద ఘటన చత్తీస్‌గఢ్ లోని బస్తర్ జిల్లాలో జరిగింది. ఇంత అమానుషానికి కారణం... కూతురిని రక్షించుకోలేనన్న ఆమె తండ్రి అభద్రతా భావం. వివరాల్లోకి వెళ్తే... బస్తర్‌లోని బకవండ్ గ్రామానికి చెందిన లిసా 2000 సంవత్సరంలో రెండో తరగతి చదువుతున్నప్పుడు ఆమెను ఓ గ్రామస్తుడు చంపేస్తానని బెదిరించాడు. దీంతో లిసా భయంతో వణికిపోయింది. అప్పటికే ఆమె తల్లి చనిపోయింది. వ్యవసాయం చేసే ఆమె తండ్రి తన కూతురిని రక్షించడానికి ఎవరూ లేరని భయపడి... ఆమెను 20 ఏళ్ల పాటు చీకటి గదిలో బందీగా ఉంచాలని నిర్ణయించాడు. ఆమెను ఇంట్లోనే కిటికీలు లేని గదిలో ఉంచి తాళం వేశాడు. రోజూ ఆహారం ఇవ్వడానికి మాత్రమే తలుపులు తెరిచేవాడు.

విశాలాంధ్ర
హైదరాబాద్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

విశాలాంధ్ర , కాప్రా : బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ డివిజన్‌లోని స్వామి వివేకానందనగర్ కాలనీ ఫేజ్-3లో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ కాలనీ వాసులతో కలిసి పర్యటించి కాలనీలో ఉన్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి అన్న సహకారంతో కాలనీలో ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సానాల రవికుమార్, ప్రధాన కార్యదర్శి పైళ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పల్లె శివగౌడ్, సంయుక్త కార్యదర్శులు పైళ్ల గౌతమ్, అరుణ్ కుమార్, కాలనీ సభ్యులు రాములు గౌడ్, దయాకర్, నవీన్, సైదులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

విశాలాంధ్ర - హైదరాబాద్: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో, మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్లపాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే అమలు చేయలేదన్నారు. జనరల్ సీట్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. పార్టీ పరంగా జనరల్ సీట్లలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామాలను మాడల్ విలేజ్ గా తయారుచేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రానున్న మూడేళ్లలో ప్రజా సంక్షేమ కోసం మరిన్ని పథకాలు అమలు చేస్తామని తెలిపారు. బూత్, గ్రామ, మండల, పట్టణస్థాయిల్లో పార్టీ కమిటీలను పూర్తిచేస్తామని అన్నారు. జిల్లా పార్టీని మరింత బలోపేతం చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు పథకాలు వివరించి పార్టీ అభ్యర్థుల గెలుపులో కీలకపాత్ర పోషించాలని కోరారు. సర్పంచ్ ఎన్నికల్లో వేలంపాటలు జరుగుతున్నాయనేది కేవలం ఊహజనితమని, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరుగుతున్నట్లు తెలిపారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, నాయకులు చంద్రకుమార్ గౌడ్, సీజే బెనహర్, వసంత, లింగం నాయక్ , బెక్కరి మధుసూదన్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, ఫయాజ్, అజ్మత్ అలీ, ఆవేజ్, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరచారి బలిదానం బాధాకరం

విశాలాంధ్ర, మల్కాజిగిరి : హైదరాబాదులో ఈశ్వర చారి ఆత్మహత్యకు పాల్పడం అత్యంత బాధాకరమని పోరాటాల ద్వారా బీసీ రిజర్వేషన్స్ సాధించుకోవాలి తప్ప ఆత్మహత్యలకు పాల్పడవద్దని బహుజన కులాల నాయకులు అన్నారు. వినాయకనగర్ డివిజన్‌లో సంతోషిమాత టెంపుల్ నుంచి వినాయక్‌నగర్ చౌరస్తా వరకు బహుజన కులాల నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కాసర్ల నాగరాజు, ఒగ్గు చంద్రశేఖర్, పూలపల్లి సుందర్‌యాదవ్, కరణంగోపి, నవీన్, కిరణ్ సంయుక్తం పాల్గొని మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధనకు శ్రీకాంత్ ఆచారి ప్రాణత్యాగం చేసిన విధంగా బీసీ రిజర్వేషన్స్ అమలు కోసం ఈశ్వర చారి ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమ న్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్స్ చట్టబద్ధంగా ఇస్తామని వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి బీసీలకు ద్రోహం చేశారన్నారు. 9వ షెడ్యూల్లో చేర్చకుండా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం బీసీలను దగా చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో బీసీలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. బీసీలు ఐక్య పోరాటం చేస్తున్న పాలకులు పట్టించుకోకుండా దగా చేస్తున్నందున ఈశ్వర చారి పెట్రోల్ పోసుకొని పట్టించుకుని ప్రాణం త్యాగం చేయడం ఆవేదన కలిగిస్తుందని, ఇది ప్రభుత్వ హత్యగా భావించవలసి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన కులాల నాయకులు జీడి నవీన్ గౌడ్, పిట్టల భాస్కర్, చుక్క సుధాకర్, జోగు శ్రీను, సంతోష్ చిందం, హరి, ఆంజనేయులు, ఈశ్వర్, మధు, మహేష్, వివేక్, రవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమానికి ప్రాధాన్యత : పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఏవర్గాన్ని విస్మరించకుండా అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అభివృద్ధి సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. రెండేళ్ల పాలనకు ప్రజా ఆమోదం సంపూర్ణంగా ఉందని కంటోన్మెంట్ , జూబ్లీహిల్స్ ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఆదివారం తనను కలిసిన విలేకరులతో రెండేళ్ల పాలనపై ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రెండేళ్లు పూర్తి చేసుకుని మూడో వసంతంలోకి అడుగుపెడుతున్నాం, రెండేళ్ల కాలం మరీ తక్కువే కానీ ప్రభుత్వం సాధించిన విజయాలు మాత్రం అత్యద్భుతం అన్నారు. ధనిక రాష్ట్రాన్ని తమ స్వార్థపూరిత నిర్ణయాలతో పదేళ్లలో దివాలా తీయించి ఆర్థిక సంక్షోభంలో రాష్ట్రాన్ని అప్పగిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రెండేళ్లలోనే సంక్షేమ రాష్ట్రంగా అభివృద్ధి దిశలో పరుగులు పెట్టిస్తున్నామన్నారు. రెండేళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడిన నాడు ఉన్న అస్తవ్యస్త పరిస్థితులను చక్కదిద్ది దేశానికే ఆదర్శంగా ప్రజారాజక పాలన సాగిస్తున్నాం ఎక్కడలేని ఎవరూ ఊహించని అభివృద్ధి సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసి వాటిని దిగ్విజయంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సన్నబియ్యం ఇందిర ఇండ్లు దేశానికి దిక్సూచిగా నిలిచాయని, ఏ రంగాన్ని విస్మరించకుండా ఏ ఒక్క వర్గం నిరాధారణకు గురికాకుండా అభివృద్ధి సంక్షేమం అనే రెండు చక్రాలపై ప్రగతి రథం పరుగులు తీస్తోందని వివరించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. వీటిలో నాలుగు గ్యారంటీలను అమలు చేశామని, మిగిలిన రెండు గ్యారంటీలలో కొన్నింటిని పాక్షికంగా అమలు చేశామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఈ రెండు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయలేదని, అయినా వాటిని ప్రజలకు అందించేందుకు ప్రయత్నిస్తామని, ఎన్నికల్లో హామీలు ఇవ్వకపోయినా ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేశామని గుర్తు చేశారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధిస్తున్నామన్నారు. ఆర్థికవృద్ధిలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ - 2047 విజన్ తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. 2035 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా వృద్ధి సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. అదే విధంగా 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్యం సాధించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో తొలిసారి జరిగిన కంటోన్మెంట్ ఉప ఎన్నికలతో పాటు ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయమే దీనికి నిదర్శనంగా పేర్కొన్నారు. ఈ ఎన్నికలను రిఫరెండమ్ అని ప్రతిపక్ష బిఆర్ఎస్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేసుకుంటే మా ప్రభుత్వానికి, సిఎం రేవంత్‌రెడ్డి పాలనకు ఎన్ని మార్కులు ఇవ్వవచ్చో అందరికీ అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో ఈ రెండేళ్లలో రెవెన్యూ, హౌసింగ్, సర్వే తదితర విభాగాలలో విప్లవాత్మక మార్పుల తీసుకువచ్చామన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో భూ సమస్యలను వీలైనంతవరకు తగ్గించడం, అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం తమ ప్రభుత్వం ముందున్న ప్రథమ లక్ష్యమన్నారు. ఇప్పటికే ఈ లక్ష్యదిశగా తాము చేపట్టిన చర్యలు విజయవంతంగా అమలు అవుతున్నాయన్నారు.

9న ఘనంగా 'విజయ్ దివాస్' : కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో కీలక మలుపు తిరిగిన డిసెంబర్ 9న 'విజయ్ దివాస్'గా ఘనంగా నిర్వహించుకోవాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అదివారం పార్టీ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన దిశానిర్దేశం చేశారు. కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు తలొగ్గి, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన రోజే డిసెంబర్ 9 అని కేటీఆర్ గుర్తుచేశారు. నవంబర్ 29న 'దీక్షా దివస్'ను విజయవంతం చేసినట్లే, కేసీఆర్ 11 రోజుల దీక్ష ఫలించిన డిసెంబర్ 9ని విజయం సాధించిన రోజుగా.. 'విజయ్ దివాస్' పేరుతో పండుగలా జరుపుకోవాలని ఆయన సూచించారు. డిసెంబర్ 9 రోజే 60 సంవత్సరాల తెలంగాణ ఆకాంక్షకు కేసిఆర్ ఆమరణ నిరాహార దీక్ష వలన ఒక రూపం వచ్చిందని కేటీఆర్ అన్నారు. అంతటి ఘనమైన చారిత్రక ఘట్టాన్ని మరోసారి స్మరించు కుంటూ, ఆనాడు కేసీఆర్ తెలంగాణ కోసం చేసిన త్యాగాన్ని గుర్తుచేస్తూ, ప్రత్యేక రాష్ట్ర ప్రకటన సిద్ధించిన రోజును సంబరంగా నిర్వహించుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అందరూ బిజీగా ఉన్నందున, గ్రామాల్లో కాకుండా కేవలం నియోజకవర్గ కేంద్రాల్లో మాత్రమే ఈ కార్యక్రమాలను నిర్వహించాలని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డిసెంబర్ 9న నియోజకవర్గ కేంద్రాల్లోని తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం చేయాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించి, ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు పండ్లు పంపిణీ చేయాలన్నారు. పార్టీ కార్యాలయాల వద్ద లేదా ప్రధాన కూడళ్లలో విజయానికి సూచికగా పింక్ బెలూన్లను గాలిలోకి ఎగురవేయాలని, కార్యక్రమం అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేసి, కేసీఆర్ దీక్ష, తెలంగాణ పోరాటం, విద్యార్థుల త్యాగాలను ప్రజలకు, భవిష్యత్ తరాలకు గుర్తుచేయాలని పేర్కొన్నారు. కేసీఆర్ దీక్ష ఫలవంతమైన నిమ్స్ ఆసుపత్రిలో మరియు గాంధీ ఆసు పత్రిలో తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ కార్యక్ర మాలు జరుగుతాయని తెలిపారు. నగర నాయకత్వం ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. మరో రెండు రోజులు సమయం ఉన్నందున జిల్లా అధ్యక్షులు చొరవ తీసుకొని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా సమన్వయం చేసుకోవాలని కేటీఆర్ కోరారు.

మీ విధిని రూపొందించుకోండి : కృష్ణకుమారి

విశాలాంధ్ర, హైదరాబాద్ : మీ విధిని మీరే రూపొందించుకోడానికి సరైన నిర్ణయాలు తీసుకోవాలని ప్రపంచ మానవతావాది, ఆధ్యాత్మిక నాయకురాలు సాధు వాస్వానీ మిషన్ గ్లోబల్ అధిపతి దీదీ కృష్ణకుమారి పేర్కొన్నారు. దీదీ కృష్ణకుమారి హైదరాబాద్‌ను సందర్శించిన నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల సాధు వాస్వానీ మిషన్, హైదరాబాద్‌లోని సాధు వాస్వానీ ఇంటర్నేషన్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ సిక్ విలేజ్‌లోని ఇంపీరియల్ గార్డెన్స్‌లో 'మీ విధిని రూపొందించండి - మీ మార్గాన్ని ఎవరు రూపొందిస్తారు? మీరు చేస్తారు' (డిజైన్ యువర్ డెస్టిని హు షేప్స్ యువర్ పాథ్) అనే అంశంపై దీదీ కృష్ణకుమారి ప్రసంగించారు. ఆద్యంతం ఆలోచనలకు దారితీసే విధంగా ప్రేరణాత్మక ఉపన్యాసం అందించారు. మన గమ్యం ముందే రాయబడింది కాదు.. మనమే ప్రతి రోజూ తీసుకునే నిర్ణయాలతో దాన్ని నిర్మించుకుంటాం అని దీదీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రతి చిన్న నిర్ణయం మన భవిష్యత్తు తీరు నిర్ణయిస్తుందని దీదీ కృష్ణకుమారి స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ఒక 'లైక్' రాకపోయినందుకు కలిగే బాధ నుంచి, ఒక కార్యక్రమానికి హాజరు కావాలా వద్దా అన్న నిర్ణయం వరకు జీవితం ఎప్పటికప్పుడు మన చేతుల్లోకి ఎన్నో ఎంపికలను అప్పగిస్తూనే ఉంటుందన్నారు. మన పరిస్థితులు మనల్ని నడపవు మనమే స్టీరింగ్ పట్టుకుంటే జీవితాన్ని నడిపించగలుగుతాం అని దీదీ గుర్తుచేశారు. ఉత్తమ నిర్ణయాలు తీసుకోవడానికి దీదీ కృష్ణకుమారి రెండు అలవాట్లను సూచించారు. మొదటిది..మన ఆలోచనలను క్రమంగా సంరక్షించుకోవడం. నేటి జీవన శైలిలో ఇతరులతో పోల్చుకోవడం, మన వద్ద లేనిదాన్ని కావాలనుకోవడం సహజమైపోయిందన్నారు. మనపై వచ్చే ఆరోపణలపై దృష్టి పెట్టకుండా, మనకు ఉన్న సన్నిహితుల ఆశీర్వాదాలపై కృతజ్ఞత వ్యక్తం చేసే భావనను పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. ప్రతి ఆలోచన భవిష్యత్తుకు విత్తనమవుతుందన్నారు. మనమే జోక్యం చేసుకునే క్షణం నుంచే గమ్యం మారుతుంది అని దీదీ కృష్ణకుమారి పేర్కొన్నారు. రెండో అలవాటు..సమయాన్ని, అంతర్గత శక్తిని విలువైనదిగా భావించడం. ప్రతి రోజు మన జీవితం ఒక చిన్న నౌక లాంటిది. దానిలో ఏది పడితే అది పోస్తే అది మునిగిపోతుంది అని ఉదాహరణతో వివరించారు. వేలాదిమంది హాజరైన ఈ కార్యక్రమం అత్యంత ఆసక్తికరంగా, ఇంటరాక్టివ్‌గా సాగింది. పాల్గొన్న వారు పెద్ద ఎత్తున స్పందిస్తూ దీదీ కృష్ణకుమారి సందేశాన్ని అభినందించారు. ఎంతో ప్రేరణాత్మకంగా, ఆలోచనలకు నాంది పలికిన సాయంత్రం కోసం వారు కృతజ్ఞతలు తెలిపారు.సాధు వాస్వానీ మిషన్ ఆధ్యాత్మిక, నైతిక కార్యక్రమాలతో పాటు మానవతా సేవలో విస్తృతంగా పాల్గొంటుందని పేర్కొన్నారు. జీవిత ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకోవడం, అనవసర ఆందోళనలను తగ్గించడం, రోజులో కొద్ది నిమిషాలు అయినా నిశ్శబ్దంగా మనసుతో మనమే మాట్లాడుకోవడం వంటి అలవాట్లు మనలోని అపారశక్తిని వెలికి తీస్తాయని చెప్పారు. విధి ఒక్కసారిగా రూపుదాల్చేది కాదని, క్షణం క్షణంగా, ఆలోచన ఆలోచనగా, నిర్ణయం నిర్ణయంగా తయారవుతుందని దీదీ కృష్ణ తన ఉపన్యాసాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సాధు వాస్వానీ మిషన్ ట్రస్టీలు డాక్టర్ హరీష్ మిర్చందాని, హీరా రూపానీ , హరి సాధ్వని, తరుణ్ దహిర్వేద్వాని పాల్గొన్నారు.

రైల్వే చక్రబంధం నుండి విముక్తి చేయడమే లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర, మల్కాజిగిరి : మల్కాజిగిరిని రైల్వే చక్రబంధం నుంచి విముక్తి చేయడం లక్ష్యంగా పని చేయనున్నట్లు శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి మాజి కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్ ఆధ్వర్యంలో శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డికి కృతజ్ఞత సభ మల్కాజిగిరి డివిజన్ లో జరిగింది. రూ.12 కోట్లు సఫిల్ గూడ ఆర్.యు.బి పనులకై మంజూరు అయ్యాయి. దీంతో బలరాం నగర్, సీతారాం నగర్, కృష్ణ నగర్, దేవి నగర్, చాణిక్యపురి కాలనీ, సఫిల్ గూడకు దగ్గరలో ఉన్న కాలనీ వాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే తన ప్రసంగంలో మల్కాజిగిరి అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని వివరించారు. మల్కాజిగిరిలో ఆర్‌యూబీలు, ఆర్‌ఓబీలు, ఏటిసి, అదనపు రోడ్లు, యుపిహెచ్.సిల నిర్మాణం, కోర్టు బిల్డింగ్, ఎలక్ట్రిసిటీ సౌకర్యాల అభివృద్ధి, అలాగే బ్రాహ్మణ కమ్యూనిటీకి ఒక ఎకరం స్థలం కేటాయింపు, గౌతమ్ నగర్ 5 ఎంఎల్.డి రిజర్వాయర్ నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు పరశురాం రెడ్డి, మండల రాధ కృష్ణ, కిషోర్ సింగ్, రామకృష్ణ, సోమ సుందర్, మురిగష్, శ్రీనివాస్ గౌడ్, గోపాల్ సింగ్, వెంకటేష్, అద్వైత్ కుమార్, సంతోష్, సజయ్, రవీంద్ర, గణేష్, సుధా, సతీష్, కోటేష్, శ్రీకాంత్, కిరణ్, రాజేష్ గౌడ్, వేణు యాదవ్, నవీన్, రజని గౌడ్, జ్ఞానేష్, ఇబ్రహీం, శ్రీకాంత్ యాదవ్, హేమంత్ పటేల్, హేమంత్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ చేయాలి : అజయ్ కుమార్ యాదవ్

విశాలాంధ్ర, బషీర్ బాగ్: గతంలో యాదవులకు ఉన్న ఎస్ఎస్టి రిజర్వేషన్ పునరుద్ధరణ, యాదవ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని యాదవ సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ , వైస్ చైర్మన్ చిలకల శ్రీనివాస యాదవ్, అధ్యక్షులు సిద్ధి రమేష్ యాదవ్ లు ప్రభుతాన్ని డిమాండ్ చేశారు.ఆదివారం మానిషా ప్రియా గార్డెన్, మాల్కాజ్ గిరి, హైదరాబాద్ లో యాదవ జేఏసీ ఆవిర్భావ సభ సమావేశం యాదవ అన్ని సంఘాల ఆధ్వర్యంలో అల్లాడి శరత్ కుమార్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొర్లకాపుర్ల సంఘాలకు అటవి భూములను కేటాయించాలన్నారు.పాల కేంద్రాలను యాదవ సంఘాల కేటాయించాలనీ, యాదవ విద్యార్థులకు ఐఏఎస్, ఐపీఎస్ గ్రూప్ - 1,2 ఉద్యోగాలకు కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. గొర్రెలకు, కాపరులకు ఫ్రీ ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. యాదవులకు మంత్రి పదవర్గంలో స్థానం కల్పించి, యాదవ్ లకు జనాభా దామష ప్రకారం నామినేటెడ్ పదవులు కేటాయించాలన్నారు. షీఫ్ ఫెడరేషన్ కు అన్ని జిల్లాల్లో ప్రభుత్వం వెంటనే ఎన్నికల నిర్వహించాలన్నారూ.కోకాపేట్ లో ఉన్న యాదవ భవనాన్ని ఓపెన్ చేసి యాదవులకు అప్పగించాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు, అల్లాడి శరత్ యాదవ్, సంద బోయిన ప్రసాద్ యాదవ్, జనరల్ సెక్రెటరీ, బీనవేని మల్లేష్ యాదవ్, సెక్రటరీ శ్రీరామ్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలు మరచిన కాంగ్రెస్ ప్రభుత్వం : బీజేపీ

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వంచక పాలనకు నిరసనగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన మహాధర్నా కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి , బీజేపీ రాజ్యసభ సభ్యులు డా.కె.లక్ష్మణ్, ,బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు , ఎమ్మెల్సీలు కొమరయ్యా, అంజి రెడ్డి, శాసనసభ్యులు పాయల్ శంకర్, మహేశ్వర్ రెడ్డి, వెంకట్ రమణరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ,శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్, రాష్ట్ర పార్టీ ప్రముఖ నాయకులుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో రైతు, మహిళ,యువత,విద్యార్థి... ప్రతి వర్గానికీ అన్యాయం జరిగింది. గ్యారంటీలు మాటల్లో మాత్రమే, అమలు మాత్రం సున్నా. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో పెద్ద తేడా లేదని, ప్రజల మేలు కోసం నిజమైన సంకల్పం ఉన్న ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు ఒక్కటి అమలు చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం (హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫార్మేషన్ పాలసీ) పేరుతో రూ.5 లక్షల కోట్ల రూపాయల భారీ భూ కుంభకోణానికి పాల్పడు తోంది. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలకు, పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారు. హైడ్రా వంటి దిక్కుమాలిన నిర్ణయాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిన్నదని ప్రపంచస్థాయి నగరంగా ఎదుగుతున్న హైదరాబాద్‌కు ఈ ప్రభుత్వం అడ్డంకిగా మారి, సామాన్య ప్రజలకు శాపంగా మారిందన్నారు. హైదరాబాద్ ప్రజలపై, తెలంగాణ ప్రజలపై మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలోనే గట్టి గుణపాఠం చెబుతారని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు శివసింగ్ రాందీన్, సీనియర్ నాయకులు తిరుపతి , రాజు, శ్రీను, యాదయ్య, సురేష్, నర్సింగ్ రావు, దేవేష్ , గచ్చిబౌలి డివిజన్ నాయకులు , మహిళ నాయకులు ,మహిళ కార్యకర్తలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్‌గా నరాల

విశాలాంధ్ర, బషీర్ బాగ్: తెలంగాణ పొలిటికల్ జేఏసీ హైదరాబాదులో జరిగింది. తెలంగాణ పొలిటికల్ జేఏసీ ప్రజా సమస్యలపై రాజీలేనిపోరాటం చేస్తుందనీ పేర్కొంది.ప్రజలే తమ ధైర్యం, ప్రజల కోసమే తమ పోరాటం అనే నినాదంతో తెలంగాణ పొలిటికల్ జేఏసీ ఏర్పాటు అయిందని వెల్లడించింది. తెలంగాణ పొలిటికల్ జేఏసీ చైర్మన్ గా నరాల సత్యనారాయణ, వైస్ చైర్మన్స్‌గా ధారావత్ గణేష్ నాయక్, పట్టం ఉపేందర్, అంగోతు రాంబాబు, సెక్రటరీ జనరల్ గా బత్తుల సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా బానోతు. హుస్సేన్ నాయక్, పూనెం శ్రీనివాస్, అధికార ప్రతినిధిగా తోడేటి శంకర్‌గౌడ్, అనంతుల మధు, రాష్ట్ర కార్యదర్శులుగా తుల్జా రెడ్డి, పాలకుర్తి కృష్ణ, సంగిశెట్టి క్రిస్టాఫర్, మహిళా కార్యదర్శిలుగా కంచర్ల మంజూష, కందుకూరి శ్వేత, సింగరాజు శ్యామల, రాష్ట్ర కమిటీ సభ్యులుగా మాలోతు రామన్న నాయక్, తునికి పాటి చారి, ఇస్లావత్ సంతోష్ నాయక్, కుక్క సత్యం గౌడ్‌ను ఎన్నికయ్యారు. తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం రెండు వేల మందితో ఇందిరాపార్కు వద్ద ధర్నా చేయాలని తీర్మానం చేసినట్లు తెలంగాణ పొలిటికల్ జేఏసీ చైర్మన్ నరాల సత్యనారాయణ తెలిపారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. త్వరలో 3500 మందితో ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చీమ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహిళలకు సబ్-కోటా కల్పించాలి : కృష్ణయ్య

విశాలాంధ్ర, బషీర్ బాగ్: పార్లమెంట్‌లో పాసైన మహిళ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని అప్పుడే బీసీ మహిళలకు రాజ్యాధికారం దక్కుతుందని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. బషీర బాగ్ ప్రెస్‌క్లబ్ లో తెలంగాణా రాష్ట్ర స్థాయి మహిళా సంఘాల కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణా బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలుగా గంగాపురం పద్మను నియమిస్తూ ఎంపీ ఆర్. కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ మహిళ బిల్లులో బీసీ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళ బిల్లుకు సార్థకత లేదన్నారు. ఇప్పటికే మహిళ బిల్లు రాజ్యసభలో లోక్ సభలో కూడా ఆమోదం పొందిందనీ, మహిళా బిల్లు గురించి గొంతులు చించుకొని మాట్లాడే రాజకీయ పార్టీల నాయకులు బి.సి మహిళల గురించి, వారికి జరుగుతున్న అన్యాయాల గురించి, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీసీలంటే చిన్న చూపా, బీసీ సబ్ కోటా గురించి అసెంబ్లీలో మొక్కుబడిగా తీర్మాణం చేసి చేతులు దులుపుకుంటే సరిపోతుందా అని అన్నారు. జనాభాలో సగం ఉన్న బి.సి.మహిళలకు కోటా ఇవ్వకుండా మహిళల గురించి మాట్లాడటం అన్యాయమన్నారు. మహిళ బిల్లులో రాజకీయ రిజర్వేషన్ల తో పాటు విద్యా - ఉద్యోగాలలో కూడా 50 శాతం రిజర్వేషన్లను ప్రవేశపెట్టాలని కోరారు. రాజకీయ రిజర్వేషన్లను పెడితే 180 మంది మహిళలు పార్లమెంటులో సభ్యులవుతారనీ పేర్కొన్నారు.మహిళలకు రక్షణ కోసం ఇప్పటికీ అనేక చట్టాలు ముఖ్యంగా వరకట్న నిషేద చట్టం ,అత్యాచార, నిరోధక చట్టం, నిర్భయ చట్టం ,బాల్య వివాహాల నిరోధక చట్టం, దిశా చట్టం లాంటి 19 చట్టాలు వచ్చినప్పటికి వారి పై అత్యాచారాలు తగ్గలేదన్నారు. పురుశాదిక్యత తగ్గలేదనీ, మహిళల రక్షణ కోసం మరిన్ని చట్టాలు తేవలసిన అవసరం ఉందన్నారు. అనంతరం ర్యాగ అరుణ్ కుమార్ మాట్లాడుతూ స్త్రీలపై అత్యాచారాలు, హత్యలకు సినిమా రంగం కూడా తోడవుతుందన్నారు. సినిమాలలో అసభ్యకర అంశాలు ముఖ్యంగా నగ్న, అర్ధనగ్న, సెక్స్ దృశ్యాలు పూర్తిగా నిషేధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.సి సంఘం అధ్యక్షులు గవ్వల భరత్, జాతీయ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ అనురాధ గౌడ్, దివ్య, దీపా, పద్మ, వసంతమ్మ, జ్యోతి, అపర్ణ, రాజకుమారి, లక్ష్మి సౌజన్య, ప్రియాంక స్వప్న, లక్ష్మి యాదవ్, పుష్ప లతా, రాజేశ్వరి, మాధవి పాల్గొన్నారు.

పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

విశాలాంధ్ర-దుండిగల్: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని కాంగ్రెస్ రాష్ట్ర యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి పేర్కొన్నారు.ఆదివారం బీకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీలో సీఎంఆర్ హాస్పిటల్ వైద్య బృందంతో కలిసి 11వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ పేద,మధ్యతరగతి కుటుంబాలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యమని, ముందస్తు ఆరోగ్య పరీక్షల ప్రాముఖ్యతను వివరించిన ఆయన, ప్రజలు ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అనంతరం మెడికవర్ వైద్య బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏఆర్ సాధు యాదవ్,మాజీ సర్పంచ్ కావలి గణేష్, పరశు రాం గౌడ్,ధర్మారెడ్డి,రాంబాబు గౌడ్ గోపాల్ రెడ్డి,చారి,పలువురు స్థానిక నాయకులు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

రాజకీయాల్లో యువతకు అవకాశం ఇవ్వాలి

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్: స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లో యువతకు అవకాశం ఇవ్వడంతో పాటు గెలిపించేందుకు ప్రజలందరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్ నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామంలో బీజేపీ సర్పంచ్ అభ్యర్థి విట్యాల మంజుల నర్సింహాకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వీట్యాల మంజుల గుర్తు పర్స్ గుర్తుకు ఓటు వేసి గెలించవలసిందిగా కిషన్‌నగర్ ఓటర్లను కోరడం జరిగింది. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లోకి చదువుకున్న యువకులు వస్తే గ్రామీణ ప్రాంతాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు వీలుంటుందన్నారు. వెనుకబడి పోతున్న పల్లె సీమలను ప్రగతి సీమలుగా మార్చేందుకు ఎంతో అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువస్తుందని వివరించారు.మహిళ పర్స్ గుర్తుకు ప్రతి ఒక్కరు ఓటు వేసి గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మిద్దె గణేష్, ఆంజనేయులు, మల్లేష్, లింగం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలన

విశాలాంధ్ర, మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న ఎస్ఎన్డీపీ పనులను ఆదివారం ఉదయం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి పర్యవేక్షించారు. ప్రస్తుతం జరుగుతున్న డ్రెయినేజీ, లైనింగ్ మరియు రోడ్ రీస్టోరేషన్ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ... ఎస్ఎన్డీపీ పనులు పూర్తికావడంతో వర్షాకాలంలో ఇబ్బందులు కలిగించే వరద నీరు మరియు మురుగు నీటి సమస్యలు తగ్గిపోతాయని తెలిపారు. ప్రజలకు త్వరగా ఉపయోగపడే విధంగా పీర్జాదిగూడ, కాచివాని సింగారం రోడ్డును పూర్తి చేయాలని సంబంధిత శాఖ, కాంట్రాక్టర్ లను అధికారులను సమన్వయ పరచి వారితో మాట్లాడి పనులను పూర్తి చేయాలని చెప్పారు. అంతేకాకుండా, పనులను నాణ్యత ప్రమాణాలకు లోబడి, ఎలాంటి లీకేజీలు లేకుండా, భవిష్యత్తులో సమస్యలు రాకుండా అత్యంత జాగ్రత్తగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా పీర్జాదిగూడ-కాచవని సింగారం రోడ్డును పది రోజుల లోపే ప్రజల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చంద్రారెడ్డి, వీరాంజనేయ స్వామి ఆలయ ధర్మకర్త వంగూరి పరమేష్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, పెంటయ్య గౌడ్, వంగూరి ప్రభంజన్ మరియు స్థానిక నాయకులు, పలు కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మాచర్ల వారి కోర్టులో

O.S. No. 70 / 2022

బిట్వీన్ :
బొమ్ము శ్రీను ......వాది.
వర్సెస్
కనకటి వెంకట్ యాదవ్ .....ప్రతివాది.

To,
కనకటి వెంకట్ యాదవ్,తండ్రి.సత్యనారాయణ, హిందూ,వయస్సు:42సం॥లు,వెటర్నరీడాక్టర్, R/o.పదర, నాగర్ కర్నూల్‌జిల్లా, ప్రస్తుతం R/o. ట్రస్ట్‌వెట్, క్లినిక్ మల్టీ స్పెషాలిటీ వెట్ హాస్పిటల్. H.No:5-109/3, B/1, నార్సింగ్‌రోడ్డు, OPP:JRC కన్వెన్షన్ అండ్ విస్పర్ వ్యాలీ, జూబ్లీహిల్స్ హైదరాబాద్-500033, తెలంగాణ రాష్ట్రం.

పైన తెలిపిన వాది మీపై ప్రామిసరీ నోటు ఆధారం చేసుకుని దావా దాఖలుచేయగా, శ్రీ కోర్టు వారు మీకు సమన్లు నిమిత్తము ఆర్డర్ వేయగా, మీకు ఎన్ని పర్యాయములు బత్తా చెల్లించినను, మీరు సమన్లు తీసుకొని యుండ లేదు. మీకు ది.22/12/2025న వాయిదా అయి ఉన్నది. కావున మీరు **ది.22/12/2025**న **ఉ॥గం॥10:30ని॥**లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, వకీల్ ద్వారా కానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణాలు ఉన్నయెడల తెలుపుకొన గలరు.లేనియెడల మీపరోక్షముందు దావా తీర్మానము జరుగును. వాయిదా ది. **22/12/2025.**
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

చిలమకూరి నాగిరెడ్డి, అందుగుల బాలజోజి
వాది తరపు న్యాయవాదులు
సెల్: 944112956,9866499323. మాచర్ల-522426.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మాచర్ల వారి కోర్టులో

O.S. No. 67 / 2022

బిట్వీన్ :
బొమ్ము యేసురాజు ....వాది.
వర్సెస్
కనకటి వెంకట్ యాదవ్ ....ప్రతివాది.

To,
కనకటి వెంకట్ యాదవ్ తండ్రి సత్యనారాయణ, హిందూ, వయస్సు:42సం॥లు,వెటర్నరీడాక్టర్, R/o.పదర, నాగర్ కర్నూల్‌జిల్లా, ప్రస్తుతం R/o. ట్రస్ట్‌వెట్, క్లినిక్ మల్టీ స్పెషాలిటీ వెట్ హాస్పిటల్. H.No:5-109/3, B/1, నార్సింగ్‌రోడ్డు, OPP:JRC కన్వెన్షన్ అండ్ విస్పర్ వ్యాలీ, జూబ్లీహిల్స్ హైదరాబాద్-500033, తెలంగాణ రాష్ట్రం.

పైన తెలిపిన వాది మీపై ప్రామిసరీ నోటు ఆధారంచేసుకుని దావా దాఖలుచేయగా,శ్రీ కోర్టు వారు మీకు సమన్లు నిమిత్తము ఆర్డర్‌వేయగా మీకు ఎన్నిపర్యాయములు బత్తా చెల్లించినను, మీరు సమన్లు తీసుకొనియుండలేదు. మీకు ది. 22/12/2025న వాయిదా అయి ఉన్నది.కావున మీరు **ది.22/12/2025**న **ఉ॥గం॥10:30ని॥** లకు పైకోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, వకీల్ ద్వారా కానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణాలు ఉన్న యెడల తెలుపుకొన గలరు. లేనియెడల మీ పరోక్షముందు దావా తీర్మానముజరుగును.
వాయిదా ది. **22/12/2025.**
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

చిలమకూరి నాగిరెడ్డి, అందుగుల బాలజోజి
వాది తరపు న్యాయవాదులు
సెల్: 944112956,9866499323. మాచర్ల-522426.

ప్రభుత్వ భూములు కబ్జా

- 58,59 జీవోల పేర్లతో సర్వే నెం..120/21 లో భూకబ్జాల దందా
- రెవెన్యూ అధికారుల అండతోనే భూ కబ్జాలు
- కూల్చిన చోటే తిరిగి మళ్లీ నిర్మాణాలు



విశాలాంధ్ర-దుండిగల్: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో కోట్లు విలువచేసే ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నాయి. డి.పోచంపల్లిలో కొందరు దళారులు ఓ పార్టీ జెండాను అడ్డం పెట్టుకొని చలామణి అవుతున్నారు. భూ దాహంతో ఖాళీ ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు, అధికారుల సహకారంతో మింగేస్తున్నారు. పట్టపగలే సర్కార్ స్థలాలను చదును చేస్తూ కబ్జా చర్యలకు పదును పెడుతున్నారు. అధికారులకు మామూళ్ల మకిలి అంటగట్టి.. ఆపై నకిలీ డాక్యుమెంట్లతో స్థలాలను హంఫట్ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ గండిమైసమ్మ మండలం పరిధి డి.పోచంపల్లి సమీపంలో ఉన్న 120/21 సర్వే నంబరు ప్రభుత్వ భూమిలో కొంతమంది వ్యక్తులు అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్నారు.ఈ విషయం తెలిసినా మండల రెవెన్యూ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ భూమిలో తప్పుడు పట్టా సర్టిఫికెట్లను సృష్టిస్తూ తాత్కాలికంగా ఇళ్లను నిర్మించి,ఇతరులకు 20 నుంచి 40 లక్షల వరకు విక్రయిస్తున్నారని ప్రజల నుంచి ఆరోపణలు వ్యక్త మవుతున్నాయి. ఈ స్థలంలో అక్రమంగా నిర్మించిన బేస్మెంట్ నిర్మాణాన్ని గతంలో అధికారులు కూల్చివేసినప్పటికీ మళ్లీ అదే చోట రేకుల ఇంటి నిర్మాణాన్ని చెకచెకా పూర్తి చేశాడు. అధికారులకు తెలిసిన తమకేమీ పట్టనట్లు ఉండడం వెనుక అధికారులకు కూడా పెద్ద మొత్తంలో ముడుపులు అందినట్లు తెలుస్తోంది. మండలంలోని ఓ అధికారి ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతున్నాడనే ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి. ఇంటి నిర్మాణానికి పర్మిషన్ ఇవ్వకుండానే అక్రమ నిర్మాణాలను చేపట్టడం,ఫిర్యాదు చేసిన తనకేమీ పట్టనట్లు ఉండడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఇందుకు కారణం ఈ ప్రాంతంలో గజం స్థలం రూ.30 వేలకు పైగా డిమాండ్ ఉండడంతో కొంతమంది కబ్జాదారులు ప్రభుత్వ స్థలలపై కన్నేశారు.ఈ స్థలంలో అక్రమంగా ఇళ్లను నిర్మించి, పాత తేదీలతో తప్పుడు ఇంటి నంబర్లను సృష్టించి ఒక్కో ఇంటిని లక్షలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు నిద్ర మత్తును విడి 120/21 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాని కూల్చివేసి కబ్జాదారులపై కేసు నమోదు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడితే క్రిమినల్ కేసుల ఎక్కడా?

అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్న గాండీమైసమ్మ రెవిన్యూ అధికారులు హెచ్చరికలకు మాత్రమే పరిమితమైనట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేస్తే తిరిగి మళ్లీ నిర్మించుకుంటున్నారు. ఇదంతా అధికారులు చూస్తున్న కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన దాఖలాలు లేవు. మండలం పరిధిలోని ప్రభుత్వ భూములను పరిరక్షించి ప్రజలకు ఉపయోగపడే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు..

మధుమేహ బాధితులు ఎక్కువగా దృష్టిపెట్టాలి

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: మన దేశం మధుమేహ రాజధానిగా మారిపోయింది. 2022 నాటి లెక్కల ప్రకారం ప్రపంచంలో మధుమేహ బాధితులు అత్యంత ఎక్కువగా ఉన్నది భారతదేశంలోనే. అయితే, మధుమేహ బాధితులు అన్నింటికంటే ఎక్కువగా దృష్టిపెట్టాల్సింది వాళ్ల కాళ్లమీదేనని పలువురు ప్రముఖులు తెలిపారు. ఈ విషయంపై అవగాహన కల్పించేందుకు నగరంలో ఆదివారం నిర్వహించిన వాకథాన్‌ను మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఛైర్మన్ రమేష్ గోరంట్ల, టాలీవుడ్ నటుడు సుశాంత్, కిమ్స్ ఆస్పత్రుల ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు ప్రారంభించారు. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, "మధుమేహం అనేది చాలా సాధారణంగా మొదలయ్యే సమస్య. అసలు చాలామందికి అది ఉందన్న విషయమే మొదట్లో తెలియదు. దాన్ని గుర్తించేసరికే చాలా ఆలస్యం అవుతుంది. పైగా మధుమేహం ఉన్నవాళ్లు తమ కళ్లు, కాళ్లు, ఇతర అవయవాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. కంటిచూపు తగ్గుతున్నా, కాళ్ల మీద పుళ్లు కనిపించినా, ఏమైనా దెబ్బలు తగిలినా వెంటనే తగిన చికిత్సలు తీసుకోవాలి. వాటిలో నిర్లక్ష్యం చేయడం వల్ల చాలామందికి కాళ్లు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రతిరోజూ తగినంత నడక, యోగా, లేదా మరేదైనా భౌతిక కార్యకలాపాలతో చురుకైన జీవనశైలి గడపాలి. స్మార్ట్ ఫోన్లు, ఇతర గాడ్జెట్ల మీద ఎక్కువగా ఆధారపడితే శారీరక కార్యకలాపాలు తగ్గిపోయి ఇలాంటి సమస్యలన్నీ వస్తాయి" అని తెలిపారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఛైర్మన్ రమేష్ గోరంట్ల మాట్లాడుతూ, "ఇంతకుముందు మధుమేహం అంటే 50. 60 ఏళ్లు దాటినవాళ్లకే ఉండేది. కానీ ఇప్పుడు బాగా చిన్నవయసు వాళ్లలో కూడా ఇది ఉంటోంది. పిల్లలు, యువత మామూలుగా ఆటలు ఆడుకుంటూ ఉంటారు. ఆటల్లో దెబ్బలు తగలడం సర్వసాధారణం. అయితే, అలాంటప్పుడు మధుమేహం ఉన్నవాళ్లయితే వాళ్లకు గాయాలు అంత త్వరగా నయం కావు. ఇప్పుడు ఇక్కడున్న వైద్యులు, ఇతర ప్రముఖులు చెప్పేదాన్ని బట్టి చూస్తుంటే ఇలాంటి గాయాల వల్ల కాళ్లు తొలగించాల్సిన పరిస్థితి కూడా ఏర్పడుతుంది. అలా జరగకుండా ఉండాలంటే మధుమేహం ఉన్నవాళ్లు కాళ్ల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఎప్పటికప్పుడు మధుమేహం స్థాయి పరీక్షించుకోవడంతో పాటు కీలక అవయవాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి" అని సూచించారు. టాలీవుడ్ నటుడు సుశాంత్ మాట్లాడుతూ, "ఇన్నాళ్ళూ కళ్లకు, ఎముకలకు, పొట్టలోని భాగాలకు.. ఇలా రకరకాల వైద్యులు ఉంటారని తెలుసు గానీ, ప్రత్యేకంగా పాదాల కోసం కూడా ఒక ప్రత్యేక వైద్యవిభాగం ఉందన్న విషయం నాలాంటి చాలామందికి తెలియదు. ఇటీవలి కాలంలో చాలామందికి మధుమేహం ఉంటోంది. అందువల్ల ప్రతి ఒక్కళ్లూ కాళ్ల విషయాన్ని సరిగ్గా పట్టించుకోవాలి. ఏమాత్రం తేడా అనిపించినా వెంటనే ఇలాంటి ఫుట్ క్లినిక్‌లకు వచ్చి పరీక్ష చేయించుకోవాలన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

విశాలాంధ్ర, హైదరాబాద్ : ఏపీ మహేష్ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ల ఎన్నికలు ఎలాంటి ఘటనలు జరగకుండా సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించటం జరిగిందని ఇంచార్జీ కలెక్టర్ మను చౌదరి తెలిపారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని కమలా నెహ్రూ పాలిటెక్నిక్, సరోజినీ నాయుడు వనిత మహా విద్యాలయలలో జరుగుతున్న ఎన్నికల పోలింగ్ కేంద్రాలను రెవెన్యూ అధికారి ఈ .వెంకటాచారి తో కలిసి సందర్శించి పోలింగ్ సరళిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూతులలో విధులు నిర్వహిస్తున్న అధికారులతో పోలింగ్ జరుగుతున్న ప్రక్రియ గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి తప్పులు దొర్లకుండ జాగ్రత్తగా వ్యవహరించాలని ఎన్నికల అధికారులకు ఆయన సూచించారు. హైదరాబాద్, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ లతో పాటు ఇతర రాష్ట్రాల్లోని మొత్తం 78 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించగా 36.16 శాతం పోలింగ్ నమోదు అయినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే మొత్తం 78 కేంద్రాలలో 37142 మంది ఓటర్లకు గాను మహిళా ఓటర్లు 5087 , పురుష ఓటర్లు 8342 మొత్తం 13429 ఓట్లు నమోదు అయినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసి అడిషనల్ డిసిపి ఆనంద్, డిసిపి శిల్పవల్లి , ఏసీపీ లు సంజయ్ కుమార్, ప్రవీణ్ ను పోలీస్ అధికారు అధికారులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో హైద్రాబాద్ ఆర్డీవో రామకృష్ణ, లా ఆఫీసర్ శ్రీధర్, డిసిఓ ప్రసన్న, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ జ్యోతి, నాంపల్లి తాసిల్దార్ నయీముద్దీన్, రెవెన్యూ ,పోలీస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావణంలో ఎన్నికలు : సీఐ

విశాలాంధ్ర - మొయినాబాద్: ఈ నెల 14న జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు పార్టీ నాయకులకు ఓటర్లకు సీఐ పవన్ కుమార్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోనీ గ్రామాలలో ఎన్నికలపై స్థానిక నాయకులు ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ పవన్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికలవేళ ప్రచారంలో గాని ఫలితాలు సమయంలో గానీ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాలలో కూడా రెచ్చగొట్టే ప్రసంగాలు పోస్టులు పెడితే సహించే ప్రసక్తే లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారిని సంధ్య, పలువురు పోలీస్ సిబ్బంది, స్థానిక నేతలు, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం వెల్లు విరిసిన వేళ...

విశాలాంధ్ర, మల్కాజిగిరి : నియోజకవర్గం, గౌతమ్ నగర్ డివిజన్ ఇంద్ర నెహ్రూ నగర్ లో అద్దె ఇంట్లో నివసిస్తున్న నిరుపేదరాలైన పార్వతి కూతురు 11 సంవత్సరాల దీపాలి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. అంత్యక్రియలు చేయడానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని మానవ సేవ మాధవసేవ వాట్సాప్ గ్రూప్ అధ్యక్షుడు కుమ్మరి రాజుకి తెలియజేయడంతో సదరు విషయాన్ని తోటి వాట్సప్ గ్రూప్ సభ్యులకు తెలియజేసి మానవతా దృక్పథంతో జంగాల శ్రీరామ్ యాదవ్, పిట్ల నాగరాజ్, మహమ్మద్ రషీద్‌ల సహకారంతో దీపాలి అంతక్రియలకు రూ.11 వేలు ఆర్థిక సహాయాన్ని దీపాలి తండ్రి, సోదరికి అందజేశారు. పుణ్య కార్యానికి సహకారం అందించిన వాట్సాప్ గ్రూప్ సభ్యులకు పలువురు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వాట్సప్ గ్రూప్ ప్రతినిధిలు మహమ్మద్ రషీద్ తో పాటు బాయమ్మ, మల్లేష్, బుచ్చమ్మ, పాల్గొన్నారు.

426 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఈ డ్రైవ్‌లో భాగంగా మొత్తం 426 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. వీరిలో 323 ద్విచక్ర వాహనదారులు, 17 ఆటోలు, 85 కార్లు, 01 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత -2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హొమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది. 1 నుంచి 6వ తేదీవరకు మొత్తం 410 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి. వీరిలో 41 మందికి జరిమానా, జైలు శిక్ష, 21 మందికి జరిమానా, సోషల్ సర్వీస్, 348 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

అక్రమంగా రేషన్ బియ్యం స్వాధీనం

విశాలాంధ్ర తల్లాడ : తల్లాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత మిట్టపల్లి గ్రామంలోని మీర్జా గిలానీ బేగ్ అనే వ్యక్తి ఇంట్లో పేదలకు సబ్సిడీ కింద ఇచ్చే (40) క్వింటాళ్ల రేషన్ బియాన్ని గుర్తించి నిందుతుడిని అదుపులోకి తీసుకున్నట్లు మరో వ్యక్తి మీర్జా ముషారఫ్ పరారీఉన్నట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. రేషన్ బియ్యం విలువ 1,36,000/- ఉంటుందని తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం తల్లాడ పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర,షాద్ నగర్, రూరల్ : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో ప్యారడైస్ కాలనీలోని మస్జిద్ - ఎ - సయ్యద్ హుస్సేన్, రైల్వే స్టేషన్ రోడ్డులోని మజ్జిద్ -ఎ - సయ్యద్ అబ్దుల్ మలిక్ ఇస్లామిక్ సెంటర్‌లో షాద్‌నగర్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్,హాజీ సయ్యద్ హుస్సేన్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సయ్యద్ ఇబ్రహీం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సయ్యద్ ఇబ్రహీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది కులమతాలకు అతీతంగా వృద్ధులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేసి పేషంట్లకు మెడిసిన్స్ కళ్ళజోడు(కళ్ళ అద్దాలు) ఉచితంగా అందించారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి సయ్యద్ ఇబ్రహీం దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చూసుకున్నారు. సయ్యద్ ఇబ్రహీం ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించడం ప్రజలు సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. అదేవిధంగా ప్రజలందరూ తమ తమ ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

విశాలాంధ్ర , కాప్రా : చర్లపల్లి డివిజన్ పరిధిలోని చర్లపల్లి శ్రీ మహంకాళి దేవాలయంలో శ్రీ అయ్యప్ప స్వామి 15వ మండలం మహా పడి పూజ గురు స్వామి డి నాథం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జావుండ్ల సత్తిరెడ్డి రుద్రగోని రాంచందర్ గౌడ్ పల్లె వెంకట్ రెడ్డి రుద్రగోని వెంకటేష్ గౌడ్ కె ప్రేమ్ ఆర్ నాథం గౌడ్ టీ బీరప్ప కె బాల రాజు కె రవి జి రమేష్ జె వేణు గోపాల్ రెడ్డి రమేష్ సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: ఆర్‌సీపురం బీహెచ్‌ఈఎల్‌లోని ఇంటర్నేషనల్ క్లబ్‌లో బీహెచ్‌ఈఎల్ పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆర్‌సీపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, భారతి నగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ సోమిరెడ్డి, మాజీ కౌన్సిలర్ సోమదాస్, మాజీ కౌన్సిలర్ రవీందర్ రావు మరియు పలువురి ప్రముఖులతో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఈ సందర్భంగా కార్పొరేటర్ జ్యోతి ప్రజ్వలన చేసి, కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఎన్నికల వ్యయ పరిశీలకులు పర్యటన

విశాలాంధ్ర - కొత్తగూడెం : ఎన్నికల వ్యయ నియంత్రణలో భాగంగా అవుతున్న ఖర్చుల అబ్జర్వర్ లావణ్య, నోడల్ ఆఫీసర్ ఏ.వీ. రెడ్డి ఆదివారం దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో పర్యటనలు నిర్వహించారు. ముందుగా అధికారులు దుమ్ముగూడెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. పోటీచేస్తున్న అభ్యర్థుల నామినేషన్ పత్రాలు, ఎన్నికల వ్యయ నమోదు రిజిస్టర్లు, షాడో రిజిస్టర్, రసీదుల తోపాటు లావాదేవీల వివరాలను సమగ్రంగా పరిశీలించారు. వ్యయ పరిమితుల అమలు, పత్రాల నిర్వహణలో ఖచ్చితత్వం, పారదర్శక విధానాలపై సంబంధిత సిబ్బందికి దిశానిర్దేశం చేసారు. అనంతరం అధికారులు చర్ల మండలంలో కూడా వ్యయ రికార్డులను పరిశీలించి, పోటీ చేస్తున్న అభ్యర్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో అభ్యర్థులు ఎన్నికల వ్యయ నియమావళిని కచ్చితంగా పాటించాలన్నారు. ప్రతి ఖర్చు లావాదేవీని తగిన ఆధారాలతో నమోదు చేయాలని ఆదేశించారు. సమయానుసారంగా రిపోర్టులు సమర్పించాలని కూడా అధికారులు ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత అత్యంత ముఖ్యమన్నారు. ఏవైనా లోపాలు ఉన్న పక్షంలో తక్షణమే సరిదిద్దాలని స్థానిక అధికారులకు సూచనలు చేసారు. ఈ పర్యటనలో ఎలక్షన్ వ్యయ టీములు, ఎంపీడీఓ సిబ్బంది, సంబంధిత విభాగాధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: హవేలి ఘనపూర్ మండలం బూరుగుపల్లి ఉన్నత పాఠశాల 1990-91 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మెదక్‌లో నిర్వహించారు. చిన్న నాటి స్మృతులు గుర్తు చేసుకున్నారు. అప్పట్లో బోధించిన ఉపాధ్యాయులు రాంరెడ్డి, రమణ చారీతో పాటు ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, నవీన్, కొండల్ రెడ్డి, నాగరాజు, బుజంగ రావు, వెంగల్ రావు, రాజశేఖర్, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టు భావజాలం ప్రచారం చేద్దాం

ప్రతి కార్యకర్త సైద్ధాంతిక సోషల్ మీడియా సైనికుడు కావాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

విశాలాంధ్ర-తిరుపతి: ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త సైద్ధాంతిక సోషల్ మీడియా కార్యకర్తలుగా తయారు కావలసిన అవశ్యకత ఎంతయినా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య అన్నారు. తిరుపతి గంధమనేని శివయ్య భవన్‌లో రెండు రోజుల సోషల్ మీడియా రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ ముగింపు సమావేశం ఆదివారం ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేంద్ర అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరయిన ఈశ్వరయ్య మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఒకప్పుడు విశాలాంధ్ర పత్రిక కోసం మూడు రోజులు ఎదురు చూసి తెప్పించుకుని చూసిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. అయితే నేడు సోషల్ మీడియా విస్తృతంగా పెరిగిందన్నారు. విద్యార్థి, యువజన సంఘాలు సమాజంలోని సమస్యల పరిష్కారానికి చేస్తున్న పోరాటాలను విస్తృతంగా సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. మనం పెట్టే పోస్టులు, చేసే షేరింగ్ అభ్యుదయ భావాల వైపుగా ఉండాలన్నారు. పార్టీ సిద్ధాంతాలతో పాటు పార్టీ చేస్తున్న డిమాండ్లపై, ప్రభుత్వాల తీరుపై కార్యకర్తలు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. పార్టీ పత్రికలు, అందులో వచ్చే అంశాలు సోషల్ మీడియాలో చేయాలని, ప్రతి కార్యకర్త నిత్య విద్యార్థిగా అధ్యయనం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు చేపట్టే ప్రజా వ్యతిరేక కార్యక్రమాల గురించి సోషల్ మీడియాలో పోస్టులు చేసి ప్రజా ఉద్యమాలకు ఊతమివ్వాలని అన్నారు. శాస్త్ర బద్ధమైన విజ్ఞానాన్ని పెంచే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. నేడు ఒక్కో పార్టీకి ఒక్కో మీడియా వత్తాసు పలుకుతున్న తరుణంలో కమ్యూనిస్టు పార్టీ సోషల్ మీడియాను ఒక వేదికగా మార్చుకోవాలన్నారు. సీపీఐ బలోపేతానికి సోషల్ మీడియాలో చురుకైన పాత్ర పోషించే కార్యకర్తలను సైనికుల్లా తయారు చేయాలన్నారు. జనవరి 18 న ఖమ్మం జిల్లాలో జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు లక్షలాది మంది తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఉత్సవాలపై సోషల్ మీడియాలో ప్రచారం చేయాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ రెడ్డి మాట్లాడుతూ ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన విశాలాంధ్ర పత్రికను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ప్రజా ఉద్యమాల కర దీపికగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి పాఠకుల సంఖ్యను పెంచాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు మాట్లాడుతూ సోషల్ మీడియాను ఉపయోగించుకుని పార్టీ సిద్ధాంతాలు, ఉద్యమ ఫలితాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి గండాల సంతోష్ కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.వలరాజు, బి.నాసర్ జి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు 'తెన్నేటి' విశిష్ట సేవలు

సంస్మరణ సభలో వక్తల ఘన నివాళి

విశాలాంధ్ర- విజయవాడ: వారసత్వ సంపదగా వస్తున్న తెలుగు భాషా కుటుంబంలో జన్మించిన రచయిత్రి, సాహితీవేత్త, కవయిత్రి, వంశీ సంస్థల అధ్యక్షురాలు డాక్టర్ తెన్నేటి సుధాదేవి సంస్మరణ సభ శారదా కళా సమితి అధ్వర్యంలో ఆదివారం హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగింది. పలువురు ప్రముఖులు ఆమె చిత్రపటానికి పూలదండలు వేసి ఘన నివాళులర్పించారు. సమితి అధ్యక్షుడు దోగిపర్తి శంకరరావు అధ్యక్షునిగా జరిగిన సభలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ కార్యదర్శి డాక్టర్ రావి శారద, కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచంద్ తదితర భాషావేత్తలు, భాషాభిమానులు మాట్లాడుతూ ... వివిధ జాతీయ, అంతర్జాతీయ, సాహితీ, సాంస్కృతిక సంస్థల సత్కారాలు ఎన్నో సుధాదేవిని వరించాయన్నారు. తెలుగు అకాడమీలో మూడు దశాబ్దాలకు పైబడి వివిధ హోదాలలో బాధ్యతలు నిర్వహించి డిప్యూటీ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేశారని అన్నారు. తెలుగు భాషకు విశిష్ట సేవలు అందించిన ఆమె లేని లోటు పూడ్చలేనిదన్నారు. దాదాపు 500 సామెతలకు నాటికలు రాశారని, వాటిలో 75 నాటికలను తెలుగు సామెత నాటికలు పేరిట పుస్తకాన్ని కూడా ప్రచురించారన్నారు. తెలుగు పరిశోధన పుస్తకాల పత్రికకు సంపాదకురాలిగా బాధ్యతలు నిర్వహించారని, బలిజేపల్లి లక్ష్మీకాంత కవి నాటక వైదుష్యంపై పీహెచ్‌డీ చేసిన ఆమె జర్నలిజం కూడా చేశారన్నారు. సాహితీ లోకానికి ఆమె చేసిన సేవలను వివరించారు.

పోలవరం జిల్లాపై పునరాలోచించాలి

అక్కినేని వనజ సూచన

విశాలాంధ్ర-జీలుగుమిల్లి: నూతనంగా ఏర్పడే పోలవరం జిల్లాపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ సూచించారు. సీపీఐ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం జీలుగుమిల్లిలో పోలవరం నియోజకవర్గం సమన్వయ కమిటీ సమావేశం మండల కార్యదర్శి కొమరం ధారయ్య అధ్యక్షతన జరిగింది. అక్కినేని వనజ మాట్లాడుతూ పోలవరం జిల్లా ఏర్పాటునకు భౌగోళికంగా అనేక ఇబ్బందులు ఉంటాయని, దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదని అన్నారు. ఒక ప్రాజెక్టులో రెండు రకాల సిద్ధాంతాలతో ప్రభుత్వం నడుస్తుందని విమర్శించారు. ఒక ప్రాంతానికి కట్ ఆఫ్ డేట్ 2022... మరో ప్రాంతానికి 2017 అని వ్యాఖ్యానించారు. కట్ ఆఫ్ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారికి ప్యాకేజి ఇస్తామనడం విడ్డూరంగా ఉందని అక్కినేని వనజ అన్నారు. కార్మికులు, పేదల సంక్షేమం కోసం నిరంతరం పోరాడింది సీపీఐ అని, వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి గ్రామంలో ఎర్ర జెండా ఎగరాలని ఆమె పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య మాట్లాడుతూ జనవరి 18న జరిగే ఖమ్మం సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎండీ మునీర్, జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు బోడిక రాము, నాయకులు బీఎస్ సాగర్, కొప్పుల నాగరాజు, ఉకే చంద్రం, టి.ఆంజనేయులు, లక్కు లక్ష్మణ రావు, జేవీ నరసింహారావు, తాడిగడప జయరాజు, సోడెం రమణ తదితరులు పాల్గొన్నారు.

'నా భర్తను సీఎం అభ్యర్థిగా ప్రకటించాలి': సిద్ధూ భార్య

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పంజాబ్ రాష్ట్ర మహిళా నేత నవజ్యోత్ కౌర్ చేసిన సంచలన ప్రకటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 2027లో పంజాబ్ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఆమె తాజాగా చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. రాజకీయ సమీకరణల్లో మార్పులు చోటుచేసుకో బోతున్నాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. భారత మాజీ క్రికెటర్, రాజకీయ నేత నవజ్యోత్ సింగ్ భార్య నవజ్యోత్ కౌర్ ... తన భర్త నవజ్యోత్ సిద్ధూను పంజాబ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ప్రకటిస్తే, ఆయన క్రియాశీల రాజకీయాల్లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. సిద్ధూకు తగిన అవకాశం లభిస్తే రాష్ట్రానికి సేవ చేసేందుకు తిరిగి రాజకీయాల్లోకి అడుగుపెడతారని ఆమె స్పష్టం చేశారు. అయితే పంజాబ్ కాంగ్రెస్‌లో అంతర్గత కలహాలు తీవ్రంగా ఉన్నాయని, ఐదుగురు నేతలు ముఖ్యమంత్రి పదవి కోసం ప్రయత్నిస్తున్నారని, వారు సిద్ధూ పురోగతిని అడ్డుకోవడానికి ప్రయత్నించే అవకాశం ఉందని నవజ్యోత్ కౌర్ ఆరోపించారు. హైకమాండ్ దీనిని అర్థం చేసుకోవాలని ఆమె కోరారు. సిద్ధూ దృష్టి పంజాబ్ అభివృద్ధిపైనే ఉందని, ఏ పార్టీకి ఇవ్వడానికి మా దగ్గర డబ్బు లేదని, అయితే తాము మంచి ఫలితాలు ఇస్తామని, పంజాబ్‌ను బంగారు రాష్ట్రంగా మారుస్తామన్నారు. రూ. 500 కోట్ల సూట్‌కేస్ ఇచ్చేవాడు ముఖ్యమంత్రి అవుతాడనేది మా విధానం కాదని అన్నారు. పంజాబ్ రాజకీయాల్లో డబ్బు పాత్రపై ఆమె పరోక్షంగా విమర్శలు చేశారు. అభివృద్ధి ఆధారిత రాజకీయాలకు సిద్ధూ కట్టుబడి ఉంటారని ఆమె అన్నారు. క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలిగినప్పటికీ, సిద్ధూ ...కాంగ్రెస్ పార్టీతోనూ, ప్రియాంక గాంధీ వాద్రాతో ఇప్పటికీ సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తున్నారని నవజ్యోత్ కౌర్ తెలిపారు. కాగా రాజకీయాల నుంచి దూరమైన తర్వాత, సిద్ధూ ఐపీఎల్ క్రికెట్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అలాగే తన అనుభవాలు ప్రేరణాత్మక చర్చలు, జీవనశైలి తదితర విషయాలను తెలియజేస్తూ ఆయన 'నవ్‌జోత్ సిద్ధూ అఫీషియల్' అనే యూట్యూబ్ ఛానెల్‌ను ప్రారంభించారు. నవజ్యోత్ కౌర్ చేసిన తాజా ప్రకటన దరిమిలా నవజ్యోత్ సిద్ధూ క్రియాశీల రాజకీయాలకు తిరిగి రావచ్చనే ఊహాగానాలకు బలం చేకూర్చాయి. పంజాబ్‌లో కాంగ్రెస్ హైకమాండ్ తీసుకునే తదుపరి నిర్ణయంపై సిద్ధూ రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

నయన మనోహరం కూచిపూడి నాట్యం

విశాలాంధ్ర- విజయవాడ: జేఎంఎస్ నాట్యవేద అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డాన్స్ నెలవారీ కార్యక్రమాలలో భాగంగా ఘంటసాల సంగీత నృత్య కళాశాల కళావేదికపై సంస్థ నాట్యాభ్యాసకులు దాదాపు 100 మంది ప్రదర్శించిన కూచిపూడి నాట్యాంశాలు ఆద్యంతం నయన మనోహరంగా సాగాయి. జంగం విజయకుమార్ నేతృత్వంలో జంగం సోదరీమణులుగా గుర్తింపు పొందిన మనీషా చక్రవర్తి, శిరీష చక్రవర్తిలు నృత్య దర్శకత్వం వహించారు. ప్రదర్శనలో కలిపే శ్రీప్రఖ్య, చందన, జాశ్రిత, తన్మయి, సంహిత, దేవర్ష, దివిష, అనండి, గీతాన్షి, రూహిక, షణ్ముఖ, లాస్య తదితరులు పూర్వ రంగం, నర్తన గణపతిం, శివాష్టకం, పలుకు తేనెల తల్లి, బ్రహ్మాంజలి, వెడలేరా వయ్యారము వంటి ఇత్యాది అంశాలను లయాత్మకంగా, సాహిత్యానికి అనుగుణమైన భావంతో అభినయిస్తూ నర్తించిన అంశాలు ఆసాంతం ప్రేక్షకులను సమ్మోహనపరిచాయి. సాహితీవేత్త, యోగ అధ్యాపకుడు, సంస్థ వ్యవస్థాపకుడు జంగం శ్రీనివాస చక్రవర్తి పర్యవేక్షించారు.

మా పెళ్లి రద్దయింది...

వేర్వేరుగా ప్రకటించిన స్మృతి, పలాశ్

న్యూఢిల్లీ: తమ పెళ్లి రద్దయిందంటూ భారత స్టార్ మహిళా క్రికెటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్... వేర్వేరుగా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ప్రకటించారు. ముచ్చల్‌తో మంధానకు గత నెల 23న జరగాల్సిన పెళ్లి... అనుకోని కారణాల వల్ల వాయిదా పడిన విషయం విధితమే. అయితే పెళ్లి పూర్తిగా రద్దయినట్లు ఇప్పుడు ఇద్దరూ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. పెళ్లి రద్దు గురించి ఇన్‌స్టా స్టోరీలో వీరిద్దరూ రాసుకొచ్చారు. "గత కొన్ని వారాలుగా నా జీవితం చుట్టూ చాలా ఊహాగానాలు సాగాయి. ఇలాంటి సమయంలో నేను మాట్లాడటం ముఖ్యం. నా గురించి అన్నీ గోప్యంగా ఉండాలని భావించే వ్యక్తిని. కానీ, వివాహం రద్దయిందని స్పష్టం చేయాలనుకుంటున్నా. ఈ విషయాన్ని ఇక్కడితో ముగిస్తారని భావిస్తున్నా. రెండు కుటుంబాల గోప్యతను గౌరవించి.. ముందుకు సాగేందుకు స్పేస్ ఇవ్వాలని అభ్యర్థిస్తున్నా. దేశాన్ని అత్యున్నత స్థాయిలో ఉంచేందుకు ముందుకు సాగుతా. భారత్ తరఫున మరిన్ని మ్యాచ్‌లు ఆడి ట్రోఫీలు గెలుస్తా. నాకు మద్దతిచ్చిన అందరికీ ధన్యవాదాలు. ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైంది" అంటూ స్మృతి మంధాన ఇన్‌స్టాలో రాసుకొచ్చిరారు. "నేను జీవితంలో ముందుకు వెళ్లాలని నిశ్చయించుకున్నా. నా వ్యక్తిగత సంబంధం నుంచి బయటకు వచ్చాను. ఆధారాల్లేని వదంతులను సులభంగా నమ్మేస్తున్న వారిని చూసి తట్టుకోవడం కష్టంగా ఉంది. ఇది నా జీవితంలో అత్యంత కష్టకాలం. సోర్స్ ఎవరో, ఏంటో ఎప్పటికీ తెలియని వదంతుల ఆధారంగా ఎవరినైనా జడ్జి చేసే సమయంలో... ఈ సమాజం ఒక్కసారి ఆగి ఆలోచించాలి. ఇలాంటి అంశాల్లో మన మాటలు అవతలి వ్యక్తిని గాయపరుస్తాయనే విషయాన్ని గుర్తించాలి. నా ప్రతిష్ఠకు భంగం కలిగించే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసినవారిపై మా లీగల్ టీమ్ చట్టపరమైన చర్యలు తీసుకుంటుంది. ఈ కష్ట సమయంలో నా పక్షాన నిలిచినవారికి ధన్యవాదాలు" అంటూ ముచ్చల్ రాసుకొచ్చారు.

ఇవి ప్రభుత్వాలా... వ్యాపార సంస్థలా!

- ప్రశ్నించడమే నేరమంటున్న పాలకులు
- మనుషులు మాట్లాడకపోతే ప్రజాస్వామ్యానికి అర్థమే లేదు
- నిఖిలేశ్వర్ పుస్తకాల ఆవిష్కరణ సభలో వక్తలు



విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రభుత్వాలు వ్యాపార సంస్థలుగా మారిపోతున్నాయని, ప్రశ్నలంటే పాలకులు భయపడుతున్నారని వక్తలు విమర్శించారు. ఒకప్పుడు ప్రశ్నించడమే సహేతుకంగా ఉండేది కానీ ఇప్పుడు అదే నేరమవతుందని వ్యాఖ్యానించారు. ప్రముఖ కవి నిఖిలేశ్వర్ రచించిన మూడు పుస్తకాలు 'ఎక్కడికీ గమనం? ఎంతదూరమీ గమ్యం?', 'గోడల వెనుక (జైలు జ్ఞాపకాలు)', 'ఎవరిదీ ప్రజాస్వామ్యం? ఏ విలువలకీ ప్రస్థానం?'ను ఆదివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. వామపక్షవాది డాక్టర్ జతిన్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ కల్పనా కన్నబిరాన్, ప్రొఫెసర్ కట్టా ముత్యంరెడ్డి, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నందిని సిధారెడ్డి, సీనియర్ తెలకపల్లి రవి ప్రసంగించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ప్రసంగిస్తూ ప్రజాస్వామ్యం పేరిట జరుగుతున్న అనుచిత చర్యలను ప్రశ్నించాలన్నారు. మనుషులు మాట్లాడకపోతే ప్రజాస్వామ్యానికి అర్థమే లేదని... కేసులు, దాడులు, అరెస్టులకు భయపడి నోరు విప్పకపోతే ప్రజాస్వామ్యం మనజాలదని నొక్కిచెప్పారు. 'మాట్లాడండి, మాట్లాడుతూనే ఉండండి, నోరు విప్పండి' అని పౌరసమాజానికి పిలుపునిచ్చారు. నిఖిలేశ్వర్ వంటి వాళ్లు రాయబట్టే, మాట్లాడబట్టే 1971లో నాటి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చిన్నపురెడ్డి, జస్టిస్ ఏడీవీ రెడ్డి తదితరులు డిటెన్షన్ కేసులపై చరిత్రాత్మక తీర్పులు ఇచ్చారని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గుర్తు చేశారు. ప్రొఫెసర్ సాయిబాబా ప్రశ్నించేతత్వాన్ని ప్రస్తావించారు. 2026 మార్చి నెలాఖరుకల్లా నక్సలైట్లను నిర్మూలిస్తామనే కేంద్ర హోంశాఖ ప్రకటనను అన్యాపదేశంగా ప్రస్తావిస్తూ...'మేం చెప్పినట్టు వినండి, లేకుంటే మిమ్మల్ని పలానా తేదీలోపల నిర్మూలిస్తాం' అనే ధోరణి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో 'మీ ఆలోచనలే మీ శత్రువులని' జస్టిస్ సుదర్శన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల్లో 'ఎవరి మీద యుద్ధం చేయాలి' అనేది ప్రధాన ప్రశ్న అని అన్నారు. ప్రొఫెసర్ కల్పనా కన్నబిరాన్ మాట్లాడుతూ డిటెన్షన్ కేసు విచారణలో న్యాయమూర్తుల ప్రశ్నలకు నిఖిలేశ్వర్ మాటలే నేటికీ అక్షర సత్యాలన్నారు. 1971లో జస్టిస్ చిన్నపరెడ్డి ఇచ్చిన తీర్పుకి ఇప్పుడు వస్తున్న తీర్పులకు పోలికే లేదన్నారు. న్యాయమూర్తుల భాష రాజ్యాంగపరంగా కాక వీధి భాషగా ఉందని వాఖ్యానించారు. 1971 నాటి రాజ్యాంగ వారసత్వం ఏమైందని ప్రశ్నించారు. నిఖిలేశ్వర్ వంటి వారిని వెర్బల్ నక్సలైట్లుగా గతంలో అభివర్ణించారని, ఇప్పుడు అలాంటి వాళ్లనే అర్బన్ నక్సలైట్లు అంటున్నారన్నారు. రాజ్యాంగానికి కాపాడుకోవాల్సిన బాధ్యత సామాన్యులదేనని అన్నారు. ప్రముఖ రచయిత, కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి ఛైర్మన్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ రచయితల్లో కెరియరిజం ఉంటుందన్నారు. ఎవరైతే ఆలోచిస్తారో వాళ్లకు ఫిర్యాదులూ ఉంటాయని, ఆ పనే నిఖిలేశ్వర్ చేశారన్నారు. రచయిత నిఖిలేశ్వర్ మాట్లాడుతూ "గోడల వెనుక" జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. దేశంలో పరిస్థితులు మారాలనే తపనతోనే ఈ పుస్తకాలను తెచ్చినట్టు చెప్పారు. సీనియర్ జర్నలిస్టు, నిఖిలేశ్వర్ కుమారుడు రాహుల్ సభకు వందన సమర్పణ చేశారు. కాగా, నిఖిలేశ్వర్ రాసిన విద్యారంగ వ్యాసాలను ప్రొఫెసర్ కట్టా ముత్యంరెడ్డి సమీక్షించారు.

125 బీఆర్‌ఓ ప్రాజెక్టులు జాతికి అంకితం

రూ.1.51 లక్షల కోట్లకు రక్షణ ఉత్పత్తి: రాజ్‌నాథ్



లేహ్: దేశవ్యాప్తంగా బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌ఓ) నిర్మించిన 125 ప్రాజెక్టులను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం లేహ్ నుంచి జాతికి అంకితం చేశారు. దేశ సరిహద్దుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఈ ప్రాజెక్టులే నిదర్శనమని అన్నారు. వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన ఈ ప్రాజెక్టులను రూ. 5,000 కోట్ల వ్యయంతో లద్దాఖ్, జమ్మూకశ్మీర్, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, మిజోరాంలలో నిర్మించారు. ఇందులో భాగంగా 28 రహదారులు, 93 వంతెనలు, మరో నాలుగు ఇతర ప్రాజెక్టులను బీఆర్‌ఓ నిర్మించింది. బీఆర్‌ఓ చరిత్రలో ఒకేరోజు ఇన్ని ప్రాజెక్టులు ప్రారంభం కావడం ఇదే ప్రథమం. ఈ సందర్భంగా లేహ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, ఆత్మనిర్భర్ భారత్‌కు అనుగుణంగా నూతన సాంకేతికతతో సకాలంలో ప్రాజెక్టులను బీఆర్‌ఓ పూర్తిచేయడం అభినందనీయమని అన్నారు. మన సైనికులు సమర్థవంతంగా పనిచేసేందుకు రోడ్ నెట్‌వర్క్, రియల్ టైమ్ కమ్యూనికేషన్, ఉపగ్రహ ఆధారిత నిఘా వంటి సౌకర్యాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. మన సైనికుల శౌర్యం, ధైర్యం మనందరికీ స్ఫూర్తిదాయకమని, దేశ సేవలో ప్రాణాలు కోల్పోయిన వీరులకు ఈ ప్రాజెక్టులు అంకితమని పేర్కొన్నారు. సరిహద్దు రోడ్లు జాతీయ భద్రతకు లైఫ్‌లైన్లని అభివర్ణించారు. సాయుధ బలగాలు, బీఆర్‌ఓ సిబ్బంది, సరిహద్దు ప్రాంతాల్లోని పౌరులు కలిసి జాతీయ భద్రతకు రక్షణకవచాలుగా ఉన్నారని ప్రశంసించారు. ఈ అనుబంధం ఇలాగే కొనసాగుతుండాలని విజ్ఞప్తి చేశారు. భారతదేశం రక్షణ తయారీలో దిగుమతులపై ఆధారపడిన దేశం నుంచి అభివృద్ధి చెందుతున్న ఉత్పత్తిదారు-ఎగుమతిదారుగా మారుతున్న నమూనా మార్పును చూస్తోందని సింగ్ అన్నారు. ఒకప్పుడు దేశంలో ఆయుధాలు, పరికరాలను దేశీయంగా తయారు చేయడానికి బలమైన వ్యవస్థ లేదని, కానీ దశాబ్ద కాలంలో జరిగిన నిరంతర ప్రయత్నాలు ఆ పరిస్థితిని తిప్పికొట్టాయని అన్నారు. 'గత 10 సంవత్సరాలలో మన కృషి కారణంగా 2014లో దాదాపు రూ.46,000 కోట్లుగా ఉన్న దేశీయ రక్షణ ఉత్పత్తి ఇప్పుడు రికార్డు స్థాయిలో రూ.1.51 లక్షల కోట్లకు పెరిగింది. 10 సంవత్సరాల క్రితం రూ.1,000 కోట్ల కంటే తక్కువగా ఉన్న మన రక్షణ ఎగుమతులు ఇప్పుడు దాదాపు రూ.24,000 కోట్లకు చేరుకున్నాయి' అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు.

ఐదేళ్ల తర్వాత గల్వాన్ యుద్ధ స్మారకం..

ప్రపంచంలో అత్యధిక ఎత్తులో నిర్మించిన యుద్ధస్మారకాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం ఆవిష్కరించారు. దీనిని గల్వాన్ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన భారత వీరుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేశారు. లద్ధాఖ్‌లోని కేఎం-120 ష్యోక్-దౌలత్‌బేగ్ ఓల్డీ మార్గంలో వద్ద దీనిని నిర్మించారు. ప్రపంచంలో సైనిక మోహరింపులు జరిగే అత్యంత కఠినమైన యుద్ధక్షేత్రంగా దీనికి పేరుంది. సున్నా డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత ఉండే ఈ ప్రాంతంలో దీనిని 'భారత్ రణ్‌భూమి దర్శన్' కార్యక్రమం కింద నిర్మించారు. ఈ ఏడాది ఆర్మీ దినోత్సవం నాడు దీనికి సంబంధించిన ప్రకటన వెలువడింది. ఈ యుద్ధ స్మారకాన్ని ఎరుపు-నలుపు రంగు గ్రానైట్ రాళ్లతో నిర్మించారు. ఇవి త్యాగం, వీరత్వానికి చిహ్నంగా నిలిచాయి. త్రిశూల్-డమరు మోడల్‌లో ఇవి ఉన్నాయి. దీంతోపాటు మన అమరవీరులకు గుర్తుగా కాంస్యంతో చేసిన 20 బొమ్మలను ఏర్పాటు చేశారు. ఇక ఈ యుద్ధ స్మారకం కాంప్లెక్సులో మ్యూజియం, గల్వాన్ ఘటనను తెలియజేసే డిజిటల్ గ్యాలరీ, లద్ధాఖ్ సైనిక చరిత్రను తర్వాత తరాలకు అందించేలా ఏర్పాటు చేశారు.

రైతులకు పాలకుల దగా

కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-తిరుపతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ రైతులను దివాలా తీయించి... చివరకు వారిని ఆత్మహత్యలకు పాల్పడేలా పురిగొల్పుతున్నాయని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ విమర్శించారు. ఆదివారం తిరుపతి గంధంనేని శివయ్య భవన్‌లో జరిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లా రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గతంలో మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చి 750 మంది రైతులను బలిగొందని మండిపడ్డారు. నేడు కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన విత్తన చట్టం, విద్యుత్ చట్టం-2025 బిల్లులు సైతం కార్పొరేట్లకు కొమ్ముకాసేందుకే తప్ప వాటివల్ల రైతాంగానికి ఒరిగేదేమీ లేదని దుయ్యబట్టారు. రైతులను స్వతహాగా తమ కాళ్లపై తాము నిలబడేలా ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు కోసం ఏ మాత్రం ప్రయత్నం చేయకపోవడం దుర్మార్గమన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చేసిన ప్రగల్భాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నేడు రైతు వ్యతిరేక చర్యల వలన గిట్టుబాటు ధర లేక, చేసిన అప్పులు కట్టుకోలేక అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో సైతం అన్నదాత సుఖీభవ అర్హులందరికీ అందడం లేదని, పైగా రైతులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. మామిడి, టమాటా, పత్తి పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రామానాయుడు మాట్లాడుతూ ఈ నెల 22న చిత్తూరు కలెక్టరేట్ వద్ద మామిడి రైతుల బిల్లుల చెల్లింపు కోసం జరిగే ధర్నా జయప్రదం చేయాలని కోరారు. రైతు సంఘం అధ్వర్యంలో ఈ నెల 29న కాళహస్తిలో, జనవరి 8న చిత్తూరులో జరిగే జిల్లా స్థాయి సదస్సులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. టి.జనార్ధన్, తిరుపతి జిల్లా కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, కో కన్వీనర్ బి.శ్రీనివాసులు, చిత్తూరు జిల్లా కార్యదర్శి కె.మునిరత్నం నాయుడు, ఎ.చిన్ని రాజ్, జె.గురవయ్య, జి.మునిరత్నం. గోవింద స్వామి, పద్మనాభ రెడ్డి, రైతు సంఘం నాయకులు వంగిమళ్ల రంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

11న జరిగే స్థానిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

జిల్లా ఎన్నికల సహాయ అధికారి సంకీర్త్

విశాలాంధ్ర - పినపాక : పినపాక మండలంలో 24 పోలింగ్ కేంద్రాలలో 174 బూత్ లలో ఈనెల 11న జరిగే స్థానిక ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల సహాయ అధికారి సంకీర్త్ తెలిపారు. ఆదివారం ఆయన పినపాక ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ 28 వార్డులు ఏకగ్రీవం ఆయినట్లుగా చెప్పారు. 202 బూతులలో ఎన్నికలు జరగాల్సి ఉండగా ఏకగ్రీవం అయిన కేంద్రాలు మినహాయించి 174 కేంద్రాల్లో ఎన్నిక జరుగుతుందన్నారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నా ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఈ సమయంలోనే ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. ఓటర్స్ స్లిప్పులు ఇప్పటికే పంపిణీ చేశామని, అందని వారు తమ దగ్గర ఉన్న గుర్తింపు కార్డు తీసుకొచ్చి ఓటర్ లిస్టులో చెక్ చేసుకొని ఓటు వేయోచన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు.

రాజాపూర్‌లో పుల్లెల కొమురయ్య, భాగ్యలక్ష్మి జోరుగా ప్రచారం

విశాలాంధ్ర- మంథని: సింగరేణి భూ నిర్వాసిత గ్రామమైన రాజాపూర్ ప్రజలకు పునరావాసం, ఆర్ & ఆర్ ప్యాకేజీని నిర్దిష్టంగా అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ తెలిపారు. పుల్లెల కొమురయ్య, భాగ్యలక్ష్మికి మద్దతుగా గ్రామంలో ప్రచారం నిర్వహించిన ఆయన, భూ నిర్వాసితుల హక్కులు కాపాడే బాధ్యతను మంత్రి శ్రీధర్ బాబు కొమురయ్యకు అప్పగించారని, ఎలాంటి అన్యాయం జరగకుండా ప్యాకేజీ అమలు పర్యవేక్షిస్తారని చెప్పారు. ప్రజలు సంపూర్ణ మద్దతుతో కొమురయ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రొద్ద బాపన్న, బండారి సదానందం గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం క్రెడాయ్ ప్రాపర్టీ షో

నగర రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు దిక్సూచి
తాతా మధుసూదన్, ఎమ్మెల్సీ, ఖమ్మం పార్టీ అధ్యక్షులు

విశాలాంధ్ర -ఖమ్మం : నేడు ఖమ్మం నగరం ఎస్.ఆర్ , బి.జి.ఎస్.ఆర్ కాలేజీ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన క్రెడాయ్ ప్రాపర్టీ షో కు హాజరైన ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, అక్కడ ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమం లో తాతా మధుసూదన్ మాట్లాడుతూ, "ఇది కేవలం స్టాళ్ల ప్రదర్శన మాత్రమే కాదని, ఇది ఖమ్మం రియల్ ఎస్టేట్ మార్కెట్ ప్రస్తుత స్థితిని, నగర అభివృద్ధి దిశను స్పష్టంగా ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. ఈ ప్రదర్శన ద్వారా ఖమ్మం నగరం రూపురేఖలు ఏ విధంగా మారుతున్నాయో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ఖమ్మం ప్రజల గృహ అవసరాలకు అనుగుణంగా, నిర్మాణం ప్రారంభ దశ నుండి తుది దశ వరకు అవసరమయ్యే వివిధ రకాల ఉత్పత్తులు, సాంకేతికతలు ఇక్కడ ప్రదర్శించబడ్డాయి. బిల్డర్లు, డెవలపర్లతో పాటు, వారికి కావాల్సిన టెక్నాలజీని, నిర్మాణ సామగ్రిని సరఫరా చేసే అనుబంధ సంస్థలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషం. ఈ ప్రదర్శనలో నాణ్యతతో కూడిన నిర్మాణ వస్తువులు, భద్రతను పెంపొందించే అత్యాధునిక ఎక్విప్‌మెంట్, వైరింగ్ సొల్యూషన్స్ వంటివి దృష్టిని ఆకర్షించాయి. ఈ ప్రదర్శన చూసి తాను వ్యక్తిగతంగా చాలా ఇంప్రెస్ అయ్యానని ఆయన తెలిపారు. ఖమ్మం అభివృద్ధికి కృషి చేస్తూ, తమ వ్యాపారాలను విస్తరిస్తున్న అన్ని కంపెనీల యజమానులు, నిర్వాహకులు మరింతగా రాణించాలని తాతా మధుసూదన్ ఆకాంక్షించారు. ఈ విజయవంతమైన క్రెడాయ్ ప్రాపర్టీ షో నిర్వహణకు కృషి చేసిన నిర్వాహక కమిటీ సభ్యులు బండి కిషోర్, వేముల కిరణ్, వెంకటేశ్వరరావు, సురేష్, నగేష్, ప్రసాద్, చావా రాము, వినయ్ చౌదరి సహా అందరినీ ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు అమర్, ముత్యాల వెంకటప్పారావు, దొండేటి అశ్విని కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

బ్లూమ్ అవార్డ్స్ దక్కించుకున్న భద్రాచలం చిన్నారి

విశాలాంధ్ర - భద్రాచలం : భద్రాచలంలోని యమజాల నగర్ కాలనీకి చెందిన వరదా సతీష్, సత్యనాగ లక్ష్మికు ఇద్దరు కుమార్తెల శ్రీ యాన్వి భగవద్గీత పారాయణం లో విశ్వ గురు వరల్డ్ రికార్డ్ దక్కించుకుంది. ఈ మేరకు ఆదివారం చిన్నారికి హైదరాబాద్‌లోని ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్‌లో అవార్డ్ బహూకరించారు. తల్లి సత్యనాగలక్ష్మి ప్రత్యేక శ్రద్ధతో భగవద్గీత లోని అన్ని శ్లోకాలను కంఠస్థం చేయడం తో శృంగేరిలో భగవద్గీత శ్లోకాలు వినిపించి గతంలో మొదటి బహుమతి సాధించింది. తల్లిని సూర్తిగా తీసుకొని చిన్న కూతురు శ్రీయాన్వి ఆరు నెలల నుంచి భగవద్గీతలోని శ్లోకాలను కంఠస్థం చేయడం నేర్చుకుంది. నాలుగు సంవత్సరాల వయసు ఉన్న శ్రీ యాన్వి భగవద్గీత శ్లోకాలను ఏకధాటిగా చెప్పడంతో అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఈ సందర్భంగా శ్రీ యాన్వి కుటుంబ సభ్యులు అనేకచోట్ల ప్రదర్శనలు ఇచ్చారు. ఈమెతోపాటు 8 ఏళ్ల పెద్ద కుమార్తె శ్రీ నిధి కూడా అనేక చోట్ల భగవద్గీత శ్లోకాలు చూడకుండా చెప్పి అనేక బహుమతులు అందుకున్నారు. చిన్న కుమార్తె శ్రీయాన్వి 50 శ్లోకాలు, దక్షిణామూర్తి స్తోత్రం ,బాల రామాయణం లో కొన్ని శ్లోకాలు అందరి ముందు ప్రతిభావంతంగా చెబుతూ ప్రశంసలు అందుకుంటుంది. వరల్డ్ రికార్డ్ సాధించాలని తల్లిదండ్రుల ఆశను చిన్నారి నెరవేర్చింది. ఈ అవార్డు దక్కించుకున్న చిన్నారిని భద్రాచలం టెంపుల్ ఈవో దామోదర్ అభినందించారు.

అమెజాన్ బజార్ లావాదేవీలలో 8 రెట్లు పెరుగుదల

బెంగళూరు: అమెజాన్ బజార్ తన అత్యంత సరసమైన స్టోర్, ఒక సంవత్సరం క్రితం ప్రారంభించినప్పటి నుండి లావాదేవీలలో ఎనిమిది రెట్లు పెరుగుదలను సాధించిందని, ప్రధానంగా టైర్ 2, టైర్ 3 నగరాల్లో దత్తత ద్వారా ఇది సాధించిందని ప్రకటించింది. అమెజాన్ బజార్ ఫ్యాషన్, ఆభరణాలు, గృహాలంకరణ, కిచెన్‌వేర్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు వంటి వర్గాలలో రూ.600 లోపు అన్ని వస్తువులతో విస్తృత శ్రేణి ఉత్పత్తులను అందిస్తుంది. ఇప్పటికే 2 కోట్లకు పైగా ఉత్పత్తులు అందుబాటులో ఉన్నందున, బజార్ నిరంతరం కస్టమర్ విభిన్న అవసరాలు, ఎంపికలను తీర్చడానికి ఎంపికలను జోడిస్తోంది. అన్ని భారతీయ కస్టమర్లకు ట్రెండీ, బడ్జెట్-స్నేహపూర్వక ఉత్పత్తులకు ప్రాప్యతను అందిస్తుంది. ఈ సీజన్‌లో అమెజాన్ బజార్‌లో అత్యంత యాడ్-టు-కార్ట్ ఉత్పత్తుల్లో ఎలిగెంట్ సిరామిక్ వైట్ బాటిల్-షేప్డ్ వాజ్ రూ.190కే పొందవచ్చు. చేతితో తయారు చేసిన కాటన్ మాక్రేమ్ వాల్ హ్యాంగింగ్ మిర్రర్ సెట్‌ను రూ.498కే పొందవచ్చు. మాక్రేమ్ ప్లాంట్ హ్యాంగర్‌ను రూ.189కే పొందవచ్చు. అలాగే, ప్లాస్టిక్ స్టోరేజ్ బాక్స్ రూ.125 ధరకు, మల్టీ-పర్పస్ మగ్ సెట్ రూ.189 ధరకు, వింటర్ వేర్ డ్రెస్ రూ.499 ధరకు, పెండెంట్ నెక్లెస్ సెట్ రూ.284కు, పురుషుల ఫుల్ స్లీవ్ కార్డ్యురాయ్ జాకెట్ రూ.499కి పొందవచ్చు.

గెలిపిస్తే నిజాయిగా పని చేస్తా..

అభివృద్ధి ఏంటో చూపిస్తా...
ప్రచారంలో బేతంచర్ల నర్సవేణి

విశాలాంధ్ర - చర్ల : తనను ఎన్నికల్లో గెలిపిస్తే నిజాయితీగా పని చేస్తూ అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తానని మండల కేంద్రం చర్ల గ్రామంలో స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బేతంచర్ల నర్సవేణి ప్రచారం చేస్తున్నారు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను బడుగు బలహీన వర్గాల పేద ప్రజలకు అందేలా కృషి చేస్తానంటున్నారు. గత గ్రామ పాలకుల తరహా కాకుండా త్రికరణశుద్ధితో అవినీతికి అవకాశం లేకుండా బాధ్యతలు నిర్వహిస్తానని హామీ ఇస్తున్నారు. సమగ్ర అభివృద్ధి ఎలా ఉంటోందో చేసి చూపిస్తానని ఓటర్లలో ఆమె భరోసా ఇస్తూ ఆకట్టుకుంటున్నారు. చర్ల మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో ఇక్కడ పోటీ చేస్తున్న అభ్యర్థులు చాలా ప్రతిష్టగా భావించి విజయం కోసం ఎవరి శాలిలో వారు విస్తృత ప్రచారానికి దిగి ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. అందులో నరవేణి కూడా భిన్నంగా ప్రచారం చేస్తూ ముందుకు వెళ్తున్నారు. తటస్థ, నిశ్శబ్ద ఓటర్లు ఈమెకు పడతాయని భావిస్తున్నారు. తెలంగాణ మలి దశ ఉద్యమకారులు సీనియర్ బీజేపీ నాయకులు జనసేన బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చానని ఆమె స్పష్టం చేస్తున్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న నాయకులు కావాలో... కేవలం అధికారం కోసం ఎన్నికలప్పుడే వాలీ పోయి పదవులు వచ్చాక మొఖం చాటేసి నాయకులు కావాలో మీరే నిర్ణయించుకోండని' ఆమె ఓటర్లను ఆకటుకునేలా ప్రచారం చేస్తున్నారు. మీ అమూల్యమైన ఓటును బ్యాట్ గుర్తుపై వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించినట్లయితే పంచాయతీ అభివృద్ధి కోసం అనునిత్యం శ్రమిస్తానని ఆమె భరోసా ఇస్తున్నారు. గ్రామంలో సెంట్రల్ లైటింగ్, నీటి, రోడ్ల సమస్య, డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరుస్తామని చెప్తున్నారు.

కందిసుబ్బారెడ్డిని అభినందించిన ఎమ్మెల్యే పాయం

ఏకగ్రీవ సర్పంచులకు సన్మానం

విశాలాంధ్ర - పినపాక : పినపాక మండలం లోని కిష్టాపురం, పాత రెడ్డిపాలెం గ్రామపంచాయతీల సర్పంచులు ఏకగ్రీవం కావడానికి కీలకపాత్ర పోషించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంది సుబ్బారెడ్డి చాలా వ్యూహాత్మకంగా కృషి చేశారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు కార్యకర్తలను ఆయన గొప్పించి మరీ కాంగ్రెస్ పార్టీకి సర్పంచ్ పదవులు దక్కేలా చేయడం విశేషం. ఈ పరిణామాలతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చాలా సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనను అభినందించారు. ఆదివారం ప్రత్యేకంగా ఆయనను శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కిష్టాపురం సర్పంచ్ కారం పాపారావు, పాత రెడ్డిపాలెం సర్పంచ్ సాగబోయిన నాగ కుమారి లను పిలిపించి ఎమ్మెల్యే శాలువాలు కప్పి అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వారితో మాట్లాడుతూ సర్పంచ్ పదవిని చాలా కీలకమని బాధ్యతగా వివరించాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. సర్పంచులను ఏకగ్రీవం చేసిన స్థానిక ప్రజలకు ప్రత్యేకంగా ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నూతన దిశ చూపే సర్పంచ్ రేండ్ల శారద-కుమారస్వామి

విశాలాంధ్ర, మంథని: ఒక గ్రామం పురోగతిని సాధించాలంటే నమ్మకమైన నాయకత్వం, పారదర్శకమైన పాలన, ప్రజల సమస్యలను అర్థం చేసుకునే హృదయం అవసరం. ఈ లక్షణాలన్నింటినీ కలిగిన వ్యక్తే కలవచర్ల సర్పంచ్ అభ్యర్థి రేండ్ల శారద-కుమారస్వామి. సామాన్య ప్రజల కోసం పనిచేయాలన్న సంకల్పం, గ్రామ సమస్యలను దగ్గరగా గమనిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేసే విధానం వారిని ప్రత్యేక వ్యక్తిగా నిలబెడుతుంది. రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో రేండ్ల శారద-కుమారస్వామి సర్పంచ్ అభ్యర్థి బరిలో ఉండగా ఆదివారం గ్రామంలో గడప గడప నా సుమారు 300 వందల మందితో భారీగా ప్రచారం నిర్వహించారు. బ్యాట్ గుర్తుకే మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని, ఒక్క అవకాశం ఇస్తే గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానంటూ జోరుగా ప్రచారం కొనసాగించారు. ప్రేమే లక్ష్యం-సేవే మార్గం అంటూ వారు ముందుకెళ్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా గ్రామానికి వారు చేస్తున్న సేవ లు ప్రజలను ఆకర్షితులుగా మారుస్తున్నాయి. స్మశాన వాటిక నిర్మాణం, పోచమ్మ గుడి నిర్మాణం, నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ, కుట్టు మిషన్ ల పంపిణీ వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడంలో రేండ్ల శారద-కుమారస్వామి తనదైన మార్క్‌ని నిలబెట్టుకున్నారు. ఇతరులకు సహాయం చేయడంలో ముందుండే స్వభావం, ప్రతి ఇంటి సమస్యను తన సమస్యగా భావించే మనసు, గ్రామం మారాలి అనే నిజమైన కోరిక ఇవన్నీ వారి వ్యక్తిత్వాన్ని మరింత గొప్పగా చూపిస్తాయి. ప్రజలందరితో సమానత్వంగా మెలగడం, వారి అభిప్రాయాలను వింటూ తీసుకునే నిర్ణయాలు గ్రామ ప్రజాస్వామ్యానికి కొత్త పుంతలు తొక్కిస్తాయి. ఈ దిశగా సర్పంచ్ బరిలో రేండ్ల శారద-కుమారస్వామి దూసుకెళుతున్నారు.

మండలంలో రాజకీయ సమీకరణాలు మారనున్నాయా.?

బోనకల్, విశాలాంధ్ర: రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మండలంలో రాజకీయ సమీకరణాలు మారనున్నాయా అంటూ మండల ప్రజలు అంటున్నారు. మరో నాలుగు రోజుల్లో జరగనున్న గ్రామపంచాయతీ. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఏ పార్టీకి ఆ పార్టీ వారు గెలుపే లక్ష్యంగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. మండలంలో మొత్తం 22 గ్రామపంచాయతీలు ఉండగా అధికారం కాంగ్రెస్ పార్టీకి ఎన్ని పంచాయతీలు కైవసం చేసుకోనున్నాయి.? మండలంలో కొన్ని పంచాయితీలలో సిపిఎం, బిఆర్ఎస్ తెలుగుదేశం, బిజెపిలు పొత్తులు ఉండగా అధికంగా గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోబోతున్నదా అనేది మండలంలో నడుస్తున్న చర్చ.? దీనికి తోడు మండలంలో ఒకటి రెండు గ్రామపంచాయతీలో సర్పంచ్ కి స్వతంత్ర అభ్యర్థులు కూడా పోటీ చేశారు.

స్థానిక సంస్థ ఎన్నికల్లో ఎత్తుకడలు వేస్తున్న నాయకులు.?

అధిక గ్రామ పంచాయతీల కైవసం కోసం కాంగ్రెస్ నాయకుల విశ్వ ప్రయత్నాలు.?

ప్రచారంలో దూసుకుపోతున్న స్వతంత్ర అభ్యర్థులు

మండలంలో కూటమి వైపు మొగ్గు చూపుతున్న ప్రజలు..

స్వతంత్ర అభ్యర్థుల పోటీతో కాంగ్రెస్ పార్టీకి నష్టం చేకూరుతుందా, లేదా లాభం చేకూరుతుందా అనేది మండలంలోని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమంలో స్వతంత్ర అభ్యరులుగా పోటీ చేసిన వారి నామినేషన్ ఉపసంహరణ కొరకు కాంగ్రెస్ నాయకులు విశ్వ ప్రయత్నాలు చేశారు. కానీ వారి ప్రయత్నాలు కొన్ని చోట్ల ఫలించాయి. మరి కొన్నిచోట్ల ఫలించలేదు. స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉండడంతో కాంగ్రెస్ నాయకులలో కొంత అలజడి ఉన్నట్లు మండలంలో నడుస్తున్న చర్చ. నామినేషన్ ఉపసంహరించుకొని స్వతంత్ర అభ్యర్థులు కూడా ప్రచారంలో దూసుకుపోతున్నారు. వీరి ప్రచారంతో వివిధ పార్టీల నాయకులు మరిన్ని ఎత్తు గడలు వేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపి స్తుంది.? అధికంగా గ్రామ పంచాయతీలు కాంగ్రెస్ పార్టీకి చేసుకోవడానికి మండలంలోని కాంగ్రెస్ నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది.

త్యాగమూర్తి అంబేద్కర్ : గడిపల్లి కవిత

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : జీవితాంతం తన వ్యక్తిగత సుఖసంతోషాలను త్యాగం చేసి, తన భార్య పిల్లల జీవితాలను కూడా ఫణంగా పెట్టి దేశ ప్రజల స్వేఛ జీవితాలు, మనుగడ కోసం భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సైనికుడిలా శ్రమించారని మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ గడిపల్లి కవిత, సింగరేణి రిటైర్డ్ ఉన్నతాధికారి గడిపల్లి కృష్ణ ప్రసాద్ లు అన్నారు. జిల్లా షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ కాలేజీ గర్ల్స్ హాస్టల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గడిపల్లి కవిత,కృష్ణ ప్రసాద్ తోపాటు తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ పాల్గొని మాట్లాడారు. డాక్టర్ అంబేద్కర్ సేవలను ఒక్కొక్కటిగా విద్యార్థులకు వివరించారు.

భారతదేశంలో కుల వివక్షకు, అసమానతలకు వ్యతిరేకంగా అంబేద్కర్ చేసిన పోరాటాలను వివరించారు. స్వతంత్ర ఫలాలు లభించి 70 ఏళ్లు దాటిన నేటికీ దేశంలో కుల వివక్ష పోలేదన్నారు. రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన పాలకుల నిర్లక్ష్యం కారణంగా దేశంలో ఆర్థిక రాజకీయ సామాజిక అసమానతలు బాగా పెరిగిపోతున్నాయని కోట శివశంకర్ అన్నారు. బాబా సాహెబ్ కృషి వల్ల రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల కోసం బహుళ బహుజన వర్గాలు ఏకతాటిపై వచ్చి ఉద్యమించాల్సిన అవసరం ఉందని ముఖ్యంగా యువతరం తమ హక్కుల పోరాటానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

వర్తమానం పరిస్థితులు భారత రాజ్యాంగం గడ్డు పరిస్థితిలో ఉందని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత బహుజన వర్గాలపై ఉందన్నారు. విద్యార్థులు నిరంతరం దేశంలో జరుగుతున్న పరిస్థితులను అధ్యయనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

నేను చేసిన అభివృద్ధే నన్ను గెలిపిస్తుంది : భూక్య సదర్ లాల్



విశాలాంధ్ర - అశ్వాపురం : గతంలో తాను చేసిన అభివృద్ధి పథకాలు తనను మళ్ళీ గెలిపిస్తాయని అశ్వపురం మేజర్ పంచాయతీలో సర్పంచ్ గా పోటీచేస్తున్న భూక్యా సదర్ లాల్ అన్నారు. కాంగ్రెస్ తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థిగా రంగంలో దిగిన ఆయన ఆదివారం రెండు పార్టీల నాయకులు కార్యకర్తలు తోడు రాగా విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ తాను గతంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. ఇలాంటి అవినీతి అక్రమాలకు ఆస్కారం లేకుండా ప్రజల కోసం పనిచేసినట్లు తెలిపారు. అశ్వాపురంలో ప్రజలను ఓటర్లుగా తాను ఎప్పుడూ చూడలేదని అందరూ నా సోదరులు, అక్కలు, చెల్లెళ్లు, తమ్ముళ్లు మాత్రమే చూస్తూ సేవలందించినట్లు ఈ సందర్భంగా వివరించారు. తాను నివసిస్తున్న ప్రాంతంలో ప్రజలందరినీ తన బంధువులుగా భావిస్తానని చెప్పారు. తనకు దాదాపు 30 ఏళ్ళ పైబడి రాజకీయ అనుభవం ఉందన్నారు. తనపై ఎలాంటి నచ్చులేదన్నారు. తాను 1989 నుండి రాజకీయాల్లోకి రావడం జరిగిందన్నారు. అంతకు ముందు కూడా కేటీపీఎస్ లో 15 సంవత్సరాలు, హెవీ వాటర్ ప్లాంట్ లో 20 ఏళ్ళు ఉద్యోగం చేసి యూనియన్ నేతగా అనుభవాలు గడించానన్నారు. సాధ్యమైనంత వరకు సేవ చేయడం తప్ప..ఎదుటివారు ద్రోహం చేయడం తనకు చేతకాదన్నారు. దివంగత నటులు ఎన్టీఆర్ అంటే వీరాభిమానమన్నారు. 1990 నుండి అశ్వాపురం రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఇక్కడి సీనియర్ నేత బ్రహ్మన్న ప్రోత్సాహంతో, ఆయనకు ఉండే జనాదరణను చూసి రాజకీయాల్లో వచ్చానన్నారు. అప్పటి నుండి ఎన్నో పదవులు చేపట్టి ఎవరికీ అన్యాయం చేయకుండా అశ్వాపురంలో అనేక వీధుల్లో పర్మినెంట్ గా ఎన్నో సీసీ రోడ్డు నిర్మించినట్లు చెప్పారు. తనకు ప్రజల ఆదరణలు ఉన్నాయని ఎవరిని కుట్రలు చేసినప్పటికీ తనను ఓడించలేరని స్పష్టం చేశారు. కొందరు తన వయసు మీద ఎగతాళి చేస్తు పోటీలో గెలవలనుకుంటున్నారని ఎద్దేవాచేసారు. తాను పోటీ చేస్తున్న ఫుట్బాల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ కాంగ్రెస్ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అమెజాన్స్ ఎవ్రీడే ఎసెన్షియల్స్ నుండి శీతాకాలపు వెల్‌నెస్ పిక్స్

బెంగుళూరు: దేశమంతటా చలికాలం అడుగుపెట్టేందుకు సిద్ధంగా ఉన్న తరుణంలో, సౌకర్యం, నివారణాత్మక సంరక్షణ, ఇంకా దైనందిన సంక్షేమం చుట్టూ, సంవత్సరంలోని ఈ సమయం పరిభ్రమిస్తుంది. సరళమైన రోగనిరోధక బూస్టర్లు, నెమ్మదింపజేసే రెమెడీలు మొదలుకుని మీకు ప్రియమైన వ్యక్తులు సౌకర్యవంతంగా ఉండేందుకు సహకరించే తెలివైన పిక్స్, శీతాకాలానికి అవసరమైన సామాగ్రులు చలి రోజులను సులభంగా దాటుకుని వెళ్ళగలిగేట్లు చేస్తాయి. చంటిపిల్లలను వెచ్చగా ఉంచేందుకు, ముసలివారికి చల్లని రోజుల్లో సహకారంగా నిలిచేందుకు, లేదా పెంపుడు జంతువులు లేదా మీకు నచ్చినవాటిని వెచ్చగా ఉంచేందుకు, ఈ సీజన్, చలికాలాన్ని ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతమైనదిగాను, ఆనందదాయకమైనదిగాను మార్చగలిగిన ఒక ఆచరణాత్మకమైన, సౌకర్యవంతమైన ఛాయిస్‌ల కోసం పిలుపునిస్తోంది. దీనితో ఈ కాలానికి సిద్ధం కావటం, ప్రతి ఇంటికీ అవుతుంది - సరళం, స్మార్టర్, ఆనంద దాయకం. కొత్త ప్రత్యేకమైన స్టోర్‌ఫ్రంట్లు బేబీ గిఫ్టింగ్, ప్రీమియం బేబీ కేర్‌లను కస్టమర్లు ఎక్స్‌ప్లోర్ చేయగలుగుతారు.

బైచుంగ్ భూటియా రెసిడెన్షియల్ ఫుట్‌బాల్ అకాడమీ హైదరాబాద్ ట్రయల్స్

ముంబయి: భారతదేశంలో అతిపెద్ద, అత్యంత రేటింగ్ పొందిన ఫుట్‌బాల్ అభివృద్ధి కార్యక్రమాలలో ఒకటైన బైచుంగ్ భూటియా ఫుట్‌బాల్ స్కూల్స్ (బీబీఎఫ్ఎస్), భారతదేశం అంతటా ఉన్న ప్రసిద్ధ బోర్డింగ్ పాఠశాలలతో కలిసి సంస్థ యొక్క ప్రధాన హై-పెర్ఫార్మెన్స్ ఫుట్‌బాల్ శిక్షణ మరియు విద్యా పాఠ్యాంశమైన బీబీఎఫ్ఎస్ రెసిడెన్షియల్ అకాడమీ కోసం ప్రతిభావంతులైన యువ విద్యార్థి-అథ్లెట్లను గుర్తించడానికి హైదరాబాద్‌లో స్కౌటింగ్ ట్రయల్స్‌ను నిర్వహిస్తుంది. ఈ ట్రయల్స్ 2025 డిసెంబర్ 14 ఆదివారం హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ది లీగ్ ఫెసిలిటీలో జరుగుతాయి, పాల్గొనే వారు ఉదయం 10:00 గంటలకు రిపోర్ట్ చేయాలి. 2010, 2016 మధ్య జన్మించిన ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొనడానికి అర్హులు. ట్రయల్స్‌కు హాజరయ్యే పాల్గొనేవారు ధృవీకరణ కోసం చెల్లుబాటు అయ్యే ప్రభుత్వ గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి. వారు జెర్సీలు, షార్ట్స్, ఫుట్‌బాల్ బూట్లు మరియు షిన్ గార్డ్‌లతో సహా పూర్తి ఫుట్‌బాల్ దుస్తులలో రిపోర్ట్ చేయాలి, ఇవి పాల్గొనడానికి తప్పనిసరి. ట్రయల్ సెషన్‌లో అధిక-తీవ్రత కార్యకలాపాలు ఉంటాయి. బీబీఎఫ్ఎస్ అధికారిక క్రీడా అభ్యాసం, భాగస్వామ్య వేదిక అయిన ఎన్‌జోగో యాప్ ద్వారా రిజిస్ట్రేషన్లను ఆన్‌లైన్‌లో పూర్తి చేయవచ్చు.

భారత్ కోసం ఏఐ ని మరింత చేరువ చేస్తోన్న అమెజాన్

బెంగళూరు: లభ్యత, ఉత్పాదకత, డిజిటల్ సమ్మిళితను పెంచడానికి భారత ప్రభుత్వ ఏఐ మిషన్‌కు మద్దతు ఇస్తూ, 2030 నాటికి లక్షలాది మంది భారతీయులకు కృత్రిమ మేధస్సు (ఏఐ)ని అందించే ప్రణాళికలను అమెజాన్ ఈరోజు వెల్లడించింది. స్థానిక క్లౌడ్, ఏఐ మౌలిక సదుపాయాలలో 12.7 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడానికి కంపెనీ ప్రణాళిక చేసింది. అంతేకాకుండా దాని విభిన్న వ్యాపారాల ద్వారా 15 మిలియన్లకు పైగా చిన్న వ్యాపారాలకు ఏఐ యొక్క ప్రయోజనాలను తీసుకువస్తుంది. 2030 నాటికి 4 మిలియన్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ అక్షరాస్యత, కెరీర్ అవగాహనను తీసుకురావడానికి అమెజాన్ కట్టుబడి ఉంది. అమెజాన్.ఇన్‌లో షాపింగ్‌ను సులభతరం చేయడానికి, వందల మిలియన్ల మంది కస్టమర్‌లను మరింత లీనమయ్యేలా చేయడానికి కంపెనీ ఏఐ ని ఉపయోగించడాన్ని కొనసాగిస్తుంది. "భారతదేశంలో ఏఐకు గొప్పగా సమం చేసే సామర్థ్యం ఉంది. మరీ ముఖ్యంగా చారిత్రాత్మకంగా ప్రజలను వెనక్కి నెట్టివేసిన భాష, అక్షరాస్యత, యాక్సెస్ అడ్డంకులను ఛేదించగలదు" అని అమెజాన్ ఇండియా కంట్రీ మేనేజర్ సమీర్ కుమార్ అన్నారు. "టైర్-3 పట్టణంలోని ఒక చిన్న వ్యాపార యజమాని నిమిషాల్లో ప్రొఫెషనల్ ఉత్పత్తి జాబితాలను సృష్టించడానికి ఏఐ ని ఉపయోగించగలిగినప్పుడు లేదా ప్రభుత్వ పాఠశాలలో ఒక విద్యార్థి కొత్త కెరీర్‌లకు తలుపులు తెరిచే నైపుణ్యాలను నేర్చుకున్నప్పుడు లేదా టైప్ చేయాల్సిన అవసరం లేకుండా వారి స్థానిక భాషలో కస్టమర్ షాపింగ్ చేసినప్పుడు - అప్పుడే సాంకేతికత నిజంగా అందరికీ సేవ చేసినట్లవుతుందని అన్నారు.

ఐటిసి సంగీత సమ్మేళన్ 2025 గ్రాండ్ సక్సెస్

కోల్‌కతా: ఐటిసి సంగీత రీసెర్చ్ అకాడమీ (ఐటిసి-ఎస్ఆర్ఏ) డిసెంబర్ 5 నుండి7వరకు అందించిన 54వఐటిసి సంగీత సమ్మేళన్ 2025, భారత దేశం అంతటా ఉన్న అభిరుచులు, విద్యార్థులు, సంగీత ప్రియులను ఆకర్షించి, అఖండ ప్రశంసలతో ముగిసింది. అకాడమీలోని సుందరమైన పచ్చిక బయళ్లలో జరిగిన ఈ మూడు రోజుల ఉత్సవం, దాదాపు ఐదు దశాబ్దాలుగా ఐటీసీ-ఎసఆర్ఏ పాటిస్తున్న కళాత్మక సంప్రదాయమైన భారతీయ శాస్త్రీయ సంగీతం లోతు, వైవిధ్యం,ఆధ్యాత్మిక గొప్పతనాన్ని మరోసారి ప్రదర్శించింది. ఈ సమ్మేళనంలో పురాణ కళాకారులు, విశిష్ట గురువులు, నిష్ణాతులైన సహచరులు, అకాడమీ యొక్క సొంతంగా పెరుగుతున్న పండితులు ఉన్నారు. ఇది ప్రేక్షకులకు సంప్రదాయం, నైపుణ్యం, ఆవిష్కరణల అరుదైన సంగమాన్ని అందించింది. ఈ సంవత్సరం ఉత్సవం మూడు రోజుల అసాధారణ శాస్త్రీయ ప్రదర్శనలతోనే కాకుండా, హిందూస్థానీ శాస్త్రీయ సంగీతానికి ఆమె అసమానమైన కృషికి ప్రసిద్ధ గాయని రవీన్‌సుల్తానాకు ప్రతిష్టాత్మకమైన ఐటీసీ సంగీత సమ్మాన్ అవార్డును ప్రదానం చేయడంతో ప్రత్యేక గౌరవ క్షణం కూడా లభించింది. 2025 ఎడిషన్ భారతదేశంలోని అత్యంత శాస్త్రీయ సంగీతకారులైన పర్వీన్ సుల్తానా, అజోయ్ చక్రవర్తి, ఉల్హాస్ కశల్కర్, అశ్విని భిడే దేశ్‌పాండే, సుభ్ర గుహ, ఉదయ్ భావల్కర్ ,ప్రసిద్ధ కర్నాటక ద్వయం రంజని, గాయత్రిల చిరస్మరణీయప్రదర్శనలతోఆకర్షణీయమైన సంగీత ప్రయాణాన్ని అందించింది.

షాప్సీ పండుగ ఆఫర్లు

బెంగళూరు: భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైపర్‌వాల్యూ ప్లాట్‌ఫామ్‌లలో ఒకటైన షాప్సీ బై ఫ్లిప్‌కార్ట్ ఈ పండుగ సీజన్‌లో అపూర్వమైన విజయాన్ని నమోదు చేసింది. భారతదేశం అంతటా టైర్ 2, 3, 4 నగరాల నుండి ఆర్డర్‌లు, కొత్త కస్టమర్‌లు పెరిగారు.ఈ ప్లాట్‌ఫారమ్ యువ దుకాణదారుల నుండి అధిక నిశ్చితార్థం, బలమైన కేటగిరీ వృద్ధి, పునరావృత కొనుగోలుదారులలో పదునైన పెరుగుదలను చూసింది. ఇది అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల ధోరణులను, హైపర్‌వాల్యూ ఇ-కామర్స్‌పై నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ పండుగ సీజన్‌లో అభివృద్ధి చెందుతున్న భారత్ కేంద్రాల నుండి బలమైన సహకారాన్ని ప్రదర్శించింది.